www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 17-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 200

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి సా. 4.56 తదుపరి పాడ్యమి; నక్షత్రం: రేవతి సా. 4.20, వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.10.04-10.50, మ.2.42-3.29; అమృతఘడియలు: మ.2.13-3.37; రాహుకాలం: ఉ.1.30-3.00; సూర్యోదయం: 6.12, సూర్యాస్తమయం: 5.48

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొ. బాలకిష్టారెడ్డి


బాలకిష్టారెడ్డి

వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ పురుషోత్తం
మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా దనావత్ సూర్య
బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా గోవర్ధన్
నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల జారీ
ప్రపంచంతో పోటీ పడేలా ఉన్నత విద్యలో సంస్కరణలు, సిలబస్‌లో మార్పులు: బాలకిష్టారెడ్డి


దనావత్ సూర్య

14

కులగణన.. ఒకే దఫాలో..

రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి వివరాల సేకరణ.. 10-15 రోజుల్లో ప్రక్రియ పూర్తి

మరో 10-15 రోజుల్లో ఆన్‌లైన్‌లో నమోదు
54-60 ప్రశ్నలతో సిద్ధమైన ప్రశ్నావళి
త్వరలో షెడ్యూల్ విడుదల చేయనున్న ప్రభుత్వం
గణన పూర్తయ్యాక సర్కారుకు కమిషన్ నివేదిక
బీసీలకు స్థానిక ఎన్నికల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లను సూచించనున్న కమిషన్



హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులాలు, ఉపకులాల వారీ లెక్క తేల్చేందుకు రంగం సిద్ధమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లోని కులాలు, వాటి ఉపకులాల వివరాలతో పాటు ఆయా కులాలకు చెందినవారి సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతుల వివరాలనూ ప్రభుత్వం సేకరించనుంది. ఈ మేరకు రాష్ట్రంలో నిర్వహించబోయే కులగణనకు అవసరమైన ప్రొఫార్మాను బీసీ కమిషన్ రూపొందించింది. దాదాపు 54-60 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇక ఎప్పటి నుంచి కులగణన చేపట్టాలనే షెడ్యూల్‌ను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. షెడ్యూల్ విడుదలయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దఫాలో కులగణన చేపట్టి వివరాలను సేకరించనున్నారు. దాదాపు 10-15 రోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సుమారు 80 వేల మంది ఎన్యుమరేటర్లు, 10 వేల మంది సూపర్‌వైజర్లు అవసరమవుతారని బీసీ కమిషన్ అంచనా వేసింది. అయితే ఇంత పెద్దమొత్తంలో సిబ్బంది కమిషన్‌కు అందుబాటులో లేకపోవడంతో.. ఆ బాధ్యతను ప్రభుత్వం రాష్ట్ర ప్రణాళిక విభాగానికి అప్పగించింది. దీంతో కులగణనకు అవసరమైన సిబ్బందిని అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి తీసుకోవాలని ప్రణాళిక విభాగం నిర్ణయించింది. గణన షెడ్యూల్, ప్రశ్నావళిని ప్రభుత్వం విడుదల చేసిన తరువాత.. సిబ్బందిని విభాగాల వారీగా తీసుకోనున్నారు. అనంతరం వారికి హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనింగ్

మిగతా 13వ పేజీలో...

తాత్కాలిక డీజీపీలా?

అడ్‌హక్ డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు ఆగ్రహం
తెలంగాణ, ఏపీ సహా 8 రాష్ట్రాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు
21లోపు వివరణ ఇవ్వాలని సీఎస్‌లు, తాత్కాలిక డీజీపీలకు ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక డీజీపీలను నియమించుకోవడంపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమించిన ఎనిమిది రాష్ట్రాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, బిహార్ రాష్ట్రాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమించాయంటూ హరియాణాకు చెందిన వినోద్‌కుమార్ దాఖలు చేసిన

మిగతా 13వ పేజీలో...



సుప్రీంకోర్టులో న్యాయదేవత కొత్త విగ్రహం!

చట్టం గుడ్డిది కాదన్న సందేశాన్నిచ్చేలా కళ్లకు గంతల తొలగింపు
చేతిలో ఖడ్గం స్థానంలో రాజ్యాంగం

2

ఎక్కడి వారు అక్కడికి వెళ్లాల్సిందే!

తెలంగాణ అయితే ఏంటి? ఏపీ అయితే ఏంటి?
ముందు రిపోర్ట్ చేయండి.. తర్వాత విచారిస్తాం
ఐఏఎస్ అధికారులు అయితే.. స్టే ఇవ్వాలా?
ప్రతిసారీ జోక్యం చేసుకుంటే పాలనకు ఇబ్బంది
మీరు ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలి
ఏడుగురు ఐఏఎస్‌లకు స్పష్టం చేసిన హైకోర్టు
డీవోపీటీ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరణ
స్టే కోసం ఐఏఎస్ అధికారుల పట్టు
పిటిషన్లను కొట్టివేసిన న్యాయస్థానం
ఆంధ్రప్రదేశ్‌కు వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్ రోస్
తెలంగాణకు సృజన, శివశంకర్, హరికిరణ్



హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఉన్న ఐఏఎస్ అధికారులకు హైకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. ఈ నెల 16న ఎవరికి కేటాయించిన రాష్ట్రాల్లో వారు రిపోర్ట్ చేయాలంటూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరుతూ ఏడుగురు ఐఏఎస్ అధికారులు హైకోర్టులో బుధవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను అత్యవసరంగా విచారించేందుకు జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం అంగీకరించింది. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత పిటిషన్లను విచారణకు స్వీకరించింది. విచారణ సందర్భంగా

మిగతా 13వ పేజీలో...

ఆంధ్రప్రదేశ్‌కు ఐదుగురు ఐఏఎస్‌లు

తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ సీఎస్ ఆదేశాలు
వారి స్థానాల్లో కొత్తవారికి బాధ్యతలు
జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరిది
ఏపీ నుంచి రాష్ట్రానికి ఇద్దరు ఐఏఎస్‌లు
నేడు మరొకరి రాక

13

ఐపీఎస్‌ల బదిలీలకు రంగం సిద్ధం

'ఫోన్ ట్యాపింగ్' దర్యాప్తు అధికారికీ స్థానచలనం!
ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి అప్రాధాన్య పోస్టులు
కేంద్ర సర్వీసు నుంచి వచ్చిన అకున్ సబర్వాల్‌కు కీలక పోస్టు.. డిప్యుటేషన్‌పై ఎన్‌పీఏకు ఇద్దరు ఐపీఎస్‌లు?

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 3% పెంపు



2

ఆరు రబీ పంటల కనీస మద్దతు ధర కూడా..
గోధుమలకు క్వింటాకు అదనంగా రూ.150
కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

కడప నగరంలో బస్టాండు రోడ్డు వర్షం నీటితో కాలువను తలపిస్తున్న దృశ్యం



సీమపై జలఖడ్గం!

దూసుకొస్తున్న వాయుగుండం.. గుంటూరు వరకూ ప్రభావం
నేడు చెన్నైలో తీరం దాటే చాన్స్.. ఏపీలో 8 జిల్లాలకు వరద హెచ్చరిక
ఇప్పటికే విస్తారంగా వానలు.. నేడూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు
తెలంగాణలో నేడు, రేపు మోస్తరు వర్షాలు.. పలు జిల్లాలకు యెల్లో అలర్ట్

14

నిజ్జర్ కేసు దర్యాప్తులో భారత్ సహకరించాలి

కెనడాను సమర్థించిన అమెరికా, యూకే, ఆస్ట్రేలియా
ఆరోపణలను సీరియస్‌గా పరిగణించాలని భారత్‌కు సూచన
అమిత్ షా ఆదేశాలతోనే దాడులు
'వాషింగ్టన్ పోస్ట్' కథనం
నిఘా సమాచారమే తప్ప గట్టి ఆధారాలు లేవు: ట్రూడో
విచారణ కమిషన్ ముందు వెల్లడి



న్యూఢిల్లీ, అక్టోబరు 16: కెనడాలో చోటుచేసుకున్న హింసాత్మక నేరాలతో భారత అధికారులకు సంబంధం ఉందన్న ఆరోపణలపై అమెరికా, యూకే, ఆస్ట్రేలియా స్పందించాయి. ఇరు దేశాల మధ్య సాగుతున్న దౌత్య వివాదం నేపథ్యంలో కెనడాకు మద్దతుగా నిలిచాయి. నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో తమకు సహకరించాలని కెనడా

మిగతా 2వ పేజీలో...

అతివేగంతో అంతులేని విషాదం!

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి వాగులోకి దూసుకెళ్లిన కారు
ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురి దుర్మరణం
మృతుల్లో ముగ్గురు బాలికలు, ముగ్గురు మహిళలు
మెదక్ శివ్వంపేట మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ దిగ్భ్రాంతి

3



12

మా పనిలో మంత్రి జోక్యమేల?

స్థానిక ఎన్నికల్లో ఇబ్బంది కలగదా?
పార్టీ భవిష్యత్తు దృష్ట్యా ఓపిక పడుతున్నం
మంత్రి కొండా సురేఖపై టీపీసీసీ చీఫ్‌కు వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు



3

హైడ్రాకు జీహెచ్ఎంసీ, మునిసిపల్ అధికారాల బదిలీ

రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు
కూల్చివేతలకు న్యాయపరమైన ఇబ్బందులు తొలగినట్లే
హైడ్రాకు మరింత బలం చేకూరింది: కమిషనర్ రంగనాథ్



13

4 లక్షల మందికి దీపావళిలోపు రుణమాఫీ

సీజన్‌కు రూ.7,500 'రైతు భరోసా'
ఈ ఏడాది నుంచే రైతు పంటల బీమా
ఏ పంటకైనా ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది: మంత్రి తుమ్మల

పోయేది ఎక్కువ.. వచ్చేది తక్కువ

మరో ప్రైవేట్ వైద్య కళాశాలకు గ్రీన్ సిగ్నల్
రాష్ట్రంలో 27కు చేరిన ప్రైవేటు మెడికల్ కాలేజీలు
21 నుంచి కొత్త కళాశాలల్లో ఎంబీబీఎస్ తరగతులు

14

తెలంగాణ ఎంబీబీఎస్ సీట్లపై ఉత్తరాది విద్యార్థుల కన్ను
అక్కడి నుంచి మన రాష్ట్రానికి మూడేళ్లలో 1,500 మంది!
అఖిల భారత కోటాలో 617 సీట్లు.. మనవాళ్ల అనాసక్తి
తెలంగాణ విద్యార్థులు చేరేది 100 నుంచి 120 మధ్యనే
రాష్ట్రంలో ఉత్తరాది వారికి అనుకూలమైన సంస్కృతి



హైదరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఎంబీబీఎస్ సీట్లు ఉత్తరాది విద్యార్థులకు వరంగా మారాయి. అఖిల భారత కోటాలో ఆప్షన్‌గా మన రాష్ట్రాన్నే పెట్టుకుంటున్నారు. ఏటా సుమారు 500 మంది ఇక్కడి ప్రభుత్వ కళాశాలల్లో చేరుతున్నారు. మూడేళ్లుగా ఈ ధోరణి పెరుగుతోందని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం 1,500 మంది పైగా ఉత్తరాది రాష్ట్రాల వారు తెలంగాణలో ఎంబీబీఎస్ చేస్తున్నారని పేర్కొన్నాయి. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్ యువత ఆసక్తి చూపుతున్నట్లు తెలిపాయి. రాష్ట్రంలో మూడేళ్లలో 25 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. దీంతో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య బాగా పెరిగి.. 4,115కు చేరాయి. అయితే, వీటిలో 15 శాతం అఖిల భారత కోటాకు కేటాయించాలి. అంటే.. 617 సీట్లు. వీటికి దేశవ్యాప్తంగా ఎవరైనా పోటీ పడవచ్చు. అఖిల భారత కోటా లేకుంటే అన్ని సీట్లు మన రాష్ట్ర విద్యార్థులకే దక్కుతాయి. అంటే.. అఖిల భారత కోటాలో చేరడంతో వచ్చేది తక్కువ.. పోయేది ఎక్కువ అన్నట్లుగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులూ

మిగతా 3వ పేజీలో...

రేషన్ సన్నబియ్యం.. 24 లక్షల టన్నులు

ఇందుకు కావాల్సిన ధాన్యం 36 లక్షల టన్నులు.. ఏడాది బియ్యం కోటా.. వానాకాలంలోనే సేకరణ
జనవరి నుంచే బియ్యం పంపిణీకి ఏర్పాట్లు.. కార్యాచరణ సిద్ధం చేసిన పౌర సరఫరాల శాఖ



హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... తగినంత ధాన్యం సేకరించడంపై దృష్టి సారించింది. ఈ వానాకాలం సీజన్‌లో ఉత్పత్తి అయిన ధాన్యంతోనే ఏడాది కి సరిపడా బియ్యం నిల్వలు సిద్ధం చేసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎన్ని టన్నుల బియ్యం కావాలి? ఎంత ధాన్యం సేకరించాలి? అనే అంశాలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 2లక్షల టన్నుల చొప్పున ఏడాదికి 24 లక్షల టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ లెక్కన మొత్తం 36లక్షల టన్నుల

మిగతా 3వ పేజీలో...

బకాయిలున్న మిల్లర్లకు ధాన్యం ఇవ్వబోం

14

ఉపేక్షించేది లేదు.. కఠిన వైఖరి అవలంబిస్తాం
మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం
సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే వచ్చేది 58% బియ్యమే
పరిహారం చెల్లించాలి: మిల్లర్లు

పేదరిక భారతం!

దుర్భర పేదరికంలో 12.9 కోట్ల మంది

ప్రపంచ బ్యాంకు నివేదిక



న్యూఢిల్లీ, అక్టోబరు 16: దేశాన్ని పేదరికం వెంటాడుతూనే ఉంది. తాజాగా 2024-ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం దేశంలో 12.9 కోట్ల మంది ప్రజలు దుర్భర పేదరికంలోనే బతుకీడుస్తున్నారు. వీరి ఆదాయం రోజుకు రూ.181 కన్నా తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. అయితే, 1990లో 43.1 కోట్ల మంది పేదలు ఉండగా వీరి సంఖ్య తగ్గుతూ వచ్చిందని తెలిపింది. 2021 నాటికి 3.8 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. మధ్యస్థ ఆదాయ దేశాల్లో రోజుకు రూ.576 సంపాయించేవారిని పేదలుగా పరిగణిస్తూ రూపొందించిన ఈ నివేదికలో భారతదేశ పరిస్థితి దారుణంగా ఉందని తెలిపింది. రోజుకు రూ.576 సంపాయించే వారిని ప్రామాణికంగా తీసుకున్నప్పుడు 1990ల కన్నా భారత్‌లో పేదరికం దారుణంగా ఉందని పేర్కొంది. దీనికి కారణం జనాభా పెరుగుదలేనని వివరించింది. ఇటీవల భారత ప్రభుత్వం విడుదల చేసిన గృహ వినియోగం, వ్యయ సర్వేలో ఈ వివరాలను వెల్లడించలేదని పేర్కొంది. కాగా, ఆఫ్రికా సహా పలు దేశాల్లో 2030 నాటికి దుర్భర పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోతే.. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టసాధ్యమని నివేదిక వెల్లడించింది. పేదరిక నిర్మూలనా చర్యలు ప్రపంచ వ్యాప్తంగా చాలా మందగమనంలో ఉన్నాయని ఆక్షేపించింది. ఈ పరిస్థితి ఇలానే సాగితే మరికొన్ని శతాబ్దాలు పట్టే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ప్రపంచ పేదరికంలో భారత్ వాటా మాత్రం కొన్ని దశాబ్దాలలోనే తగ్గే అవకాశం ఉందని, దీనికి కారణం జీడీపీ వృద్ధి పెరుగుతోందని వివరించింది.

ఆర్థిక అభద్రతలో అతివలు!

200 కోట్ల మందికి ఆర్థిక భద్రత కరువు: ఐరాస



న్యూఢిల్లీ, అక్టోబరు 16: ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు ఉపాధి సహా ఆర్థికంగా ఎలాంటి వెసులుబాట్లు లేక ఆర్థిక అభద్రతలో జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి(ఐరాస) మహిళా నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆఫ్రికా సహా పలు దేశాల్లో ఈ పరిస్థితి ఉందని వివరించింది. సామాజిక భద్రత కల్పించడంలోనూ మహిళలు లింగ వివక్షను ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. సామాజిక భద్రతగా పేర్కొనే నగదు లబ్ధి, నిరుద్యోగ భృతి, పింఛన్లు, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి కల్పన, ఉద్యోగాలు వంటివి కడు దూరంలో ఉన్నాయని పేర్కొంది. గురువారం(అక్టోబరు 17).. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరాస ఈ నివేదికను విడుదల చేసింది. అభివృద్ధి చెందిన దేశాల్లో 2015 తర్వాత పరిస్థితిలో కొంత మార్పు కనిపించినా.. లింగ సమానత్వం, సామాజిక భద్రతలు మాత్రం లక్ష్యాలను ఇంకా చేరుకోలేదని పేర్కొంది. 25-34 ఏళ్ల వయసున్న మహిళలు.. ఇదే వయసున్న పురుషులతో పోల్చుకుంటే 25 శాతానికి పైగా పేదరికంలోనే ఉంటున్నారని నివేదిక తెలిపింది.

లోకం తీరు



సుప్రీంకోర్టులో న్యాయదేవత కొత్త అవతారం!

- చట్టం గుడ్డిది కాదన్న సందేశాన్నిచ్చేలా కళ్లకు గంతల తొలగింపు.. చేతిలో ఖడ్గం స్థానంలో రాజ్యాంగం



న్యూఢిల్లీ, అక్టోబరు 16: సుప్రీం కోర్టులో కొన్ని మార్పులతో కొత్త న్యాయదేవత (లేడీ ఆఫ్ జస్టిస్) విగ్రహం దర్శనమిచ్చింది. చట్టం గుడ్డిది కాదన్న సందేశా న్నిచ్చేలా న్యాయదేవత కళ్లకు కట్టి ఉండే నల్ల రిబ్బన్‌ను తొలగించడంతో పాటు అన్యాయాన్ని శిక్షించడంలో ప్రతీకగా నిలిచే చేతిలోని ఖడ్గం స్థానంలో రాజ్యాంగాన్ని కొత్త విగ్రహంలో చేర్చారు. న్యాయదేవత మరో చేతిలా కనిపించే త్రాసును అలాగే ఉంచారు. సుప్రీంకోర్టులోని న్యాయమూర్తుల గ్రంథాలయంలో ఈ కొత్త విగ్రహం కనిపించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ ఆదేశాల మేరకు న్యాయదేవత విగ్రహంలో మార్పులు చేసినట్లు సమాచారం. బ్రిటిష్ వలస వాద చట్టాలకు స్వస్తి పలుకుతూ కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో న్యాయ దేవత విగ్రహంలోనూ మార్పులు చేయాలని గతంలోనే జస్టిస్ చంద్రచూడ్ సూచించారు. 'న్యాయదేవత కళ్లకు గంతలు అవసరం లేదు. చట్టం ఎప్పుడు గుడ్డిది కాదు. అది అందరినీ సమానంగా చూస్తుంది. కత్తి హింసకు ప్రతీకగా కనిపిస్తోంది. కానీ న్యాయస్థానాలు రాజ్యాంగ చట్టాల మేరకు న్యాయాన్ని అందజేస్తాయి' అని అన్నారు.

మసీదులో 'జై శ్రీరామ్' అంటే మనోభావాలు దెబ్బతీసినట్టు కాదు: కర్ణాటక హైకోర్టు

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మసీదులో జైశ్రీరామ్ నినాదాలు చేయడం మతపరమైన మనోభావాలకు భంగం కలిగించడం కాదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. మసీదులో జై శ్రీరామ్ నినాదాలు చేశారని దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీన్ని విచారించిన కర్ణాటక హైకోర్టు, మంగళవారం కొట్టివేసింది. 2023 సెప్టెంబరు 24వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో మసీదులోకి ప్రవేశించి జై శ్రీరామ్ నినాదాలు చేయడం వివాదాస్పదమైంది. కాగా, ఆ ప్రాంతంలో హిందువులు, ముస్లింలు సామరస్యంగా జీవిస్తున్నారని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారని, అలాంటప్పుడు జై శ్రీరామ్ నినాదాలతో మతసామరస్యానికి ఎలాంటి ఇబ్బంది తలెత్తిందని విచారణ సందర్భంగా జడ్జి నాగప్రసన్న ప్రశ్నించారు. మతాన్ని అవమానిస్తే సమస్యలు తలెత్తుతాయని, జై శ్రీరామ్ అంటే చట్టాన్ని ఉల్లంఘించినట్టు కాదని స్పష్టం చేశారు.

ముడా ఛైర్మన్ మరిగౌడ రాజీనామా



బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) ఛైర్మన్ పదవికి కె.మరిగౌడ రాజీనామా చేశారు. ముడా ఇంటి స్థలాల వివాదంపై ఈడీ, లోకాయుక్త దర్యాప్తు చేస్తున్న తరుణంలో ఆయన రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. నగరాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి దీపాచోళన్‌కు బుధవారం ఆయన రాజీనామా లేఖను సమర్పించారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. సీఎం సిద్దరామయ్యకు మరిగౌడ అత్యంత ఆప్తులు. 1983 నుంచి సిద్దరామయ్యతోపాటు మరిగౌడ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. రాజీనామా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'సీఎం సూచన మేరకు రాజీనామా చేశాను. రాజీనామాకు నా అనారోగ్యం కూడా కారణమే. నాపై ఒత్తిడి ఏమీ లేదు. ఆరోగ్య కారణాలతోనే రాజీనామా చేశాను' అన్నారు. 'దర్యాప్తు కొనసాగుతోంది. అవకతవకలు జరిగాయా? లేదా? అనేది దర్యాప్తులో తేలుతుంది' అని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

పెన్షనర్ల ఫిర్యాదులను 21రోజుల్లో పరిష్కరించాలి

న్యూఢిల్లీ, అక్టోబరు 16: పెన్షనర్ల ఫిర్యాదులను 21 రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్ని మంత్రిత్వ శాఖలు/విభాగాలను కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. ఒకవేళ ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటే ఆమేరకు మధ్యంతర సమాచారం ఇవ్వాలని పేర్కొంది. పెన్షనర్ల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగమైన సెంట్రలైజ్డ్ పెన్షన్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీపీఈఎన్‌జీఆర్ఏఎంఎస్) పోర్టల్‌ను సమీక్షించిన అనంతరం సమగ్ర మార్గదర్శకాలను కేంద్రం జారీ చేసింది. ఫిర్యాదులను త్వరితగతిన, సమర్థవంతంగా పరిష్కరించేందుకుగాను ఈ మార్గదర్శకాలను జారీ చేసినట్టు సిబ్బంది మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. మంత్రిత్వ శాఖలు/విభాగాలు పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సంబంధిత ఫిర్యాదులను నెలవారీ సమీక్ష చేపట్టాలని తెలిపింది.

జమిలి, ఉమ్మడి పౌరస్మృతి తప్పనిసరి: వెంకయ్య

న్యూఢిల్లీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పౌర స్మృతి, జమిలి ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా అమలు చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి, పంచాయితీలకు నెల రోజుల తర్వాత ఎన్నికలు నిర్వహించడం అవసరమని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు సకాలంలో పంచాయితీ ఎన్నికలను నిర్వహించడం లేదన్న ఆయన ఈ ఎన్నికలను తప్పనిసరి చేయాలన్నారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జమిలి ఎన్నికలను వ్యతిరేకించేందుకు రాజకీయ కారణాలు ఏవీ లేవన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే ఓటర్ల జాబితా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మాటిమాటికీ ఎన్నికల నిర్వహణ వల్ల భారీ వ్యయం భరించాల్సి ఉండడం, ప్రవర్తనా నియమావళి వల్ల అభివృద్ధి కుంటుపడడం వంటి సమస్యలు జమిలి వల్ల తొలగి సుస్థిరత ఏర్పడుతుందన్నారు. జమిలి ఎన్నికల వల్ల ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్న అభిప్రాయంతో తాను ఏకీభవించనన్నారు.

వాననీటిలోనే చెన్నై శివారు ప్రాంతాలు

చెన్నై, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చెన్నైకి ముప్పు తప్పింది. వాయుగుండం నేపథ్యంలో చెన్నై సహా 9 జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించిన వాతావరణశాఖ బుధవారం ఉపసంహరించుకుంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే చెన్నైలో చెదురుమదురు జల్లులు మినహా పెద్దగా వర్షమేమీ పడకపోవడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మంగళవారం కురిసిన కుండపోత వర్షం కారణంగా చెన్నై శివారు ప్రాంతాలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. కాగా, కన్యాకుమారి జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు సముద్రతీర ప్రాంతాల్లో 10 నుంచి 15 అడుగుల ఎత్తున అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తీర ప్రాంతాల్లోని జనావాసాల్లోకి సముద్రపు నీరు చేరడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. భారీ వర్షాల కారణంగా నీలగిరి జిల్లా కున్నూరు-ఊటీ మధ్య పలు చోట్ల రైలు పట్టాలపై మట్టి చరియలు, బండరాళ్లు విరిగిపడ్డాయి. దీంతో ఊటీ కొండరైలును తాత్కాలికంగా రద్దు చేసిన రైల్వే శాఖ మరమ్మతు పనులు చేపడుతోంది.

నిజ్జర్ కేసు దర్యాప్తులో భారత్ సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

కోరుతోందని, కానీ భారత్ ఆ మార్గాన్ని ఎంచుకోలేదని అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూ ముల్లర్ మంగళవారం వ్యాఖ్యానించారు. 'ఇంతకు ముందు చెప్పినట్లుగా ఈ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి. ఈ అంశాన్ని భారత్ సీరియస్‌గా పరిగణించి దర్యాప్తులో కెనడాకు సహకరించాలి. అయితే వారు భిన్నమైన మార్గాన్ని ఎంచుకొన్నారు' అని పేర్కొన్నారు. కాగా, కెనడా ప్రధాని ట్రూడో సోమవారం సాయంత్రం యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. 'భారత్‌పై కెనడా ఆరోపణలకు సంబంధించిన పరిణామాలపై వారిద్దరూ చర్చించారు. చట్టబద్ధమైన పాలన ప్రాధాన్యాన్ని అంగీకరించారు. దర్యాప్తులో సమాచారం ఇచ్చి పుచ్చుకోవాలని నిర్ణయించారు' అని యూకే ప్రధాని కార్యాలయం తెలిపింది. మరోవైపు న్యూజిలాండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్ కూడా కెనడాకు మద్దతు పలికారు. ఒట్టావా లేవనెత్తిన ఆరోపణలు నిజమని తేలితే పరిస్థితి చాలా ఆందోళనకరంగా మారుతుందని హెచ్చరించారు. భారత్, కెనడా దౌత్య వివాదంపై స్పందించడానికి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ నిరాకరించారు. కెనడా ప్రధానితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. అయితే, ఆస్ట్రేలియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ ఎఫైర్స్ అండ్ ట్రేడ్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ, అన్ని దేశాల సార్వభౌమాధికారాన్ని, చట్టబద్ధమైన పాలనను గౌరవించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. కాగా, కెనడాలో ఖలిస్థానీ మద్దతుదారులపై దాడుల వెనుక కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా) సీనియర్ అధికారి పాత్ర ఉందని ఆ దేశ అధికారులు ఆరోపించారని పేర్కొంటూ 'వాషింగ్టన్ పోస్టు' తాజాగా ఒక కథనాన్ని ప్రచురించింది. కెనడాలోని భారత దౌత్యవేత్తల మధ్య జరిగిన సంభాషణలు, మెసేజ్‌ల్లో ఈ విషయాన్ని గుర్తించినట్లు వారు భారత ప్రభుత్వానికి సమాచారం అందించారని తెలిపింది. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌తో కెనడా భద్రత, విదేశాంగ శాఖ ఉన్నతాధికారులు ఈ నెల 12న సింగపూర్‌లో భేటీ అయ్యారని, ఈ సందర్భంగా నిజ్జర్ హత్య కేసుతో పాటు తమ దేశంలో దాడులకు సంబంధించిన ఆధారాలను అందించారని పేర్కొంది. ఈ కథనంపై భారత విదేశాంగ శాఖ గానీ, కేంద్ర హోంశాఖ గానీ స్పందించలేదు.



విచారణ కమిషన్ ముందు హాజరైన ట్రూడో

తీవ్రంగా పరిగణిస్తున్నాం: భారత్

అమెరికా పౌరుడు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తున్నామని భారత్ ప్రకటించింది. ఈ అంశంపై చర్చించడానికి భారత్ నియమించిన దర్యాప్తు అధికారుల బృందం అమెరికా న్యాయశాఖ, విదేశాంగ శాఖ అధికారులతో మంగళవారం వాషింగ్టన్‌లో సమావేశమైంది. గత కొన్ని నెలలుగా తాము భారత ప్రభుత్వంతో ఈ అంశంపై చర్చలు జరుపుతున్నామని, దానికి కొనసాగింపుగా ఇప్పుడు మరోసారి భేటీ అయినట్లు అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూ ముల్లర్ చెప్పారు. అభియోగాల్లో పేర్కొన్న ఆరోపణలు తమ ప్రభుత్వ కార్యకాలపాలను ప్రతిబింబించవని భారత్ స్పష్టం చేసిందని వివరించారు.

భారత్ వ్యతిరేక సమాచారమిచ్చా: పన్నూన్

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కార్యాలయంతో తమ సిఖ్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) సంస్థ టచ్‌లోనే ఉందని, నిజ్జర్ హత్య నేపథ్యంలో భారత్‌కు వ్యతిరేకంగా సమాచారాన్ని వారితో పంచుకున్నట్లు ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ అంగీకరించారు. భారత దౌత్య కార్యాలయానికి చెందిన గూఢచర్య నెట్‌వర్క్ గురించి ట్రూడోకు సమాచారం ఇచ్చానన్నారు. భారత్‌పై చేస్తున్న ఆరోపణలు జాతీయ భద్రత పట్ల కెనడా నిబద్ధతకు నిదర్శనమని పన్నూన్ అన్నారు.

నిఘా సమాచారమే తప్ప గట్టి ఆధారాల్లేవ్!

నిజ్జర్ హత్య కేసులో భారత్ పాత్రపై విచారణ కమిషన్ ముందు నీళ్లు నమిలిన ట్రూడో

అటావా, అక్టోబరు 16: కేవలం నిఘా వర్గాల సమాచారం ఆధారంగానే ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని ఆరోపణలు చేశానని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అంగీకరించారు. ఆ సమయంలో తమ వద్ద కచ్చితమైన ఏ ఆధారాల్లేవని ఒప్పుకొన్నారు. కెనడా వ్యవహారాల్లో విదేశీ జోక్యంపై నిర్వహించిన విచారణ కమిషన్ ముందు హాజరై ఆయన మాట్లాడారు. భారత్‌పై మోపిన ఆరోపణలపై ప్రస్తావిస్తూ.. 'ప్రాథమిక సమాచారం మేరకే నిజ్జర్ హత్య కేసుపై మాట్లాడాను.. స్పష్టమైన సాక్ష్యమేదీ లేదు. ఇదే విషయమై సహకరించాలని భారత్‌ను కెనడా కోరింది. వాళ్ల (భారత్) ఆధారాలు కావాలని కోరారు. అయితే ఆ సమయంలో కెనడా వద్ద నిఘా వర్గాల సమాచారం మాత్రమే ఉంది' అని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని జీ20 సమావేశాల సమయంలో ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. అయితే కెనడాలో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వారిని అరెస్టు చేయాలని సూచించారన్నారు. ఏదేమైనా జీ20 నుంచి తమ దేశానికి వచ్చాకే తెలిసింది.. కెనడాను విమర్శించే ధోరణిని భారత్ అవలంబిస్తోందని స్పష్టమైందని పేర్కొన్నారు.

పెట్రోల్ ట్యాంకర్ పేలి 147మంది సజీవ దహనం

- నైజీరియాలో ఘటన

అబుజా, అక్టోబరు 16: నైజీరియాలో బోల్తా పడిన పెట్రోల్ ట్యాంకర్ నుంచి ఇంధనం తీస్తుండగా మంటలు చెలరేగి కనీసం 147 మంది సజీవదహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జిగావా రాష్ట్రంలోని మజియా పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కనో రాష్ట్రం నుంచి హైవేపై వెళ్తున్న ట్యాంకర్ బోల్తా పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఒక్క సారిగా పెట్రోల్ కోసం ఎగబడ్డారు. ప్రజలను ట్యాంకర్‌కు దూరంగా ఉండమని హెచ్చరించినప్పటికీ ఎవరూ వినలేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో పెట్రోల్ తీసుకుంటుండగా భారీ పేలుడు సంభవించి వంద మందికి పైగా మంటల్లో కాలి బూడిదయ్యారు. కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ చనిపోయారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడిలో మేయర్ సహా 25 మంది మృతి

బీరూట్, అక్టోబరు 16: లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి భీకర దాడులు జరిపింది. దక్షిణ లెబనాన్ నెబాతియే ప్రావిన్స్‌లోని కానా పట్టణంతో పాటు బీరూట్ శివారు ప్రాంతాలపై మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో మేయర్ అహ్మద్ కహిల్ సహా 25 మంది మృతి చెందినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, హెజ్‌బొల్లాకు పట్టున్న ప్రాంతాల నుంచి తక్షణమే ఐక్యరాజ్యసమితి దళాలు వైదొలగాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు డిమాండ్ చేశారు. గతేడాది అక్టోబరు నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో దాదాపు 2300 మంది ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 3 శాతం పెంపు

పెరిగిన ఆరు రబీ పంటల కనీస మద్దతు ధర

గోధుమలకు క్వింటాలుకు అదనంగా రూ.150

న్యూఢిల్లీ, అక్టోబరు 16: కేంద్రం ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక ప్రకటించింది. కరువు భత్యం (డీఏ) 3 శాతం పెంచేందుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోద ముద్ర వేసింది. ఆరు రబీ పంటల కనీస మద్దతు ధర పెంపునకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తాజా పెంపుతో ఇప్పటివరకు ఉన్న 50 శాతం డీఏ 53 శాతానికి చేరింది. పెంచిన డీఏను ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచే అమలు చేయనున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.9,448 కోట్ల అదనపు భారం పడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. డీఏ పెంపుతో దాదాపు కోటి మంది ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందుతారన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని డీఏను కేంద్రం ఏటా రెండుసార్లు సవరిస్తూ ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు మార్చిలో డీఏను 4 శాతం పెంచిన సంగతి తెలిసిందే. ఉత్తరాదిలో ప్రధాన పంట అయిన గోధుమల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) క్వింటాలుకు రూ.150 పెంచింది. దీంతో రూ.2,275 నుంచి రూ.2,425కు పెరిగింది. అత్యధికంగా ఆవాలకు రూ.300 పెంచారు. దీంతో రూ.5,650 నుంచి 5,950కు పెరిగింది. మసూర్ పప్పునకు రూ.275, ఇతర పప్పు ధాన్యాలకు రూ.210, పొద్దుతిరుగుడుకు రూ.140, బార్లీకి రూ.130 పెంచారు. రైతుల ఆదాయం పెంచేందుకు రబీ పంటల మద్దతు ధర పెంచామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

విమానాలకు బాంబు బెదిరింపులపై కేంద్రం ప్రత్యేక దృష్టి

తాజాగా మరో ఏడు విమానాలకు బెదిరింపు

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 17ఏళ్ల బాలుడి అరెస్టు


న్యూఢిల్లీ, అక్టోబరు 16: దేశంలో వరుసగా విమానాలకు బాంబు బెదిరింపులు రావడాన్ని కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం మూడు విమానాలకు బాంబు బెదిరింపులు జారీ చేసిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 17 ఏళ్ల బాలుడిని ముంబయి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగిలిన వారిని కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. రవాణాపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలోనూ బుధవారం ఈ అంశంపై చర్చించినట్లు సమాచారం. ఒక షాపు యజమానితో ఉన్న ఆర్థిక వివాదం కారణంగా ఛత్తీస్‌గఢ్ బాలుడు 'ఎక్స్'లో అతడి పేర ఎకౌంట్ క్రియేట్ చేసి బాంబు బెదిరింపులు జారీ చేయడానికి కారణమైందని ముంబయి పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సోమ, మంగళవారాల్లో వచ్చిన బాంబు బెదిరింపులపై ముంబయి పోలీసులు మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తాజాగా బుధవారం దేశంలో మరో ఏడు విమానాలకు బాంబు బెదిరింపులు ఎదురయ్యాయి. మంగళవారం తొమ్మిది విమానాలకు, సోమవారం మూడు విమానాలకు బెదిరింపులు ఎదురయ్యాయి. మొత్తం మీద 3 రోజుల్లో 19 విమానాలు బాంబు బెదిరింపులు ఎదుర్కొన్నట్లయ్యింది. కాగా, విమానాలకు ఇటువంటి బెదిరింపులు సరికాదని, తీవ్రంగా పరిగణిస్తామని అమెరికా పేర్కొంది.

జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ ప్రమాణం

ప్రభుత్వంలో చేరని కాంగ్రెస్.. బయటనుంచి మద్దతు.. ప్రమాణోత్సవానికి రాహుల్ హాజరు

అఖిలేశ్, కారత్, రాజా, కనిమొళి, సుప్రియా సులే కూడా

శ్రీనగర్, అక్టోబర్ 16: జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం కొలువుతీరింది. శ్రీనగర్‌లోని షెరి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కొత్త సీఎంగా ఒమర్ అబ్దుల్లాతో ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రిగా జమ్మూకు చెందిన సురిందర్ చౌదరి, మరో నలుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక తదితరులు హాజరయ్యారు. ఇండియా బ్లాక్ తరఫున సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్, సీపీఎం నేత ప్రకాశ్ కారత్, సీపీఐ నేత డి.రాజా, డీఎంకే నాయకురాలు కనిమొళి, ఎన్సీపీ శరద్ పవార్ వర్గం తరఫున సుప్రియా సులే, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ తదితరులు హాజరయ్యారు. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వానికి బయటనుంచి మద్దతు ఇవ్వాలని నిర్ణయించిన కాంగ్రెస్ కేబినెట్‌లో చేరలేదు. కాంగ్రెస్ మూడు మంత్రిపదవులు ఆశించగా ఒకటి మాత్రమే ఇస్తామని ఒమర్ స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి వెలుపలినుంచి మద్దతివ్వాలని కాంగ్రెస్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేశాక ఇటీవల జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాల్లో నెగ్గింది. ఎన్సీ కూటమిగా పోటీ చేసిన కాంగ్రెస్ 6 చోట్ల గెలిచింది. ఐదుగురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు, ఒక ఆప్ ఎమ్మెల్యే, ఒక సీపీఎం ఎమ్మెల్యే ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి మద్దతిచ్చారు. దీంతో మొత్తం 55 మంది ఎమ్మెల్యేల బలం ప్రభుత్వానికి ఉంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో 90 నియోజకవర్గాలకు పోటీ జరగ్గా ఐదుగురిని లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేస్తారు. దీంతో సభలో మొత్తం సభ్యుల సంఖ్య 95 కానుంది.



సీఎం పదవి ముళ్ల కిరీటమే

జమ్మూకశ్మీర్ ఎదుట అనేక సవాళ్లున్న ప్రస్తుత తరుణంలో సీఎం పదవి ముళ్ల కిరీటమేనని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా అభిప్రాయపడ్డారు. సీఎంగా తన తనయుడు ఒమర్ అబ్దుల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు దేవుడు అండగా ఉంటాడని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఫరూఖ్ అబ్దుల్లా తండ్రి షేక్ అబ్దుల్లా కూడా జమ్మూకశ్మీర్ సీఎంగా పనిచేశారు. అబ్దుల్లా కుటుంబం నుంచి మూడో తరం సీఎంగా ఒమర్ 2009-2014 మధ్య పనిచేశారు. కాగా, కొత్తగా కొలువుతీరిన నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వంలో ఏకైక మహిళా మంత్రిగా సకీనా ఈటూ ప్రమాణం చేశారు.

హరియాణా సీఎంగా నేడు సైనీ ప్రమాణం

హాజరుకానున్న మోదీ, చంద్రబాబు

చండీగఢ్, అక్టోబరు 16: హరియాణా సీఎంగా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణం చేయనున్నారు. బుధవారం పంచ్‌కులలో జరిగిన సమావేశంలో సైనీని బీజేపీ శాసనసభాపక్షనేతగా నూతనంగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. చండీగఢ్‌లో సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్, కేంద్ర మంత్రులు, బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతున్నారు. సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిశాక పంచ్‌కులాలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఎన్డీయే విస్తృత సమావేశం జరగనుంది. దీనికి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. జమిలి ఎన్నికలు, జనగణన, ఉమ్మడి పౌర స్మృతి తదితర కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నాయి. బీజేపీకి, ఎన్డీయే పార్టీలకూ మధ్య సమన్వయానికి ఒక కమిటీ ఏర్పాటు చేయవచ్చని, ఇదే సమావేశంలో చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది.

ఉభయ కూటముల 'మహా'యుద్ధం!

- మహాయుతి x మహా వికాస్ అఘాడీ
- బీజేపీ నేతృత్వంలోని కూటమి ఒకవైపు
- కాంగ్రెస్ నేతృత్వంలో జట్టు ఇంకోవైపు
- హరియాణా గెలుపుతో బీజేపీ దూకుడు



ముంబై, అక్టోబరు 16: దేశంలో అసెంబ్లీ స్థానాల సంఖ్యాపరంగా రెండో అతి పెద్ద రాష్ట్రం మహారాష్ట్రలో ఎన్నికల పర్వానికి తెరలేచింది. 403 శాసన సభాస్థానాలు ఉన్న ఉత్తరప్రదేశ్ తర్వాత 288 స్థానాలతో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది. దీంతో మహారాష్ట్ర ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనికి తోడు రెండు ప్రధాన కూటముల మధ్య ఈ మహా యుద్ధం జరగనుండడం విశేషం. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లు ఈ ఎన్నికల్లో హోరా హోరీ తలపడనున్నాయి. చిత్రం ఏంటంటే.. ఈ రెండు కూటముల్లోనూ కీలకమైన శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)లకు చెందిన చీలిక నేతలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. దీంతో ఇరు కూటముల మధ్య పొలిటికల్ కెమిస్ట్రీ, అర్థమెటిక్ వంటివి అత్యంత ఆసక్తిగా మారాయి. ఎన్సీపీ, శివసేనల్లోని ఏర్పడిన చీలిక కారణంగా అరడజను మందికిపైగా కీలక నేతల రాజకీయం, భిన్నమైన రాజకీయాలు, మరాఠా కోటా ప్రకంపనలు, పార్లమెంటు ఎన్నికల్లో పుంజుకుని దూకుడు మీదున్న విపక్షం, గత ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న నాటకీయ పరిణామాలు వంటివి ప్రస్తుత ఎన్నికలను శాసించనున్నాయి. అయితే, ఇరు కూటములు కూడా ఇప్పటి వరకు సీట్ల సర్దుబాటుపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం. మరో కీలక విషయం ఏంటంటే.. 2022లో చీలిపోయిన శివసేన, ఏడాది కిందట ముక్కలైన ఎన్సీపీలు చెరో కూటమిలో ఉన్నాయి. ఇప్పుడు ఆయా చీలిక పార్టీల బలాబలాలు తాజా ఎన్నికలతో తేలిపోనున్నాయి. ఈ ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 48 స్థానాలకు గాను మహాయుతి 17 స్థానాలకే పరిమితం కాగా, ఎంవీఏ మాత్రం 30 స్థానాలు దక్కించుకుని సత్తా చాటింది. ఈ పరిణామం సహజంగానే బీజేపీ నేతృత్వంలోని కూటమిని కలవరపెడుతోంది. పైగా, ఇప్పుడు జరుగుతున్నవి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో స్థానిక రాజకీయాలు, సమస్యలపై మరింత ఫోకస్ పెరగనుంది. దీంతో కూటముల ప్రచారం కూడా హోరాహోరీగా సాగనుంది. నిజానికి మహారాష్ట్రలో ప్రస్తుతం ఉన్న రాజకీయం గతంలో ఎన్నడూ లేదు. రెండు కూటముల్లోని ఆరు ప్రధాన పార్టీలు బీజేపీ, శివసేన, ఎన్సీపీ; కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ)లు ప్రభావం చూపడంలో పోటీ పడుతున్నాయి. కాగా, మహారాష్ట్ర రాజకీయాల్లో గత ఐదేళ్లలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2019లో జరిగిన ఎన్నికలకు ముందు ఏర్పడిన కూటమి కుప్పకూలింది. రెండు ప్రధాన పార్టీల్లో చీలికలు రావడం, చీలిపోయిన పార్టీలను ఎన్నికల సంఘం నిజమైన పార్టీలుగా గుర్తించడం వంటివి రాజకీయంగా ప్రభావం చూపాయి. ఇదిలావుంటే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ) చీఫ్ మాయావతి 'ఎక్స్'లో స్పందిస్తూ.. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో తమ పార్టీ ఒంటరిగానే పోటీకి దిగుతుందని పేర్కొన్నారు.

ఇవీ.. కూటములు

మహాయుతి: బీజేపీ, శివసేన(శిండే), ఎన్సీపీ(అజిత్ పవార్)

మహావికాస్ అఘాడీ: కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ)

పోయేది ఎక్కువ.. వచ్చేది తక్కువ

(మొదటి పేజీ తరువాయి)



ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హిందీ రాకపోవడం, సరైన ఆహారం దొరకదనే కారణంగా చాలామంది, ముఖ్యంగా అమ్మాయిల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉత్తరాది రాష్ట్రాలకు పంపేందుకు మొగ్గుచూపడం లేదు. పిల్లలను బయటకు పంపేందుకు వీరు ఏమాత్రం ఆసక్తిగా లేరు. మరీ కొంద రైతే ఏపీలో సీటు వచ్చినా వెళ్లడం లేదని ఆరోగ్య విశ్వ విద్యాలయ వర్గాలు చెప్పాయి. దగ్గర్లోనే కళాశాల ఉండాలనే అభిప్రాయం ఎక్కువమందిలో వ్యక్తమవుతోంది. అందుకే అఖిల భారత కోటాపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కాగా, మన రాష్ట్ర విద్యార్థుల ర్యాంకుల ప్రకారం కనీసం 500-600 మందికి అఖిల భారత కోటాలో సీట్లు వస్తాయని వైద్య వర్గాలు చెబుతున్నాయి. కానీ, రాష్ట్రంలోనే ఉండి ఎంబీబీఎస్ చేయాలన్న ఉద్దేశంలో దరఖాస్తు చేయడం లేదు. 100- 120 మంది మాత్రమే దరఖాస్తు చేసి చేరిపోతున్నారు. టాప్ ర్యాంకర్లు మాత్రం అఖిల భారత కోటాను పట్టించుకోకుండా ఇక్కడే ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొని సీటు పొందుతున్నారు. దీంతో రాష్ట్రానికే చెందిన ఇతర విద్యార్థులు అవకాశాలను కోల్పోతున్నారు. కాగా, ప్రభుత్వం తరఫున 25 కళాశాలలే కాక.. ఐదారేళ్లల్లో హైదరాబాద్ చుట్టుపక్కల 10-15 కొత్త ప్రైవేటు వైద్య కళాశాలు వచ్చాయి. దీంతో సీట్లు పెరిగాయి. ఇక జీహెచ్ఎంసీలో 10 దాకా, 50 కిలోమీటర్లలోపు మరో 10 వరకు ప్రైవేటు కళాశాలలున్నాయి. ఇతర రాష్ట్రాల వారు గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉన్న కళాశాలల్లో చేరేందుకు మొగ్గుచూపుతున్నారు.

రెండేళ్ల కిందట బీలో.. ఇప్పుడు సీలో

తెలంగాణలో ప్రైవేటు వైద్య కళాశాలల్లో బీ, సీ కేటగిరీల్లో చేరేందుకూ ఇతర రాష్ట్ర విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్ల క్రితం బి కేటగిరీలో 50 శాతం మంది వారే చేరేవారు. గత ప్రభుత్వం ఇందులోనూ 85 శాతం సీట్లు స్థానికులకే కేటాయించాలన్న నిబంధన పెట్టింది. దాంతో బయటివారికి అవకాశం లేకుండాపోయింది. ప్రస్తుతం సీ కేటగిరీలో చేరేవారి సంఖ్య పెరుగుతున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణే ముద్దు..

తెలంగాణలో చదివేందుకు ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఆసక్తి చూపడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేవారిపై వివక్ష ఉండదు. ఏపీ, తమిళనాడులో ఇలాంటి పరిస్థితి లేదని విద్యార్థులే చెబుతున్నారు. తమిళనాడుపై అయితే అసలు చూడడమే లేదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. మరోవైపు తెలంగాణలో అన్ని రకాల సంస్కృతులు ఉంటాయి. అన్ని రాష్ట్రాల ఆహారం దొరుకుతుంది. హిందీ, ఆంగ్లం మాట్లాడేవారి సంఖ్య ఎక్కువ కావడంతో ఉత్తరాది విద్యార్థులకు ఇష్టమైనదిగా మారింది. జీవన వ్యయం బెంగళూరు, చెన్నై కంటే తక్కువ. అన్నింటికిమించి మిగతా నగరాల కటే హైదరాబాద్‌కు విమానం, రైల్ ద్వారా గంటల్లోనే చేరుకోవచ్చు.

రేషన్ సన్న బియ్యం 24 లక్షల టన్నులు

(మొదటి పేజీ తరువాయి)

సన్న ధాన్యం సేకరించాల్సి ఉంటుంది. ప్రస్తుత వానాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 143 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనాలు ఉన్నాయి. ఇందులో 80 లక్షల టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు 45 లక్షల టన్నుల సన్న ధాన్యం, 35 లక్షల టన్నుల దొడ్డు ధాన్యం వచ్చే అవకాశం ఉంది. దొడ్డు ధాన్యం ఆడించడం ద్వారా వచ్చే బియ్యాన్ని యథావిధిగా భారత ఆహార సంస్థకు(ఎఫ్‌సీఐ)కి అప్పగించాలని, సన్న ధాన్యాన్ని మాత్రం రాష్ట్ర ప్రజల ఆహార అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకంతో కలిసి రూ.2,800 వరకు చెల్లించనుంది. సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం కలవకుండా వేర్వేరుగా సేకరించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. వాస్తవానికి రాష్ట్రంలో ధాన్యం సేకరణ ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. ఈ నెలాఖరునాటికి వరి కోతలు, ధాన్యం సేకరణ పుంజుకోనున్నాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో సేకరణ ప్రక్రియ జోరుగా సాగనుంది. అయితే, మార్కెట్ ధర బాగుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం తక్కువగా వస్తుందని, లేదంటే ఎక్కువగా వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా 45 లక్షల టన్నులకు అటుఇటుగా సన్నధాన్యం వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే, సన్న బియ్యం పంపిణీకి 36లక్షల టన్నులు సరిపోయే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. ఈ ప్రక్రియలో భారత ఆహార సంస్థ నిబంధనలనే మిల్లర్లకు వర్తింపజేయనున్నారు. వంద కిలోల ధాన్యం మిల్లర్లకు అప్పగిస్తే... 67 కిలోల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. ఆ లెక్క ప్రకారం 36 లక్షల టన్నుల ధాన్యాన్ని ఆడిస్తే.. 24 లక్షల టన్నుల బియ్యం వస్తాయని, ఏడాది కోటాకు ఈ బియ్యం సరిపోతాయని ప్రణాళికలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ముడి బియ్యం ఉత్పత్తి చేసే రైస్ మిల్లులు 2 వేలకు పైచిలుకు ఉన్నాయి. ఇందులో పాత బకాయిలున్న మిల్లులను వదిలేసి... మిగిలిన వాటికి ధాన్యం కేటాయింపులు చేయనున్నారు. రెండు (నవంబరు, డిసెంబరు) నెలల్లో ధాన్యం సేకరణ, మిల్లర్లకు అప్పగింత, 67 శాతం లెక్కన బియ్యం తిరిగి తీసుకునే ప్రక్రియ మొత్తం పూర్తి చేసేలా పౌరసరఫరాల శాఖ ప్రణాళిక రూపొందించింది. యాసంగి సీజన్‌పై ఆధారపడకుండా... ఏడాదికి సరిపడా బియ్యం సేకరణ ఈ వానాకాలం ధాన్యంతోనే పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

- రంగారెడ్డి జిల్లాలో ఘటన



ఊషయ్య, శాంతమ్మ(ఫైల్)

కందుకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. పొట్టకూటి కోసం వలస వచ్చిన వృద్ధ దంపతులు హత్యకు గురయ్యారు. ఈ విషాదకర సంఘటన కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండ లం ముష్టిపల్లి గ్రామానికి మూగ ఊషయ్య(75)- శాంతమ్మ(65) దంపతులు కొత్తగూడలోని వ్యవసాయ క్షేత్రంతో మూడేళ్లగా వాచ్‌మెన్ డ్యూటీతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యవసాయ క్షేత్రం యజమాని మనోహర్‌రావు ఎప్పటిలా బుధవారం ఉదయం ఊషయ్యకు ఫోన్ చేయగా సమాధానం రాలేదు. దాంతో దగ్గర్లోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన మహేశ్ అనే రైతు ఫోన్ చేసి ఊషయ్య దగ్గరకు వెళ్లి చూడమని పురమాయించాడు. మహేశ్ వెళ్లే సరికి శాంతమ్మ ఇంట్లోనే చనిపోయి ఉంది. మరో వంద మీటర్ల దూరంలో ఊషయ్య కూడా విగతజీవిగా పడున్నాడు. పోలీసులు వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వ్యవసాయ క్షేత్రంలోకి వచ్చి శాంతమ్మ గొంతు కోసి హత్య చేశారని, ప్రాణాలు కాపాడుకునేందుకు పారిపోవాలని చూసిన ఊషయ్య వెంబడించి వెనుకనుంచి మెడపై కత్తితో బలంగా కొట్టి చంపేసి ఉంటారని పోలీసులు అంచనా వేశారు.

హైడ్రాకు జీహెచ్ఎంసీ, మునిసిపల్ అధికారాల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పురపాలక శాఖ
- హైడ్రాకు మరింత బలం: కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలోని పలు అధికారాలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కు బదలాయిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ బుధవారం ఉత్తర్వులు (జీవో-191) జారీ చేసింది. జీహెచ్ఎంసీ-1955 చట్టంలోని సెక్షన్ 374-బీ ప్రకారం చెరువులు, పార్కులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్లు, డ్రైన్‌ల పరిరక్షించాల్సి ఉంటుంది. ఈ అధికారాలను హైడ్రాకు బదిలీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. మంత్రివర్గ ఆమోదంతో ఆర్డినెన్సు ప్రతిపాదనలను గవర్నర్‌కు పంపింది. దీనిని ఆమోదిస్తూ ఈ నెల 3వ తేదీన గవర్నర్.. గెజిట్ విడుదల చేశారు. ఈ మేరకు తాజాగా పురపాలక శాఖ జీవో 191ను జారీ చేసింది. ఆర్డినెన్స్, జీవో జారీతో హైడ్రా చర్యలకు సంబంధించి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అధికార వర్గాలు చెబుతున్నాయి. తాజా అధికారాలతో ఆక్రమణలకు సంబంధించి హైడ్రా నోటీసులు జారీ చేయనుంది. ఆయా నిర్మాణదారులు సంబంధిత అనుమతి పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించని పక్షంలో స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేస్తుంది. వారు ఇచ్చే వివరణ అప్పటికీ సహేతుకంగా లేకుంటే నిర్మాణం కూల్చివేత/సీజ్ చేసే అధికారం హైడ్రాకు ఉంటుంది. చెరువులు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలపై ఆదిలో ఉక్కుపాదం మోపిన హైడ్రా... హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొంత కాలంగా ఆచితూచి వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులపై క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టడంతోపాటు చెరువుల వాస్తవ విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై దృష్టి సారించింది. ఇందు కోసం సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్‌సీ సాంకేతిక సహకారం తీసుకుంటోంది. జీవో జారీ నేపథ్యంలో ఇక నుంచి చట్ట పరంగా ముందుకు వెళ్లాలని సంస్థ భావిస్తోంది. వాస్తవానికి రోడ్లు, పార్కులు, చెరువుల్లో ఆక్రమణలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేసే అధికారాలు జీహెచ్ఎంసీతోపాటు మునిసిపాలిటీలకు ఉన్నాయి. కానీ, కూల్చివేతలపై హైకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో నోటీసుల జారీ, స్పీకింగ్ ఆర్డర్స్ తర్వాతే హైడ్రా నిర్ణయం తీసుకోనుంది. ఔటర్‌రింగ్ రోడ్డు వరకు హైడ్రా పరిధి ఉన్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ వరకు జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం, అవలి ప్రాంతాల్లోని 27 మునిసిపాలిటీలు/కార్పొరేషన్ల పరిధిలో మునిసిపల్ చట్టం ప్రకారం ముందుకు సాగనున్నట్టు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. తాజా జీవోతో హైడ్రా మరింత బలపడిందని, పూర్తి స్థాయిలో అధికారాలు వచ్చాయన్నారు. అనధికార భవనాలను కూల్చివేయడంతోపాటు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారికీ హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని తెలిపారు.

రసాయన ట్యాంకులో పడి ఇద్దరు కార్మికుల మృతి

జీడిమెట్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి: జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సాబూరి కెమికల్స్ కంపెనీలో కెమికల్ ట్యాంక్‌లో పడి ఇద్దరు కార్మికులు చనిపోయారు. మృతులు కవల సోదరులు కావడం, ఒకరి కాపాడబోయి మరొకరు మృతి చెందడం విషాదకరం. యాజమాన్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఆ ఇద్దరు చనిపోయారని కార్మికులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా కాట్రాని కోన మండలం దొంతుకూరి గ్రామానికి చెందిన వస్కా లక్ష్మణ్‌రావు (32) రామ్మోహన్‌రావు(32) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గుండ్ల పోచంపల్లిలో ఉంటున్నారు. షాపూర్‌నగర్ కళావతి నగర్‌కు చెందిన సాదు నారాయణరావు అనే కాంట్రాక్టర్ ద్వారా నాలుగు రోజులుగా సాబూరి ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఫ్యాబ్రికేషన్ వర్క్ చేస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కంపెనీలో కెమికల్ ట్యాంక్‌పై పనిచేస్తూ ప్రమాదవశాత్తు లక్ష్మణ్‌రావు అందులో పడ్డాడు. అతన్ని రక్షించడానికి సోదరుడు రామ్మోహన్‌రావు ట్యాంక్‌లోకి దిగి సొమ్మసిల్లి పడిపోయాడు. ఇద్దరూ అందులోనే మృతి చెందాడు. ఈ క్రమంలో మరో కార్మికుడు వెంకటరామిరెడ్డి రసాయనాల వాసనకు స్పృహతప్పి పడిపోవడంతో తోటి సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది.

అతివేగంతో అంతులేని విషాదం

చెట్టుని ఢీకొట్టి వాగులోకి దూసుకెళ్లిన కారు.. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురి మృతి



శివరాం, దుర్గి, శాంతి, శ్రావణి, మమత(ఫైల్)

శివ్వంపేట/ నర్సాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో అమ్మవారి పండుగ జరుపుకుని ఆనందంగా ఇంటికి తిరుగు ప్రయాణమైన ఓ కుటుంబం కథ విషాదాంతమైంది. అతివేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ఎగిరి చెట్టును ఢీకొట్టి ఆపై వాగులోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మెదక్ జిల్లాలో ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో జిల్లాలోని శివ్వంపేట మండలం తాళ్లపల్లితండాకు చెందిన దనావత్ శివరామ్(55), దనావత్ దుర్గి (45) దంపతులు, జగ్యతండాకు చెందిన మాలోత్ అనిత(30) ఆమె కుమార్తెలు మాలోత్ బిందు(14), మాలోత్ శ్రావణి(12), బీమ్లాతండాకు చెందిన గుగ్లోత్ శాంతి(38) ఆమె కుమార్తె గుగ్లోత్ మమత(16) ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి సంబంధించి తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివరామ్ దంపతులు తమ కుమార్తెలు శాంతి, అనిత, మనుమరాళ్లు బిందు, శ్రావణి, మమత, శాంతి భర్త నాన్‌సింగ్‌తో కలిసి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లితండాలోని బంధువుల ఇంటికి మంగళవారం కారులో వెళ్లారు. అక్కడ ఎల్లమ్మ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని బుధవారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మరో అరగంటలో ఇంటికి చేరతారనగా బుధవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి చౌరస్తా నుంచి వెల్దుర్తి వెళ్లే రోడ్డులో ఉసిరికపల్లి సమీపంలో అదుపు తప్పి మన్నెనోని వాగు వద్ద చెట్టును బలంగా ఢీకొట్టి ఆపై వాగులోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా అతి వేగం వల్ల కారు అదుపు తప్పింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు అవ్వగా.. డ్రైవింగ్ సీటులో ఉన్న నాన్‌సింగ్ మినహా అందరూ ప్రాణాలు కోల్పోయారు. కాగా, ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలను తెలుసుకున్నారు.

'పబ్లిక్ నోటీసు జారీ చేసినప్పటికీ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు వ్యతిరేకంగా ఒక్క అభ్యంతరమూ రాలేదు. తర్వాత ఏం చేయాలి?' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. మార్గదర్శి సంస్థ చట్ట వ్యతిరేకంగా డిపాజిట్లు సేకరించిందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ విచారణకు ఉండవల్లి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉండవల్లి వాదనలు వినిపిస్తూ.. ఫార్మాలిటీ కోసమే నోటీసు ఇచ్చారని.. సదరు నోటీసు ప్రజల్లోకి వెళ్లలేదని అన్నారు. - హైదరాబాద్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ ఒమర్...!

కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూప్రాంతానికి చెందిన సురేందర్ కుమార్ చౌదరీని ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఎంచుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు, ఇండియా కూటమికి చెందిన ఇతర నేతల సమక్షంలో శ్రీనగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదారద్దుచేసి, రాష్ట్రహోదాను కేంద్రపాలిత ప్రాంతం స్థాయికి కుదించిన తరువాత తొలిగా ఏర్పాటైన ప్రభుత్వం ఇది. సచివాలయంలో బాధ్యతలు స్వీకరించడానికి వెళ్ళినప్పుడు అధికారులు, ఉద్యోగులు ఒమర్‌కు ఘనస్వాగతం పలికారు. తనతోపాటు ప్రమాణం చేసిన ఉపముఖ్యమంత్రి, మంత్రులతో కలసి ఆయన ఉన్నతాధికారులతో ఓ సమావేశం కూడా నిర్వహించారు. సీఎం కుర్చీలో తాను ఉన్న ఫోటో ఒకటి ట్విటర్‌లో పోస్టు చేసి 'ఐయామ్ బ్యాక్' అని ఓ వ్యాఖ్య కూడా జతచేశారు. 2009–14 మధ్య కాలంలో, అంటే, జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రహోదాను అనుభవిస్తున్న కాలంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ అదే కుర్చీలో కూర్చున్నంతమాత్రాన, ఆ అధికారాలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తనకు ఇప్పుడు లేవని, తన ఉనికిని నిలబెట్టుకోవడానికీ, ప్రజలపక్షాన కేంద్రంతో అనునిత్యం పోరాడక తప్పదని ఆయనకు బాగా తెలుసు.

గతకాలంలో ప్రజలకు, పాలకులకు మధ్య పెరిగిన దూరాన్ని తగ్గించి, ఇది మన ప్రభుత్వం అని జనం అనుకొనేట్టు చేస్తానని ఒమర్ హామీ ఇస్తున్నారు. తనది ప్రజాప్రభుత్వం అనిపించుకోవడానికి పోలీసులకు కొన్ని నిర్దిష్టమైన ఆదేశాలు కూడా జారీచేశారు. తన కాన్వాయ్ కోసం జనం రాకపోకలను అడ్డుకోవడం, లాఠీలు ఊపుతూ ప్రజలను బెదిరించడం ఇత్యాదివి కూడదని ఆదేశించారు. అధికారులతో సైతం సన్నిహితంగా ఉండాలన్న ప్రయత్నం ఆయన మాటల్లో కనిపిస్తోంది. కానీ, కేంద్రం చేయూత లేనిదే అడుగుకూడా వేయలేని స్థితి. ఓ కేంద్రపాలిత ప్రాంతానికి, అందునా జమ్మూకశ్మీర్‌కు సీఎంగా కొనసాగడం లెఫ్టినెంట్ గవర్నర్ ఆశీస్సులతో మాత్రమే సాధ్యం. పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని మోదీ సహా బీజేపీ పెద్దలంతా హామీ ఇచ్చినప్పటికీ, ఒమర్ నాయకత్వంలో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వం ఏర్పడటం ఓ అద్భుతం, అమోఘం అని వారంతా కీర్తిస్తున్నప్పటికీ, రాబోయే రోజుల్లో ఎదురీత అంత సులభం కాదు. సాధ్యమైనంత వేగంగా రాష్ట్రహోదా ఇవ్వాలని ఒమర్ బుధవారం కూడా మరోమారు అన్నారు. కానీ, ఎన్నికల ప్రచారంలో మిగతాపార్టీల కంటే గట్టిగా నేషనల్ కాన్ఫరెన్స్ వాదిస్తూ వచ్చిన అంశం ప్రత్యేకప్రతిపత్తిని తిరిగి సాధించడం. లోయలో ప్రజలు ఆయన పార్టీకి అత్యధిక స్థానాలు కట్టబెట్టడంలో ఇది ప్రముఖంగా పనిచేసిందని అంటారు. కానీ, కేంద్రంతో కలసి పనిచేయవలసిన అవసరం గురించి ఇటీవల ఒమర్ మాట్లాడుతూ, ప్రస్తుతానికి ఈ తీవ్రమైన అంశాన్ని పక్కన బెట్టాల్సి ఉన్నదంటూ వ్యాఖ్యానించడం సయోధ్య సాధనలో భాగం కావచ్చు. బీజేపీ పూర్తిగా తుడిచిపెట్టేసిన జమ్మూమీద కూడా ఆయన ఎంతో ప్రేమ కురిపిస్తున్నారు. అక్కడనుంచి ఐదుగురు ఇండిపెండెంట్ల మద్దతు కూడగట్టుకున్న ఆయన ఆ ప్రాంతానికి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతోపాటు, తమ ప్రభుత్వాన్ని అక్కడివారు సైతం మన ప్రభుత్వం అనుకొనేట్టుగా పరిపాలిస్తామని హామీ ఇస్తున్నారు.

2019 ఆగస్టు 5న కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఈ ఎన్నికల్లో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని, ఒమర్ ప్రభుత్వం ప్రప్రథమంగా ఆ నిర్ణయాలను ఖండిస్తూ అసెంబ్లీలో ఓ తీర్మానం చేయాలని మెహబూబా ముఫ్తీ డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో కేంద్రం నిర్ణయాలకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడిన ఒమర్ పార్టీ ఏం చేయబోతుందో చూడాలి. పదేళ్ళ తరువాత మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు చక్కగా పాల్గొని తమకు నచ్చిన వారిని ఎన్నుకున్నారు. గవర్నర్ ఏలుబడిలో తమ గోడు వినేవారే లేక పోయారని బాధపడుతున్నవారికి కొత్త ప్రభుత్వం ఉపశమనం అందించాలి. సర్వాధికారాలు దఖలుపరచుకున్న కేంద్రప్రభుత్వం గతంలో మాదిరిగా, ఏకపక్షంగా వ్యవహరించడం కాక, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంతో సమన్వయంతో వ్యవహరించాలి. పదేళ్ళుగా వరుస కష్టాలతో గాయపడి ఉన్న జనాన్ని రాజకీయయుద్ధాలతో మరింత వేధించడం సరికాదు. ప్రత్యేకప్రతిపత్తిని పునరుద్ధరించడం అసాధ్యమని కేంద్రం అంటోంది. కానీ, రాష్ట్రహోదా విషయంలో అది న్యాయస్థానంలోనూ, ప్రజాక్షేత్రంలోనూ కూడా హామీ పడింది. ఎన్నికల తరువాత రాష్ట్రహోదా అన్న మాటను ప్రధానిమోదీ, హోంమంత్రి అమిత్ షా వెంటనే నిలబెట్టుకోవాలి. అనేక చట్టసవరణలతో జమ్మూకశ్మీర్‌లో తాము అనుకున్నది చేసుకుపోతున్నవారు, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, వారు ఎన్నుకున్న ప్రభుత్వానికి అండగా నిలవాలి.

హర్యానా పాఠం అందకపోతే, 'మహా' ప్రమాదం!

మధ్యలో ఆటంకాలు వస్తాయేమో అని కొందరు పనులు మొదలు పెట్టనే పెట్టరట. వీళ్లు అధములట. మొదలుపెట్టాక, చిన్న విఘ్నం రాగానే తోకముడిచే వాళ్లుంటారు, వాళ్ల మధ్యరకం వాళ్లు. ఇక, ఆరునూరైనా అవరోధాలు ఎన్ని ఎదురైనా ఉత్తములు మాత్రం పనిపూర్తి చేస్తారట. భర్తృహరి నీతులు చాలా చెప్పాడు కానీ, పని మొదలుబెట్టి, చిన్న విజయం రాగానే అదే మహాద్భాగ్యం అనుకుని, కాడిపడేసే వాళ్ల గురించి మాత్రం రాయలేదు. అప్పటికింకా కాంగ్రెస్ పార్టీ పుట్టలేదు కాబట్టి, ఆ బాపతు మనుషుల గురించి ఆ కవికి తెలియకపోయి కూడా ఉండవచ్చు.

బుధవారం నాడు శ్రీనగర్‌లో ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారానికి హాజరయిన రాహుల్‌గాంధీని, ఆయన సోదరిని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేని చూసినప్పుడు, వారి మీద అపారమయిన జాలి కలిగింది. మొన్నటి ఎన్నికల్లో వారికి దొరికింది ఒక పావుశేరు గెలుపు మాత్రమే. అంత మాత్రానికే వారి ముఖాలు వెలిగిపోతున్నాయి. హర్యానా జారిపోయింది. జమ్మూకశ్మీర్‌లో గెలుపు ఏదైనా ఉందంటే, అది కూడా నైతికమయిన గెలుపు, నేషనల్ కాన్ఫరెన్స్‌ది మాత్రమే. జమ్మూ ప్రాంతంలో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. కేంద్రపాలిత ప్రాంతం మొత్తం మీద బీజేపీ బాగా పుంజుకున్నది. ప్రభుత్వంలో చేరకుండా కాంగ్రెస్ కొంత పరువు దక్కించుకున్నది కానీ, ఆ ప్రభుత్వం మాత్రం ఏ పాటిది? గవర్నర్ కనుసన్నలలో వ్యవహరించవలసివచ్చే జీహుజూర్ సామంతం!

మరి, ఈ కాంగ్రెస్ అల్పసంతోషులు రేపు మహారాష్ట్రలో గట్టి పోటీ ఇస్తారా? జార్ఖండ్‌లో తమ కూటమిని గెలిపించు కుంటారా? వచ్చే ఏటికి బిహార్‌లో బలపడతారా? లేక, భారం అంతా తమతో పాటు నడిచే మిత్రపక్షాల మీదికి తోసి, నిమ్మకు నీరెత్తుతారా? తమకు కాస్త బలం పెరిగే సరికి, ఏ పొత్తూ వద్దని పోజు కొట్టి, హర్యానాలో గర్వభంగం జరిగిన కాంగ్రెస్, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీతో సవ్యంగా కలసి నడుస్తుందా?

పోయిన ఏడాది కర్ణాటకలో బీజేపీ మీద ముఖాముఖి ఘనవిజయం సాధించేసరికి కాంగ్రెస్ గాల్లో తేలిపోసాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు, కాంగ్రెస్‌కు సానుకూలత కూడా పెరుగుతోందని తెలిసినా, పరిస్థితిని పూర్తి అనువుగా మలచుకోవడంలో అగ్రనాయకత్వం సమర్థత అంతంత మాత్రంగానే ఉండడంతో, బొటాబొటి మెజారిటీతో తెలంగాణలో అధికారం దక్కించుకుంది. వరుస బీజేపీ పాలనల తరువాత, ప్రత్యామ్నాయానికి సిద్ధంగా కనిపించినప్పటికీ, మధ్యప్రదేశ్ ఓటర్లను కాంగ్రెస్ ఆకట్టులేకపోయింది. ఇక రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను వ్యతిరేక ఓటుతో పోగొట్టుకున్నది. పొడుపు జోడో యాత్ర తరువాత, అడ్డంగా చేసిన న్యాయ యాత్ర ఫలితమో, ఓటర్లు ఉద్వేగాలను అధిగమించి వాస్తవ జీవనసమస్యల మీద దృష్టి సారించారో లేదో కానీ, సాధారణ ఎన్నికల్లో, కాంగ్రెస్ తన బలాన్ని రెండింతలకు మించి పెంచుకుంది. బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకుండా, 240 దగ్గర నిలిపింది కానీ, ఎన్‌డీఏను, మోదీ మూడో రాకడను నిలవరించలేక పోయింది. యూపీ, మహారాష్ట్ర, హర్యానాల్లో బీజేపీని నేరుగా దెబ్బతీయగలిగినందుకు బహుశా, కాంగ్రెస్ అధిష్ఠానం బాగా అలసిపోయి ఉంటుంది. ఇక చేయాల్సింది, 2029 దాకా వేచిచూడడం మాత్రమే. ఆ లోగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలన్నీ వరుసగా తన బుట్టలో పడవలసినవే అనే పగటికలల్లోకి విశ్రమించి ఉంటుంది.

తన విజయం ఖాయమనుకుని ఆయుధాలు జార విడవడం హర్యానాలో కాంగ్రెస్ ఓటమికి ఒకానొక ముఖ్య



హర్యానాలో స్థానిక అభివృద్ధి అంశాలే ఎన్నికలలో వినిపించాయి కానీ, మహారాష్ట్రలో మత ఉద్రిక్తతల పాత్ర చాలా ఉంటుంది. మహారాష్ట్ర ఎన్నికల పోరాటానికి సన్నాహకాలుగా, ప్రభావ ప్రేరకాలుగా ఆ రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగానూ మత హింస జరగడాన్ని గమనించవచ్చు. మరో పక్క, మహాయుతి కూటమిలో కూడా నాయకత్వ పోటీ ఉన్నది. షిండేను తప్పించి, తమ వాడిని ముఖ్యమంత్రిని చేయాలని బీజేపీ ఆలోచన. లోక్‌సభ ఎన్నికలలో ఎదురుదెబ్బ దృష్టిలో పెట్టుకుని, నాయకత్వ సమస్యను ఎన్నికల తరువాతకి వాయిదా వేసింది. అగాఢీ కూడా అదే పనిచేయబోతోంది. బీజేపీ గనుక మహారాష్ట్రలో గట్టెక్కగలిగితే, ఆ పార్టీ మొన్నటి లోక్‌సభలో తగిలిన దెబ్బ నుంచి గణనీయంగా కోలుకున్నట్టే. అదే జరిగితే తన భవిష్యత్తేమిటో కాంగ్రెస్ ఊహించుకోవాలి.

కారణం. ఏకైక కారణం కాకపోవచ్చు. హర్యానాలో కాంగ్రెస్ గెలుస్తుందని లోక్‌సభ ఎన్నికల సరళి చెప్పింది. రైతు ఉద్యమాల హోరు చెప్పింది. క్షేత్రస్థాయి పరిశీలనలు చేసిన మీడియా వ్యాఖ్యాతలు చెప్పారు. పోలింగ్‌కు ముందు సర్వేలు, తరువాత ఎగ్జిట్‌పోల్స్ చెప్పాయి. అయినా, ఫలితం మాత్రం బీజేపీ హ్యాట్రిక్. ఇప్పుడు నెపాన్ని అందరూ భూపిందర్ సింగ్ హుడా మీదకు నెట్టేయవచ్చు. విజయాన్ని అమిత్ షా వ్యూహరచనకు అంటగడుతున్నప్పుడు, ఓటమికి మాత్రం రాహుల్, ఖర్గే ఎందుకు బాధ్యులు కారు?



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఇక్కడ సమస్య హర్యానాలో స్థానికంగా ఏ కారణాలు పనిచేశాయి, సామాజిక వర్గాల ఏ కూడికలు, తీసివేతలు విఫలమయ్యాయి అన్నది కాదు. వేసుకోవలసిన ప్రశ్నలు ఇవి : హర్యానా విజయం తనకు అత్యవసరమని కాంగ్రెస్ ఎందుకు అనుకోలేదు? లోక్‌సభ ఎన్నికల్లో వ్యక్తమైన సానుకూలతను ఎందుకు జారవిడుచుకుంది? గెలిచే అవకాశం లేదని లోకం కోడై కూస్తున్నా, పట్టుదలగా బీజేపీ ఎట్లా గెలవగలిగింది? లోక్‌సభ ఎన్నికలలో నాలుగు మెట్లు కిందికి జారిన బీజేపీ, హర్యానా గెలుపుతో ఒక మెట్టు తిరిగి ఎక్కగలిగింది. ఈ విజయం, బీజేపీ శ్రేణులలో కొత్త ఉత్సాహం నింపుతోంది. ఎన్‌డీఏలో మిత్రపక్షాల ప్రాధాన్యాన్ని కుదించివేస్తోంది. మా ప్రాభవం తగ్గుతుందనుకుంటున్నారేమో, మళ్లీ మేం పూర్వ వైభవానికి వచ్చేస్తున్నాం.. అంటూ మిడిమిడి గెలుపులకే మూర్ఛపోయిన ప్రత్యర్థులను హెచ్చరిస్తోంది. తీసుకుంటే, హర్యానా ఫలితాల్లో కాంగ్రెస్‌కు తీవ్ర హెచ్చరిక దాగి ఉంది. ఆ ప్రమాదసూచిక ఒకరకంగా కాంగ్రెస్‌కు మేలుచేసేది, మేలుకొల్పేది!

తప్పుల నుంచి నేర్చుకుని, దిద్దుబాటు చేసుకుంటుంది కాబట్టి బీజేపీ హర్యానాలో గెలిచింది అని కొందరు వ్యాఖ్యాతలు అంటున్నారు. అంత ఉదాత్తత ఆపాదించనక్కర లేదు కానీ, దారి సవరించుకునే పద్ధతి అయితే ఆ పార్టీకి ఒకటి ఉంది. ఫలితాలు తమకు ప్రతికూలంగా వచ్చినప్పుడు, లోపం ఎక్కడ ఉందో కనిపెట్టి, విరుగుడు ప్రయోగించడంలో బీజేపీ వ్యూహకర్తలు దిట్టలు. ప్రజలలో వ్యతిరేకతకు కారణమైన విధాన నిర్ణయాలను వెనక్కి తీసుకుని, తిరిగి వారిని ఆకట్టుకునే ప్రయత్నం బీజేపీ పెద్దగా చేయదు. ఒక్క రైతు చట్టాల విషయంలో మాత్రమే వెనుకంజ వేసింది. అదొకటే మినహాయింపు. ప్రజల దృష్టి నుంచి ఆత్మవిమర్శ చేసుకోవడం బీజేపీకి అలవాటు లేదు. అమిత్ షా వంటి బీజేపీ పెద్దలు చేసే ప్రతిక్రియలు ప్రధానంగా సామాజిక సమీకరణాలకు సంబంధించినవి. జాట్ కులస్తులు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారు కాబట్టి, జాటేతరులందరినీ తమ వైపుకుతిప్పుకోవడం బీజేపీ చేసింది. అటువంటప్పుడు, కాంగ్రెస్ ఏమి చేయాలి? తన వెనుక సమీకృతమైన జాట్ బలానికి తోడు, ఇతరులలో నుంచి కూడా గణనీయంగా రాబట్టుకోవాలి. దళిత నాయకురాలు శెల్జాను ప్రచారం నుంచి ఆమడ దూరం పెట్టి కాంగ్రెస్ ఏ ఐక్యతను ప్రదర్శించగలిగింది?

హర్యానాలో కూడా మతతత్వ వాతావరణం, దాన్ని మరింత ఉద్రిక్తం చేసిన సంఘటనల క్రమం ఉన్నది. కానీ, సాపేక్షంగాచూస్తే, బీజేపీ ఈ అసెంబ్లీ ఎన్నికలలో ఆ రాష్ట్రంలో మతవిభజనను పెద్దగా ఉపయోగించుకోలేదు. కాకపోతే, తన పార్టీ వేదికల మీద నుంచి పదే పదే నిరసించే కులవిభజనను మాత్రం బాగా ఉపయోగించుకుంది. కాబట్టి, జాతీయస్థాయిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్న రాజకీయ సంవాదానికి హర్యానాలో ఆస్కారం లేకపోయింది. బీజేపీ ప్రతి వ్యూహాన్ని అర్థం చేసుకోలేకపోవడం, సృజనాత్మకమైన పద్ధతులతో ప్రచారం నిర్వహించకపోవడం, సంప్రదాయ నాయకత్వాన్నే పూర్తిగా విశ్వసించడం కాంగ్రెస్‌ను దెబ్బతీశాయి. తన పునరుజ్జీవనంలో హర్యానా ఒక కీలకమయిన, ఆవశ్యకమైన మజిలీ అన్న స్పృహ కాంగ్రెస్ పెద్దలకు లేకపోవడం అన్నిటి కంటె ఎక్కువ చేటు చేసింది.

హర్యానాలో లాగానే, మహారాష్ట్రలో కూడా మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్షానిదే హవా. మహా వికాస్ అగాడీ మెజారిటీ అసెంబ్లీ సెగ్మెంట్లలో విజయం సాధించగా, అందులో కాంగ్రెస్ వాటా ఎక్కువ. ఇంకేముంది? తామే పెద్దన్నలమనుకుని, పొత్తులో మిత్రులకు అన్యాయం చేస్తే, పిట్టపోరు పిట్టపోరు పిల్లితీరుస్తుంది. హర్యానాలో స్థానిక అభివృద్ధి అంశాలే ఎన్నికలలో వినిపించాయి కానీ,

> బీజేపీ ప్రతివ్యూహాన్ని అర్థం చేసుకోలేకపోవడం, సృజనాత్మకమైన పద్ధతులతో ప్రచారం నిర్వహించకపోవడం, సంప్రదాయ నాయకత్వాన్నే పూర్తిగా విశ్వసించడం కాంగ్రెస్‌ను దెబ్బతీశాయి. తన పునరుజ్జీవనంలో హర్యానా ఒక కీలకమయిన, ఆవశ్యకమైన మజిలీ అన్న స్పృహ కాంగ్రెస్ పెద్దలకు లేకపోవడం అన్నిటికంటె ఎక్కువ చేటు చేసింది.

మహారాష్ట్రలో మత ఉద్రిక్తతల పాత్ర చాలా ఉంటుంది. మహారాష్ట్ర ఎన్నికల పోరాటానికి సన్నాహకాలుగా, ప్రభావ ప్రేరకాలుగా ఆ రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగానూ మత హింస జరగడాన్ని గమనించవచ్చు. మరో పక్క, మహాయుతి కూటమిలో కూడా నాయకత్వ పోటీ ఉన్నది. షిండేను తప్పించి, తమ వాడిని ముఖ్యమంత్రిని చేయాలని బీజేపీ ఆలోచన. లోక్‌సభ ఎన్నికలలో ఎదురుదెబ్బ దృష్టిలో పెట్టుకుని, నాయకత్వ సమస్యను ఎన్నికల తరువాతకి వాయిదా వేసింది. అగాఢీ కూడా అదే పనిచేయబోతోంది. బీజేపీ గనుక మహారాష్ట్రలో గట్టెక్కగలిగితే, ఆ పార్టీ మొన్నటి లోక్‌సభలో తగిలిన దెబ్బ నుంచి గణనీయంగా కోలుకున్నట్టే. అదే జరిగితే తన భవిష్యత్తేమిటో కాంగ్రెస్ ఊహించుకోవాలి.

అధికారంలో ఉన్నా లేకపోయినా, అంతః కలహాలు మాత్రం పుష్కలం. ఐరి గీసి నిలవవలసిన చోట, గురికి జానెడు దూరం ఆ పార్టీ ప్రస్తుత సరళి. విధాన విషయాలలో బీజేపీని అనుకరించే ధోరణి. పదేళ్ల ప్రవాసంలో పెరిగిన అలసత్వం.. తన బాధ్యతా రాహిత్యానికి ఈవీఎం లనో, ఎంఐఎంనో నిందించడం, ఇన్ని జబ్బులు కాంగ్రెస్‌ను బాధిస్తున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ వేసిన ప్రశ్న బాగుంది. "జమ్ములోను, హర్యానాలోను మేము పోటీ చేయలేదు కదా? అయినా కాంగ్రెస్ గెలవలేదేమి?"

రెండో కుర్చీ

కుర్చీలో కూర్చోవడం ఒక్కటే ముఖ్యం కాదు! కూర్చున్న కుర్చీలో కుదురుకోవడమే చాలా ముఖ్యం! ఇంత ముఖ్యమైన విషయాన్ని విస్మరించి ముందుకు పోవడం ఎవరికైనా ఎంతో కష్టమవుతుంది. ఈ కష్టాన్ని ముందే కనిపెట్టకపోతే ఎవరూ కార్యసాధకులు కాలేరు.

ఈ ముందు జాగ్రత్త ఉంది కనుకనే ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ ఒక కొత్త సంప్రదాయానికి తెర తీశారు. ముఖ్యమంత్రి కుర్చీ పక్కనే రెండో కుర్చీని వేయించి ఇది తన అధినేత అయిన అరవింద్ కేజ్రీవాల్ కోసమని సెలవిచ్చారు. ఇక నుంచి తను భరతుని వలె పరిపాలన సాగిస్తానని ప్రకటించారు. మళ్లీ ఎన్నికలకు వెళ్లేంత వరకు ఈ నాలుగు నెలలూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. అంతేకాకుండా 'నన్ను సీఎంను చేసిన వ్యక్తిని సీఎంగా చేయడమే లక్ష్యంగా నేను పని చేస్తాను' అని ప్రతిన బూనారు.

రాజకీయాలలో భక్తి కన్నా, భయం ఎక్కువ ప్రభావాన్ని చూపెడుతూ ఉంటుంది. అది కుర్చీ భయమే అయినట్లయితే ఇక అది మామూలుగా ఉండదు. ఆ భయం తాలూకు చర్యలు అనేక రూపాలలో బయటకు వస్తుంటాయి. ఈ రెండో కుర్చీ వ్యవహారం కూడా అలాంటిదే అని గిట్టనివాళ్ళు గుసగుసలాడుతున్నారు. అయితే ఇల్లలుకగానే పండుగ అవుతుందా? కుర్చీలో కూర్చున్నంత మాత్రాన అంతా కులాసాగా సాగాలని గ్యారెంటీ ఉందా? ఒకవేళ అలా సాగాలని ఎవరైనా అనుకున్నా అలా సాగనిచ్చే వ్యవస్థ ఏదీ అక్కడ ఉండాలని లేదు కదా. కూర్చున్న వారిని చూసి కుతూహల పడే వారి కన్నా కుతకుతలాడే వాళ్ళ సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. కూర్చున్న దగ్గర నుంచి వాళ్లను కూలదోసే ప్రయత్నం చేసే వాళ్లు కూడా పెరుగుతూ పోతుంటారు.



కుర్చీ మౌనంగానే ఉంటుంది. కూర్చునే వ్యక్తి కూడా మౌనంగానే ఉండొచ్చు. కానీ అందులో ఆ వ్యక్తిని ప్రశాంతంగా కూర్చోనిచ్చే వాతావరణమే చుట్టుపక్కల ఉండదు. అదిగో ఆ వాతావరణ ప్రభావం నుంచి పుట్టుకు వచ్చిందే ఈ ఆలోచన అని గిట్టని వాళ్లు చెవులు కొరుక్కుంటున్నారు. ఈమెది భయాన్ని మించిన జాగ్రత్త అనీ, అదిగో ఆ జాగ్రత్త నుంచి పుట్టుకు వచ్చిందే రెండో కుర్చీ ఆలోచన అని కూడా అంటున్నారు. తన కుర్చీకి ప్రమాదం రాకుండా ఉండడం కోసమే ఆమె 'ఆయన' కుర్చీని ముందుకు తీసుకు వచ్చారని ఒక పుకారును పుట్టించి దట్టించి మరీ దేశం మీదకి వదిలేశారు.

ఇది పైకి అధినేతపై భక్తి లాగా కనిపిస్తున్నప్పటికీ సారాంశంలో తన పదవికి ఎలాంటి ఢోకా లేకుండా చేసుకొనేందుకు చేపట్టిన ఇజ్రాయెల్ వాడిన 'ఐరన్ డోమ్' వంటి గట్టి భద్రతా వ్యవస్థ అనే అభిప్రాయాన్ని కూడా ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఇక నుంచి తన పైకి ప్రత్యర్థులు విసిరే రాజకీయ క్షిపణి దాడులన్నిటినీ కూడా తాను అధినేతకు వేసిన రెండో కుర్చీ అడ్డుకుంటుందని ఆమె నమ్మకమై ఉంటుంది!

ఆతిశీ చేసిన ఈ చర్య మనకు తమిళ రాజకీయాలను తలపునకు తెస్తున్నదికదూ! జయలలిత జైలుకు వెళ్ళిన ప్రతిసారీ అధికారాన్ని తన అనుంగు శిష్యుడు పన్నీరు సెల్వానికి అప్పగించడం– ఆయన కన్నీరు పెడుతూ ఈ కార్యాన్ని భుజాన వేసుకోవడం– మళ్ళీ 'అమ్మ' జైలు నుంచి బయటకు రాగానే పదవికి పన్నీరు పూత పూసి ఆమెకు పువ్వుల్లో పెట్టి మరీ అప్పగించడం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఏలుకోరా నాయనా అంటే ఈ ఏడుపు ఎందుకని అప్పుడు చాలా మంది ఆశ్చర్యపోయేవారు. కానీ ఆ ఏడుపు వెనక ఆతిశీకి ఉన్నటువంటి రెండో కుర్చీ లాంటి ఆత్మరక్షణ చర్యలు ఏవీ తనకు లేకపోయెకదా అనే బయటికి కనిపించని బాధ ఏదో ఆయనకు ఎంతో కొంత ఉండే ఉంటుంది. ఈ పదవి 'మూడు, నాలుగు నెలల' ముచ్చటే కదా అనే ఆయన ఆత్మఘోష అటువైపు చెవి యొగ్గి విన్నవాళ్లకు తప్ప ఇతరులెవరికీ వినిపించే అవకాశం లేదు.

ఆతిశీ చేసిన రెండో కుర్చీ ప్రయోగం 'ఆప్' వర్గాలకు నచ్చితే నచ్చవచ్చు, కానీ అందరికీ ఎందుకు నచ్చుతుంది చెప్పండి? అందుకే ఆమె భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించింది అని కమలనాథులు ధ్వజమెత్తారు. అంతేకాకుండా రెండో కుర్చీ రాజ్యాంగ విరుద్ధమని కూడా ప్రకటించేశారు. దీనికి ప్రతిగా ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు ప్రతిదాడికి పూనుకున్నాయి. డబుల్ ఇంజన్ సర్కార్లు అవసరం అంటున్న చోట– డబుల్ కుర్చీ సర్కారు ఎందుకు ఉండకూడదని ఎదురు ప్రశ్నలు గుప్పించాయి.

ఖాళీ కుర్చీ కనిపిస్తే ఎవరో ఒకరు కూర్చుంటారు. అట్లాంటిది అధికారంతో కూడిన ఖాళీ కుర్చీ కనిపించాక ఇక ఊరుకుంటారా? ఆ ఖాళీని పూరించేంత వరకు వాళ్ల ఎదుటివారికి ఖాళీ సమయాన్ని లేకుండా చేసేందుకే ముమ్మర ప్రయత్నం చేస్తారు. భారతీయ జనతాపార్టీ ఢిల్లీ శాఖ ఇక నుంచి ఆ పనిమీదే ఉండబోతోంది. వారికి భాజపా హై(పై)కమాండ్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి మరి!

– గుండెబోయిన శ్రీనివాస్

సాయిబాబా దారుణ యాతనకు కారకులెవరు?


జీవితమంతా వీల్‌చెయిర్‌పై శ్వాసించిన ప్రొ. జి.ఎన్. సాయిబాబా తన దేహ బంధం నుంచి విముక్తి పొందాడు. ఈ దేశవాసుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయాడు. పది సంవత్సరాల పాటు కారాగారం (నాగపూర్ అండాసెల్)లో దారుణ యాతన అనుభవించి, కుదించబడిన శరీర వేదనను భరించి, నిర్దోషిగా బయటికి వచ్చిన విద్యావేత్త! మావోయిస్టులకు సహకరించాడనే నేరంపై, ఈ బీజేపీ ప్రభుత్వం ఎంతో కక్షపూరితంగా సాయిబాబాను నిర్బంధానికి గురిచేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిరసనలు వెలువడినా, పౌరహక్కుల సంఘాల విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం ఖాతరు చేయలేదు.



సాయిబాబా శారీరకంగా వికలాంగుడైనా, మేధోపరంగా ఎంతో క్రియాశీలుడు. కవిగా, రచయితగా సృజనాత్మకత ఉన్న వాడు. అమలాపురంలోని ఒక పేద కుటుంబం నుంచి పెరిగి, ఢిల్లీ విశ్వవిద్యాలయం దాకా ఎదిగిన విద్యావేత్త. ఎవ్వరికీ ఎలాంటి హాని చేసినవాడు కాదు. మావోయిస్టుల పట్ల సానుభూతి ఉండొచ్చు. అంతమాత్రాన ఈ రాజ్యాంగ వ్యవస్థలోని లోపభూయిష్టమైన న్యాయశాఖ కనికరించలేదు. బీజేపీ పాలకవర్గం చట్టం ముసుగులో ఆయన్ని హింసించింది. మిత్రులు వరవరరావు తదితరులకు షరతులతో బెయిల్ ఇచ్చి, ముంబైకే పరిమితం చేసి, పరోక్షంగా ఆంక్షలు విధించి అప్రకటిత శిక్షను అమలు చేస్తున్నది.

వ్యక్తిగా స్వయంగా ఎలాంటి ఆయుధం పట్టలేని ఒక వికలాంగుడైన మేధావి, ఇంతటి నరకయాతన, హింసను పొందడానికి కారకులెవరు? పాపం, పుణ్యం, కర్మ ఫలం లాంటి మాటలను పక్కన పెడితే, అసలు ఈ దేశంలోని న్యాయశాఖ, పాలనా యంత్రాంగంలోని అన్ని విభాగాలు ఆయనపై సాగిన హింసకు బాధ్యులే! అంతిమ దశ దాకా మనోస్థైర్యంతో జీవించిన సాయిబాబాకు విప్లవాంజలి!!

– నిఖిలేశ్వర్



వగరు జ్ఞాపకాల నవ్వు

'వగరు జ్ఞాపకాల నవ్వు' విమల కవిత్వం సభ ఈ నెల 20వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 8:30 వరకు హైదరాబాద్ లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది. కాలం గుండె చప్పుడు ఆధ్వర్యంలో సుధా కిరణ్ అధ్యక్షతన జరిగే ఈ సభలో కె.శ్రీనివాస్, కాత్యాయని ప్రసంగిస్తారు. అనంతరం ఖాదర్ మొహియుద్దీన్, మెర్సీ మార్గరెట్, ఊర్మిళ (శోభాభట్), తాడి ప్రకాష్‌లు విమలతో 'వగరు జ్ఞాపకాల నవ్వు', ఇతర సంబంధిత అంశాలపై సంభాషిస్తారు. అనంతరం బిందు సంస్థ చేత 'కవిత్వ నృత్య ప్రదర్శన', కవిత్వ వీడియో ప్రదర్శన ఉంటుంది.

– మైత్రి శ్రీను

యువ పారిశ్రామికులకు తెరుచుకున్న ద్వారాలు!

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) వెన్నెముక. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమ 4.0 పేరిట నూతన పాలసీని ఇటీవలనే సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రకటించారు. సమ్మిళిత అభివృద్ధి, సమగ్ర ఉపాధి, మెరుగైన ఉత్పాదకత సాధించడానికి ఈ కొత్త విధానం దోహదపడనుంది.

భూమిని తక్కువ ధరకు ఇవ్వడం దగ్గరి నుంచి రుణాలు సులభంగా అందేలా చూడటం వరకు పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా పలు విధానాలు ఎంఎస్ఎంఈ నూతన విధానంలో ఉన్నాయి. గత దశాబ్ద కాలం నుంచి రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2014 నుంచి టీఎస్ ఐపాస్ ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నమోదు 11 నుంచి 15శాతం పెరుగుతూ వచ్చింది. సగటు పెట్టుబడి 2018లో కోటి రూపాయలు ఉండగా 2022కు రూ.2.15కోట్లకు పెరిగింది. రాష్ట్రంలో భౌగోళికంగా, ఇతర అంశాలపరంగా ఎన్నో సానుకూలమైన అంశాలున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రావడం లేదని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ ద్వారా బహుళజాతి కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా విధానాలున్నాయని గుర్తించిన పరిశ్రమల శాఖ చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇస్తూ నూతన పాలసీని రూపొందించింది. కొత్త ఎంఎస్ఎంఈ పాలసీతో ఈ రంగానికి ఏకంగా రూ.4వేల కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 25,000కు పైగా ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దేశ వ్యాప్తంగా పరిశ్రమలపరంగా తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. అదే విధంగా పరిశ్రమల నుంచి సమకూరే స్థూల విలువ ఆధారిత అంశాల పరంగా 8వ స్థానంలో ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పారిశ్రామికవాడల్లో ఎంఎస్ఎంఈలకు స్థలాలను కేటాయించే విధానం ఇప్పటి వరకు ఉంది. దీంతో ఆయా స్థలాలను గవర్నమెంట్ నుంచి కొనాల్సి ఉండటంతో పెట్టుబడి పెరిగేది. పెట్టుబడి రెట్టింపు కంటే అధికమై, పరిశ్రమల నిర్వహణ కూడా కష్టంగా మారేది. ఈ విధానానికి చెక్ పెడుతూ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానంలో లీజు పద్ధతిని ప్రవేశపెట్టింది. పరిశ్రమలు స్థాపించాలనుకున్న వారు 33ఏళ్ల వరకు లీజుకు తీసుకోవచ్చు. దీంతో పారిశ్రామికవేత్తలపై ఆర్థిక భారం తగ్గుతుంది.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవరోధంగా ఉన్న ఇతర అంశాలనూ పరిష్కరించేలా నూతన విధానంలో ఏర్పాట్లు చేశారు. ఇందులో ప్రధానంగా ఆరు విషయాలను పరిగణనలోకి తీసుకున్నారు. భూమి, రుణసాయం, ముడి సరుకులు, వ్యాపారపరమైన మెళకువలు, నూతన సాంకేతికత, మార్కెట్ సదుపాయం కల్పించడం వంటి వాటి పైనే ప్రధానంగా దృష్టి సారించారు. సంస్థల ఏర్పాటు దగ్గర నుంచి అమ్మకాల వరకు ప్రతి అంశంలోనూ ప్రభుత్వం చేదోడువాదోడుగా నిలవనుంది. దీనికోసం ప్రత్యేకంగా ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. పరిశ్రమల మంత్రి, ముఖ్యకార్యదర్శి, పరిశ్రమల

> గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ ద్వారా కేవలం బహుళజాతి కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా విధానాలున్నాయని గుర్తించిన పరిశ్రమల శాఖ చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహాలు ఇస్తూ నూతన పాలసీని రూపొందించింది. కొత్త ఎంఎస్ఎంఈ పాలసీతో ఈ రంగానికి ఏకంగా రూ.4వేల కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.



కమిషనర్, డైరెక్టర్, పారిశ్రామికవేత్తల నుంచి కొంత మంది ప్రతినిధులు ఈ కమిటీలో ఉంటారు. పారిశ్రామికవేత్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలుపర్చాలనే నివేదికను రూపొందించి వాటిని అమలు చేసేలా ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీ చూడనుంది. ఎంఎస్ఎంఈల రిజిస్ట్రేషన్ ఖర్చుతో కూడుకున్న పని అని పలువురు వెనకడుగు వేస్తున్నారు. భూమి, భవన నిర్మాణాల కోసమే 40 నుంచి 50 శాతం ఖర్చు చేయాల్సి వస్తోంది. తగిన వనరుల లేమి, భూమి ధర, శ్రామిక ఖర్చు ఎక్కువగా ఉండడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ ఖర్చులు తగ్గించి, మార్కెటింగ్ సౌకర్యంతో పాటు సాంకేతిక తోడ్పాటు అందించే విధంగా ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీ పనిచేయనుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 35 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉండగా, వీటిలో 26 లక్షలకు పైగా సూక్ష్మ పరిశ్రమలే ఉన్నాయి. ఇందులో సుమారు 30 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. ఇవి కూడా తయారీ, సేవలు, రిటైల్, హోల్‌సేల్ విభాగాల్లో పని చేస్తున్నాయి. మధ్యతరహా పరిశ్రమలైతే వెయ్యి వరకే ఉన్నాయి. వీటి ద్వారా లక్షమందికి పైగా ఉపాధి లభిస్తోంది. ఆ తర్వాత ఆహార తయారీ, ఖనిజ, చెక్క ఆధారిత, ఇంజనీరింగ్, ఎఫ్ఎంసీజీ, టెక్స్‌టైల్స్, ఆటో విడిభాగాల రంగాలు పని కల్పిస్తున్నాయి.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఉంది. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఒక మహిళా పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఎంఎస్ఎంఈలను స్థాపించడానికి వచ్చే మహిళలకు మహిళా శక్తి స్కీం ద్వారా మరింత ప్రోత్సహిస్తారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయనున్నట్టుగా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్తూ వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో మహిళల జనాభా 1.88 కోట్లు. వీరిలో కేవలం 58వేల మంది మాత్రమే మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ఇది జనాభాతో పోలిస్తే 3.1 శాతమే. నూతన విధానంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా రాయితీలు కల్పించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు నిర్వహిస్తున్న వారిలో ఎస్సీలు 15శాతం, ఎస్టీలు 9శాతం, బీసీలు 28శాతంగా ఉన్నారు. సూక్ష్మ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. వీటి ద్వారా లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

ప్రపంచంలో మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతను నిపుణులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఆలోచన చేశారు. స్కిల్ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ట్రైనింగ్ ఇచ్చేందుకు దేశంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్‌బీఐ, న్యాక్, డాక్టర్ రెడ్డీస్, టీవీఏజీఏ, అదానీ, సీఐఐ లాంటి సంస్థలు భాగస్వాములు. ఇదే కాకుండా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140 కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా మార్చేందుకు వీలుగా మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. రాష్ట్రంలోని ఐటీఐ, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సైతం స్కిల్ వర్సిటీ కిందకే రానున్నాయి. రాష్ట్రంలోని 100 నియోజకవర్గాలలో ఐటీఐ లేదా ఏటీసీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వర్సిటీతో పాటు ఐటీఐ, ఏటీసీలలో అన్ని రంగాలపై అనుభవంతో కూడిన నైపుణ్యాన్ని సాధించిన యువతకు ఎంఎస్ఎంఈలు వరంలాగా మారే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురు చూసే యువత ఎంఎస్ఎంఈల వైపు ఆసక్తి చూపనున్నారు. వారు ఉపాధి పొందుతూనే ఎంతో మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం అసాధ్యం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సరికొత్త పాలసీతో పరిశ్రమల ఏర్పాటు ద్వారా 20శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఇదే కాకుండా ప్రత్యేకంగా 30శాతం ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకే మెరుగైన అవకాశాలు లభించనున్నాయి.

■ డా. ఎన్. యాదగిరిరావు
అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ


వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మరో 174 మంది టీచర్లకు పోస్టింగులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 16: వరంగల్ జిల్లాలో డీఎస్సీ-2024లో ఉద్యోగం సాధించిన మరో 174 మందికి వివిధ కేటగిరీల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. జిల్లాలో మంగళవారం ప్రారంభమైన పోస్టుల కేటాయింపు కౌన్సెలింగ్ బుధవారం కొనసాగింది. మంగళవారం కేటాయించిన 80 పోస్టులతో కలిపి మొత్తం 254 పోస్టులను వివిధ పాఠశాలల్లో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు కేటాయించారు. కౌన్సెలింగ్ సజావుగా సాగిందని డీఈవో ఎం. జ్ఞానేశ్వర్ తెలిపారు.

పేదల బతుకుల్లో వెలుగులేవీ?





నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం

- రోజులు మారుతున్నా వీడని పేదరికం
- ఇప్పటికీ కూడు, గూడు కోసం లక్షలాది కుటుంబాల తండ్లాట
- పెరగని తలసరి ఆదాయం.. ఫలితమివ్వని పథకాలు
- పేదరిక నిర్మూలనకు పలు కార్యక్రమాల అమలు
- మహిళల భాగస్వామ్యంతో స్వయం సహాయక సంఘాలు

రోజులు గడిచిపోతున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. సాంకేతికంగానూ ఎన్నో విప్లవాత్మక మార్పులు.. ఆర్థిక సంస్కరణలు వస్తున్నాయి. కానీ పేదల బతుకుల్లో మాత్రం వెలుగులు నిండటం లేదు. పేదరిక నిర్మూల కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు అంతగా ఫలితమివ్వక.. తలసరి ఆదాయం పెరగక.. ఆర్థికంగా అట్టడుగున ఉండే కుటుంబాలు అక్కడే ఉండిపోతున్నాయి. ఇప్పటికీ కూడు, గూడు కోసం నిరంతరం శ్రమిస్తున్న లక్షలాది కుటుంబాలే ఇందుకు నిదర్శనం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సామాజిక ఆర్థిక సర్వే ఫలితాలు కూడా ఇదేచెప్పాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2011 నాటి సర్వే నాటికి.. నేటికీ పరిస్థితుల్లో అంతగా మార్పులేమీ లేవన్నది స్పష్టమైంది.

MEPMA (TS) SERP

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేదరికం.. | గ్రామాల్లో 37.6 శాతం | పట్టణ ప్రాంతాల్లో 25.4 శాతం

ఇటీవలి రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం

జిల్లా	తలసరి ఆదాయం	స్థానం
జయశంకర్ భూపాలపల్లి	రూ. 2,71,555	5
వరంగల్	రూ. 2,22,628	15
జనగామ	రూ. 2,17,277	19
మహబూబాబాద్	రూ. 1,99,588	22
ములుగు	రూ. 197,539	25
హనుమకొండ	రూ. 1,86,784	30

గ్రామీణ ప్రాంతాల్లో 37.6 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25.4శాతం మంది పరిస్థితి 'పైన పటారం.. లోన లొటారం' అన్న చందంగా ఉందని వెల్లడైంది. గత దశాబ్దకాలంలో పట్టణాల్లో పెరిగిన మురికివాడల సంఖ్యే ఇందుకు ఉదాహరణగా కనిపిస్తోంది. అయితే 2011-12 జనగణన నాటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం పేదరికం స్థాయిలు కాస్త తగ్గినట్టు స్పష్టమవుతోంది.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

8

కొండాపై అసంతృప్తి



టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు

- తమ నియోజకవర్గాల్లో మంత్రి సురేఖ జోక్యంపై ఫిర్యాదు
- పరకాల, వరంగల్ తూర్పులో విభేదాలపై వివరణ
- పార్టీ అంతర్గత విషయాలపై రచ్చకెక్కవద్దని టీపీసీసీ హితవు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ వైఖరిపై పార్టీలో అసంతృప్తి మరింత పెరుగుతోంది. ఈ క్రమంలోనే ఆమెపై ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. తమ నియోజకవర్గాల్లో తలదూర్చుతున్నారని ఎమ్మెల్యేలు, ఓరుగల్లు నేతలు అసంతృప్తితో ఉన్నారు. మంగళవారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షికి ఫిర్యాదు చేయగా.. తాజాగా బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి మంత్రి తీరుపై ఫిర్యాదు చేయటం కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. ఇప్పటికే తన వ్యాఖ్యలతో రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 6వ పేజీలో...

కొండాపై ఫిర్యాదు వెనుక ఉన్నదెవరు?

మంత్రి సురేఖ వైఖరిపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం వెనుక ఎవరున్నారు? ఆ పెద్ద తల ఎవరనే చర్చ జరుగుతోంది. గీసుగొండ ఘటన తరువాత ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలందరిని ఏకతాటిపైకి తీసుకొవచ్చి, సురేఖపై ఫిర్యాదు చేయించేంత సాహసం ఎవరు చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పరకాల, వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో కొండా దంపతులు కొంత జోక్యం చేసుకున్న సంఘటనలున్నాయని, కానీ మరికొన్ని నియోజకవర్గాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా మంత్రిపై ఫిర్యాదుకు ఆ ప్రాంత నేతలు ఎలా వచ్చారని కొండా వర్గీయులు ఆరా తీస్తున్నట్లుగా సమాచారం. వివాదాలకు చాల దూరంగా ఉండే ఓ ఎమ్మెల్యే కూడా అధిష్ఠానాన్ని కలిసిన వారిలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. చివరకు ఓరుగల్లు రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ లక్ష్యంగా జరుగుతున్న పరిణామాలు ఎటుదారితీస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

వర్ధన్నపేట ఆస్పత్రిలో ఏం జరుగుతోంది?

- పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వండి
- వరంగల్ కలెక్టర్ సత్య శారద ఆగ్రహం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన.. ఆస్పత్రి తనిఖీ..

6



వర్ధన్నపేట ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద



పట్టు వదలకుండా కేంద్రంతో పోరాడతాం

6

మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న మంత్రి కొండా సురేఖ

- మహాజాతరకు జాతీయ హోదా తెస్తాం
- మంత్రి సీతక్కతో కలిసి మేడారం శాశ్వత అభివృద్ధికి కృషి
- దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- కుటుంబ సమేతంగా వనదేవతల దర్శనం

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి



- కేయూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ధర్నా

6

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కళాశాలల యాజమాన్యం, సిబ్బంది, ఉపాధ్యాయులు

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి..



- గ్రామీణ యువత కృషి చేయాలి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- వేయిస్తంభాల గుడి నుంచి కలెక్టరేట్ వరకు ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ

6

సీఎం కప్ క్రీడా జ్యోతితో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా

ట్రేడ్ లైసెన్స్‌ల జారీ లక్ష్యాన్ని చేరుకోవాలి

- నగరంలో పారిశుధ్య పక్కాగా జరగాలి..
- శానిటేషన్ అధికారులతో మేయర్ సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులోగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని నడుస్తున్న కమర్షియల్ షాపులు, షాపింగ్ మాల్స్‌కు ట్రేడ్ లైసెన్స్ జారీ లక్ష్యాన్ని చేరుకోవాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి స్వచ్ఛ ట్రాక్టర్ల ద్వారా తరలించాలని చెప్పారు. లాగ్‌బుక్‌లపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ తప్పకుంగా ఉండాలన్నారు. చికెన్, మటన్, చేపల వేస్టేజీని మురుగుకాల్వలలో వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. పారిశుధ్య వాహనాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు జీపీఆర్ఎస్ సిస్టమ్‌ను అనుసంధానం చేయాలన్నారు. ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ట్రేడ్ లైసెన్స్ వార్షిక ఆదాయం ఈ యేడు రూ.11కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటికి రూ.3 కోట్లు మాత్రమే వసూలు చేశారన్నారు. వచ్చేవారం వరకు 70 శాతం పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్తను తరలించే వాహనాలు వెహికిల్ షెడ్డులో నిలిచి ఉండకుండా వెంటనే మరమతు చేసి పంపించాలన్నారు. పారిశుధ్య కార్మికులు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశం సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఇందిరా మహిళాశక్తి లక్ష్యాన్ని చేరుకోవాలి

ఇందిరా మహిళాశక్తి పథకాన్ని చేరుకోవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మెప్మా అధికారులతో పాటు బ్యాంకర్లతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరా మహిళాశక్తి యూనిట్ల లక్ష్యం ఏర్పాటు, బ్యాంకు లింకేజీ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో మహిళాశక్తి పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. బ్యాంకర్లు జాప్యం చేయకుండా త్వరితగతిన యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలోని మహిళా గ్రూపులకు రూ.7.25 కోట్ల రుణాలు అందించారన్నారు. నగర పరిధిలో 215 గ్రూపులు 48 యూనిట్లుగా ఉన్నాయని వ్యక్తిగత గ్రూపులు 1,318 ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశాల మేరకు మిగిలిన గ్రూపులను యూనిట్లుగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ ఎల్‌డీఎంలు రాజు, శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం చైతన్య, డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, డీఎంసీలు రజిత, రేణుక, టీఎంసీ రమేష్, సీవోలు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు తీపికబురు

- పరీక్ష ఫీజుల చెల్లింపునకు ప్రత్యేక అనుమతి
- ఉత్తర్వులు వెలువరించిన వర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

6

సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగం

- పోలీసు కమిషనరేట్‌లో నోడల్ అధికారి నియామకం
- సీపీ అంబర్ కిశోర్ ఝా



సీఎం కప్ ర్యాలీని ప్రారంభిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద



జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్న హనుమకొండ జిల్లా కలెక్టర్, సీపీ

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- అట్టహాసంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ
- వేయి స్తంభాల ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో విద్యార్థులు, యువత గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి రాణించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. సీఎం కప్ - 2024 క్రీడా పోటీలను పురస్కరించుకొని ఇటీవల హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ప్రారంభమైన సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ బుధవారం వరంగల్‌కు చేరుకుంది. ముందుగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద క్రీడాజ్యోతికి వరంగల్ పోచమ్మమైదాన్ సర్కిల్‌లో స్వాగతం పలికి పలువురు క్రీడాకారులతో, వివిధ క్రీడా సంఘాల బాధ్యులతో అక్కడి నుంచి హనుమకొండ వేయిస్తంభాల గుడి వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ హనుమకొండ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా జ్యోతి స్వాగత కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూలు పాల్గొని క్రీడాజ్యోతికి స్వాగతం పలికారు. అనంతరం క్రీడాభిమానులు, వివిధ క్రీడా సంఘాల సభ్యులతో కలిసి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున జాతీయ జెండాలు, క్రీడా జ్యోతితో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పల్లె నుంచి ప్రపంచ స్థాయి క్రీడల్లో రాణించే విధంగా యువతను క్రీడల్లో తీర్చిద్దిదడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారన్నారు. సీఎం కప్ పోటీల్లో హనుమకొండ జిల్లాలోని గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయిలో వివిధ క్రీడల్లో రాణించి జిల్లా కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం నజరానాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందన్నారు. విశిష్ట అతిథి సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన యువతను ప్రోత్సహించడానికి సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటుకోవాలని సూచించారు. హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ ఉండి ప్రోత్సాహం అందని మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు వేదికగా నిలుస్తాయన్నారు. కిందటేడు కలెక్టర్ చొరవతో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందించామన్నారు. జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, యువత, విద్యార్థులు పోలీసు శాఖ సిబ్బంది సహకారంతో సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీని విజయవంతంగా నిర్వహించామన్నారు.

కాగా, ఈ ర్యాలీ హనుమకొండ వేయిస్తంభాల ఆలయం వద్ద ప్రారంభమై చౌరస్తా, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, అంబేద్కర్ జంక్షన్, అదాలత్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు వందల మంది క్రీడాకారులు, యువత, జిల్లా క్రీడా సమాఖ్య సభ్యులతో కోలాహలంగా కొనసాగింది. సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ సందర్భంగా కళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులు ఏఎన్‌కే గోకుల్, మధు, రతన్‌బోస్, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, వరంగల్ నిట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు పవన్‌కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ఏటీబీటీ. ప్రసాద్, డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, ప్రశాంత్, వెంకటేశ్వర్లు, విష్ణు, అఫ్జల్, శంకర్, రాజు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

మట్టెవాడ (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవంబర్‌లో సీఎం కప్ పోటీలను నిర్వహించనుందని వరంగల్ కలెక్టర్ సత్యశారద తెలిపా రు. క్రీడాజ్యోతి ర్యాలీ బుధవారం వరంగల్‌కు చేరుకుంది. వారికి వరంగల్‌లోని పోచమ్మమైదాన్ వద్ద కలెక్టర్ సత్యశారద, డీసీపీ రవీందర్ ఘన స్వాగతం పలికి అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా త్వరలో నిర్వహిస్తున్న సీఎం కప్ గురించి చైతన్యం కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనేలా అవగాహన కల్పించడమే ర్యాలీ ఉద్దేశమన్నారు. వరంగల్ జిల్లా నుంచి ప్రపంచస్థాయిలో రాణించేలా క్రీడాకారులు తయారు కావాలన్నారు. కాగా, సీఎం కప్ టార్చ్ ర్యాలీ పోచమ్మ మైదాన్ నుంచి ఎంజీఎం మీదుగా వేయిస్తంభాల దేవాలయం వరకు సుమారు 800 మంది క్రీడాకారులతో సాగింది. వరంగల్ కలెక్టర్ సత్యశారద సీఎం కప్ క్రీడా జ్యోతిని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్‌ఝాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీలు రవీందర్, షేక్ సలీమా, జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్యాట్రన్ వరద రాజేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ కైలాష్ యాదవ్, వెంకన్న, రఘువీర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



కొండా దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న పూజారులు

కేంద్రంతో పోరాడతాం

- మహాజాతరకు జాతీయ హోదా తెస్తాం
- దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

మేడారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టు వదలకుండా కేంద్రంతో పోరాడి అతిపెద్ద గిరిజన కుంభమేళ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయహోదా సాధించి తీరుతామని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఆమె తన భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కూతురు సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్‌తో కలిసి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలోని వనదేవతల గద్దెలను దర్శించుకున్నారు. మనవడు శ్రేయాన్ష్ మురళీకృష్ణ పుట్టువెంట్రుకల మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత, మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు కాక సారయ్య, కొక్కెర కృష్ణయ్య ఘన స్వాగతం పలికారు. గద్దెల వద్దకు చేరుకున్న మంత్రి, కుటుంబ సభ్యులు వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో అధికారులు, పూజారులు మంత్రి సురేఖకు అమ్మవార్ల పట్టు వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం గద్దెల ప్రాంగణం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం ప్రగతిబాటలో నడుస్తోందని, రాష్ట్రం ఆర్థిక కష్టాలను గట్టెక్కాలని అమ్మవార్లను ప్రార్థించామన్నారు. రాష్ట్ర ప్రదాత సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆశయాల సాధనకు శక్తిసామర్థ్యాలను ప్రసాదించాలని కోరుకున్నానన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత తొలి మహాజాతరను వైభవంగా జరిపించామన్నారు. మంత్రి సీతక్కతో కలిసి మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, దేవాదాయ, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగం

నోడల్ అధికారి నియామకం ▸ సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఇటీవల కాలంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సి బ్బంది పలు వ్యక్తిగత సమస్యలతో పా టు, శాఖాపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు తన దృష్టికి వచ్చిందని సీపీ తెలిపారు. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారి సమస్యలను పరిష్కరించేందుకు సీపీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని, ఇందుకోసం కంట్రోల్ రూమ్‌కు చెందిన మహిళా ఏఎస్‌ఐ జ్యోతి ప్రియాంకను నోడల్ అధికారిగా నిమించినట్టు తెలిపారు. ఇకపై పోలీసు సిబ్బంది తమ వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలు నోడల్ అధికారి ఫోన్ నెంబర్ 9948685494 ఫోన్‌ద్వారా తమ ఫిర్యాదులు, సమస్యలను తెలియ చేయాల్సి ఉంటుందన్నారు. ఇలా వచ్చిన ఫిర్యాదులను నోడల్ అధికారి తన దృష్టికి తీసుకువస్తారని సీపీ తెలిపారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ముఖ్యంగా సిబ్బంది తమ వ్యక్తిగత సమస్యలు, శాఖాపరమైన సమస్యలు సీపీని ప్రత్యక్షంగా కలుసుకొని తెలియజేసేందుకుగాను ఇకపై పోలీసు సిబ్బంది కేవలం ప్రతీ శనివారం మాత్రమే పోలీసు కమిషనరేట్‌కు రావాల్సి ఉంటుందని, అలాగే వచ్చే సిబ్బందికి స్టేషన్ అధికారులు తప్పనిసరిగా అనుమతి మంజూరు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సీపీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంజీఎంలో క్లిష్టమైన శస్త్ర చికిత్స సక్సెస్

వరంగల్ మెడికల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో క్లిష్టమైన శస్త్ర చికిత్సను వైద్యుల బృందం విజయవంతంగా పూర్తి చేసింది. హసన్‌పర్తి గ్రామానికి చెందిన జన్ను వరలక్ష్మీ (46) గొంతు మీద పదేళ్లుగా థైరాయిడ్ గడ్డ ఉండటంతో తీవ్రంగా బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోగా, ఆహారం సైతం తీసుకోలేకపోతోంది. థైరాయిడ్ గడ్డ వెడల్పుగా ఉండి మెడ మొత్తాన్ని ఆక్రమించి, మెదడుకు రక్త ప్రసరణ చేసే రక్తనరాలను చుట్టుముట్టడంతో ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఎంజీఎం ఆస్పత్రిని సంప్రదించగా డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ వినోద్ కుమార్ దుస్సా బృందం ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా వైద్య బృందాన్ని ఎంజీఎం సూపరింటెండెంట్ చిలుక మురళి అభినందించారు.

బ్యాక్‌లాగ్ విద్యార్థులకు తీపికబురు

కేయూ క్యాంపస్ అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేయూ డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు వర్సిటీ ఉన్నతాధికారులు తీపి కబురును వెలువరించారు. నిర్ణీత సమయంలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేయకుండా సమయం దాటిపోయి ఫీజులు చెల్లించుకోలేక బ్యాక్‌లాగ్ సబ్జెక్టులతో పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు వన్‌టైమ్ పర్మిషన్‌తో ఫీజులు చెల్లించుకుని పరీక్షలు రాసి డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసుకునే సువర్ణావకాశాన్ని కల్పించారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పరీక్షల ఫీజుల చెల్లింపుకు ప్రత్యేక అనుమతి ఉత్తర్వులను వెలువరించారు. 2024-24 ఏడాది కాలపరిమితికి సంబంధించిన బ్యాక్‌లాగ్ పేపర్లకు క్లియర్ చేయడానికి ఒకేదఫా అనుమతిని ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వర్సిటీ పరిధి నాన్ ప్రొఫెషనల్ యూజీ, పీజీ, నాన్ ప్రొఫెషనల్ ఇయర్‌వైజ్ స్కీమ్, యూజీ, పీజీ ప్రొఫెషనల్ కోర్సులకు ప్రాసెసింగ్ ఫీజులతోపాటు పరీక్షల ఫీజులను ప్రత్యేకంగా నిర్దేశించారు. కేయూ అకడమిక్ బ్రాంచ్ అధికారుల వద్ద మిగతా వివరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

కేయూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి

కలెక్టరేట్ ఎదుట ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేయూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం (టీపీడీఎంఏ) ఆధ్వర్యంలో బుధవారం ఏకశిలాపార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీ తీసి కలెక్టరేట్ ఎదుట కళాశాలల యాజమాన్యం, సిబ్బంది, ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతేడాది విడుదల చేసిన టోకెన్ నెంబర్లకు సంబంధించిన రూ.600కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్‌ను కాపాడాలన్నారు. లేదంటే కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్రస్థాయిలో నిరవధిక బంద్‌ను కొనసాగిస్తుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ ధర్నాలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం సభ్యులు శ్రీధర్ రావు, రవీంద్రనాథ్, ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ వేణుమాధవ్, జిల్లా-ఆర్డినేటర్ గోలి వెంకట్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ కళాశాలల యాజమాన్యం, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. నెహ్రూ యువకేంద్రం, యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలకు సంఘంలోని సభ్యుల వయస్సు 18 నుంచి 29 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు నెహ్రూ యువ కేంద్రంలో ఈనెల 19లోపు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 0870-2958776 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వర్ధన్నపేట ఆస్పత్రిలో ఏం జరుగుతోంది?

- పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వండి
- వరంగల్ కలెక్టర్ సత్య శారద ఆగ్రహం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన.. ఆస్పత్రి తనిఖీ



వర్ధన్నపేట ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వస్తున్న వరుస కథనాలపై జిల్లా కలెక్టర్ సత్య శారద స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆకస్మికంగా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ప్రతీ వార్డును కలియ తిరిగి వైద్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు శాతం, గైర్హాజరైన వారి వివరాలు తెలుసుకుని డ్యూటీ డాక్టర్లపై ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్యుల విధుల వివరాలను బోర్డుపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఉదయం నుంచి రాత్రి వరకు, రాత్రి నుంచి మళ్లీ ఉదయం వరకు ఉండే వైద్యుల వివరాలు కచ్చితంగా ఉంచాలని ఆదేశించారు. కాగా, వైద్యులపై కలెక్టర్ సత్యశారద ప్రశ్నల వర్షం కురిపించారు. వైద్యుల తీరు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఫార్మసీ గదిలోకి వెళ్లి నిల్వ ఉన్న మందుల వివరాలు, కాలం తీరిన మందుల వివరాలు కావాలని ప్రశ్నించగా ఫార్మసిస్టు తడబడ్డారు. దీంతో రేపటిలోగా వివరాలు కావాలని ఆదేశించారు. ఇక్కడికి వచ్చిన రోగి వైద్యం దొరకలేదని వరంగల్‌కు రావొద్దని సూచించారు. బ్లడ్ బ్యాంకులో ఉన్న బ్లడ్ ప్యాకెట్ల ఆరా తీసి అసహనం వ్యక్తం చేశారు. అన్ని గ్రూపుల బ్లడ్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అలాగే సమయ పాలన పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు సేవలందించాల్సిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు నామమాత్రంగా వచ్చి వెళుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టు ఒక్కరే ఉన్నారని, దీంతో ఇబ్బందులున్నాయని తన దృష్టికి వచ్చిందని, వాటిని అధిగమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఆస్పత్రిని తరచూ పరిశీలించి నివేదిక ఎప్పటికప్పుడు అందించాలని తహసీల్దార్ విజయసాగర్, మున్సిపల్ కమిషనర్ ఇస్సంపల్లి జోనాలను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'వైద్యులు ఉన్నా.. సేవలు సున్నా', 3 గంటలు - 39 మంది వైద్యులు!', 'ఏజెన్సీలదే హవా..' అంటూ వర్ధన్నపేట ఆస్పత్రిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఉన్నతాధికారులు వస్తారని వైద్యులు, సిబ్బంది అప్రమత్తమై ఉదయం నుంచి ఆస్పత్రి, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలన్నీ వైద్యాధికారుల వాహనాలతో నిండిపోయింది. దీంతో మంత్రి కానీ ఆస్పత్రికి వచ్చారా?, ఇన్ని కార్లు వచ్చాయి.. అంటూ జనం చర్చించుకోవడం కనిపించింది.

కేయూ ఇన్‌చార్జ్ వీసీ కరుణ రిలీవ్

కొత్త వీసీ నియామకంపై ఉత్కంఠ

కేయూ క్యాంపస్, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ నియామకంపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. క్యాట్ ఉత్తర్వుల మేరకు ఆరుగురు ఐఏఎస్ అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి రిలీవ్ అయ్యారు. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు కేయూ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌గా కొనసాగిన వాకాటి కరుణ సైతం బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి రిపోర్టు చేశారు. అయితే కేయూ వీసీ పోస్టులో ఎవరినీ నియమించలేదు. ఆమె నిర్వహించిన రాష్ట్ర మహిళ, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోస్టును మరో ఐఏఎస్ అధికారి డాక్టర్ టీకే శ్రీదేవికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతకుమారి ఉత్తర్వులు వెలువరించారు. కేయూ వీసీగా శ్రీదేవికే కేటాయిస్తారా..? లేకపోతే మరొకరికి ఇస్తారా? అనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, ఇప్పటికే కేయూ వీసీ ఎంపిక కోసం సెర్చ్ కమిటీ సమావేశం ముగియడంతో రెగ్యులర్ వీసీనే నేడో, రేపో ప్రకటిస్తారని తెలుస్తోంది. బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌తోపాటు వైస్ చైర్మన్-1ను కేటాయించడంతో కేయూకు రెగ్యులర్ వీసీని నేడో, రేపో నియమిస్తారనే విషయం ఖాయంగా కన్పిస్తోంది.

నేడు అధ్యాపకుల సమావేశం

కేయూ క్యాంపస్ అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల్లో పనిచేస్తున్న ఎంకామ్, ఎంబీఏ బోధించే అధ్యాపకులతో అక్టోబరు 17న వర్సిటీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరావేణి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేయూక్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో 2024-25 ఏడాది నుంచి అమలుకానున్న ఎంకామ్, ఎంబీఏ సిలబస్‌పై చర్చిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, సుబేదారి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల ఎంకామ్, ఎంబీఏ అధ్యాపకులు సమావేశంలో పాల్గొనాలని వారు కోరారు.

బాలిక అదృశ్యం

నల్లబెల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలిక అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మండలంలోని ఒక గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలిక.. దసరా పండుగ సెలవుల దృష్ట్యా సొంతూరుకు చేరుకుంది. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రించింది. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తమ కూతురు కనిపించలేదు. దీంతో ఆమె స్నేహితులు, వారి బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

కొండాపై అసంతృప్తి

(5వ పేజీ తరువాయి)



వివాదస్పదంగా మారిన మంత్రి సురేఖ, సొంత జిల్లాలోని సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుండటం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

మంత్రిపై ఎమ్మెల్యేల తిరుగుబాటు బావుటా..

మంత్రి సురేఖపై తిరుగుబాటుబావుటా ఎగురవేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీతో పాటు ముగ్గురు డీసీసీ అధ్యక్షులు, పలువురు కార్పొరే షన్ చైర్మన్లు, కీలక నేతలు రెండు రోజులుగా వరుస ఫిర్యాదులు చేస్తున్నారు. మంగళవారం ఏఐసీ సీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిని కలిసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షులు మంత్రి సురేఖ తమ నియోజకవర్గాల్లో తల దూర్చటమే కాకుండా, నామినేటెడ్ పదవులు కూడా తన అనుచరులకు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి.. మంత్రి వైఖరితో పార్టీ తీవ్రంగా నష్టపో తోందని వివరించినట్టు సమాచారం. తమ నియోజకవర్గాల్లోని దేవాలయాల కమిటీలను కూడా తాము సూచించిన వారికి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం అధిష్టానం చేరికలను ప్రోత్సహిస్తే, చేరిన వారిని లక్ష్యంగా చేసుకుని కొండా దంపతులు ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు సమాచారం. అలాగే పరకాల నియోజకవర్గంతో సంబంధం లేకపోయినా కావాలనే జోక్యం చేసుకుని, వర్గవిభేదాలను ప్రోత్సాహిస్తున్నారని, మంత్రి స్థాయిలో ఉండి గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌హెచ్‌వో సీట్లో కూర్చోవటం, దసరా మరుసటి రోజు ధర్మారం వద్ద ధర్నా చేయటం లాంటి వాటితో ప్రజల్లో పార్టీపై వ్యతిరేకత రావడానికి కారణమవుతున్నారని వివరించినట్టు తెలుస్తోంది. స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సీఎంతో చర్చించిన అనంతరం మంత్రితో కూడా మాట్లాడుతామని, భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం. పార్టీ అంతర్గత విషయాలపై రచ్చకెక్కవద్దని, సంయమనంతో పరిష్కరించుకోవాలని, కింది స్థాయి క్యాడర్ రెచ్చకొట్టే వాఖ్యలు చేయకుండా చూసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు వారికి సూచించినట్టు తెలిసింది.

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ అవుతున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టకుం డా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను హనుమకొం డ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్, విద్య, విద్యుత్, రవా ణా, ఎక్సైజ్, పౌరసరఫరాలు, మైనింగ్, యాంటీ నార్కోటిక్స్, వైద్య, ఆరోగ్య శాఖ, ఇతర శాఖల అధికారులతో భారతీయ నూతన చట్టాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, రోడ్డు భద్రత అంశాలపై కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. సమ స్యలపై దృష్టి సారించేం దుకు మండల, జిల్లా స్థాయిలో అధికారులు సమన్వయ సమావేశాలను నిర్వహించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలన్నారు. అమలులోకి వచ్చిన నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల న్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లా డుతూ.. దేశవ్యాప్తంగా నూతనంగా న్యాయ చట్టాలు అమలు లోకి వచ్చాయన్నారు. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. ప్రస్తు తం సాంకేతికత ఎంతో పెరిగిందని, పెరిగిన సాంకేతి కతతో నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. అదేవిధంగా నూతన చట్టాలలో మహిళలు, చిన్నారుల రక్షణకు, భద్రతకు అనేక అంశాలు పొందుపరిచి ఉన్నాయ న్నారు. జాతీయస్థాయిలో తెలంగాణలో పోలీస్ శాఖ సంస్కరణలు, చట్టాలు అమలు తీరుపై మంచి పేరు ఉందన్నారు. ఈ సందర్భంగా నూతన న్యాయ చట్టాలపై పోలీస్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజం టేషన్ ద్వారా వివరించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు, తీసుకుంటున్న చర్యలపై వివరిం చారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వై.వి.గణేష్, డీసీపీ సలీమా, డీఈవో వాసంతి, డీఎంహెచ్‌వో లలితాదేవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, ఏసీపీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నేడు మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు ప్రజలు హాజరై మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జయంతిని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు ఆర్టిజన్స్‌గా కన్వర్షన్ చేయాలని మహాధర్నా

హనుమకొండ టౌన్, 16: ఎన్పీడీసీఎల్ పరిధిలో మిగిలిపోయిన మిగతా 8,664 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ నేడు హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీ డీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాక్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నట్లు జాక్ చైర్మన్ కె.ఈశ్వర్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఈ నెల 14న ఆర్టిజన్స్ కన్వర్షన్ అంశంపై డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు జాక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

ఆకలి కేకలు లేని ప్రపంచం కావాలి

శంభునిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆకలికేకలు లేని ప్రపంచం కావాలని కృషి విజ్ఞన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అన్నారు. బుధవారం మామునూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేటా ఐక్యరాజ్యసమితి వారి ఆదేశానుసారం అక్టోబరు 16 ప్రపంచ ఆహార దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. అందరికీ ఆహారం అనే హక్కుతోనే మెరుగైన జీవితం, ఉజ్వల భవిష్యత్ అనే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ జ్యోతి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త పోషకాహారం ప్రాముఖ్యత, వివిధ కూరగాయల్లో ఉండే పోషకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శశాంక్, రాజు, గణేష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



అశోకజంక్షన్‌లో ధర్నా, నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు

బాలసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఇవ్వకుండా విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాలు పీడీఎస్‌యూ, యుఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలో కిందటేడు విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ మూడేళ్లగా విడుదల చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి కళాశాలలను తెరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి భాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్, యుఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమ కొండ కేడీసీలో ఏర్పాటు చేసిన బీఎస్ఎఫ్ కార్యకర్తల సమా వేశంలో మనోహర్ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో శ్రీకాంత్, మధన్, తిలక్, చరణ్, అఖిల్, భువన్, అరవింద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జి అరెగంటి నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చదువులు పూర్తి చేసుకుని ఫీజులు రాక సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు పడిగాపులు కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

● వరంగల్ స్పోర్ట్స్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంతో పాటు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ అశోక జంక్షన్‌లో విద్యార్థి సంఘాలతో కలిసి ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్‌కుమార్, అభిషేక్, ప్రదీప్, సాయి సందీప్, రాజ్‌కుమార్, అనూష, ప్రవళిక, అంజలి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. లేకుంటే ఈ నెల 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలను బంద్ చేస్తామని వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ సంఘాల నేతలు హెచ్చరించారు. బుధవారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ల శరత్, ఏఐఎస్‌బీ జిల్లా కో-కన్వీనర్ పెండ్యాల సతీష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మిషన్ సుల్తానా మాట్లాడారు. గత ప్రభుత్వాల్లాగే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు వార్డు అధికారుల పాత్ర కీలకం


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 16: ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిశీలనలో వార్డు అధికారుల పాత్ర కీలకమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వార్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో పనిచేస్తున్న వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిష్పక్షపాతంగా వ్యవహరించి దరఖాస్తుల పరిశీలన చేయాలని అన్నారు. నగరంలో 12 బృందాలు పర్యటిస్తున్నప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలన్నారు. 80వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయని, ఒక్కో అధికారి 1400 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉందన్నారు. దరఖాస్తుల పరిశీలనపై దృశ్యమాధ్యమం ద్వారా వార్డు అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, సెక్రెటరీ విజయలక్ష్మి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్రరాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, టీపీఎస్‌లు ఇర్షాద్, శ్రీకాంత్, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నరకాసురవధ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయండి

ఈనెల 30న వరంగల్ ఉర్సుగుట్ట కుడా ప్రాంగణంలో జరిగే నరకాసురవధ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు, కావలసిన ఏర్పాట్లు చేయాలని నరకాసురవధ ఉత్సవ కమిటీ నాయకులు, 40వ డివిజన్ కార్పొరేటర్ రవి ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ మేయర్ గుండు సుధారాణిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సుమారు 20 వేలకు పైగా ప్రజలు హాజరవుతారని తగిన ఏర్పాటు చేయాలని కోరారు. మేయర్‌ను కలిసిన వారిలో కమిటీ సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతం, ఆర్గనైజర్లు దూడ కొంరెల్లి, అన్న మిర్యాల ఆదిత్య, కుండె రాజు, మరుపల్ల శివ, తౌటం నర్సింహ, గౌడ రాము, కొమ్ము రాజు, కుండె కుమారస్వామిలు ఉన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పేరు ఉర్దూలోనూ పెట్టాలి

కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేత

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16: హనుమకొండ బాలసముద్రంలో ఇటీవల నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం పేరు ఉర్దూలో కూడా ఉండాలని జిల్లా మైనారిటీ సెల్ నాయకులు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని మైనారిటీ నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మైనారిటీ సెల్ అధ్యక్షులు నయీమోద్దీన్, నాయకులు ఫిరోజ్, అఫ్జల్, ఆరీఫ్ తదితరులు ఉన్నారు.


అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

పత్తికి మద్దతు ధర చెల్లించాలి

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పత్తిలో తేమ 18 శాతంగా నిర్ణయించి కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీఐ అధికారులు పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,525 కేటాయించారని, ఈ సీజన్‌లో ముందుగానే వర్షాలు ప్రారంభమై నేటికీ పడుతున్నాయన్నారు. దీంతో పత్తికి తెగుళ్ల సోకి దిగుబడి రాక రైతులు పంటనష్టపోయారని తెలిపారు. సీసీఐ అధికారులు 12శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పత్తికి మద్దతు ధర ప్రకారమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్‌మోర్చా నాయకులు సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, సుదమల్ల భాస్కర్, అబర్ల రాజన్న, ఐత నగేష్, నున్న అప్పారావు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఎంజీఎంలో అనస్థీషియా డే వేడుకలు

వరంగల్ మెడికల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వరల్డ్ అనస్థీషియా డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ హనుమంతరావు, ఎంజీఎం సూపరింటెండెంట్ సీహెచ్.మురళి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మత్తు వైద్య నిపుణులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

వరంగల్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ రెడ్డిపాలెం ఇన్‌ఫాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఈనెల 18 నుంచి 20 వరకు జరిగే 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు బుధవారం జిల్లా కార్యదర్శి పూజారి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డా.పి.సాంబశివరావు, అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ టి.రాజేందర్, ఇన్‌ఫాంట్ జీసెస్ హైస్కూల్ హెచ్‌ఎం కృపామేరీ, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డా.నవీన్, లింగం కిరణ్, శివప్రసాద్ క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

బాలసదనంలో బాలికలకు స్టేషనరీ..

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని బాలసదనం బాలికల వసతి గృహంలోని 54 మంది బాలికలకు జెన్నీ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కంపాక్స్‌బాక్స్‌లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెన్ని ట్రస్ట్ మెంబర్ కిరణ్ మాట్లాడుతూ.. జెన్నీ ట్రస్ట్ చైర్మన్ శోభన్ ఆదేశాల మేరకు బాలికలకు స్టేషనరీ పంపిణీ చేశామన్నారు. 2016లో ట్రస్ట్ ప్రారంభించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో జెన్ని ట్రస్ట్ మెంబర్‌లు దయాకర్, చంద్రశేఖర్, బాలసదనం నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు..

ఖిలావరంగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గంగిశెట్టి మధుర అమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. బుధవారం 9, 10 తరగతి విద్యార్థులకు ట్రస్ట్ సభ్యుడు గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం వారి సోదరుడు జగదీశ్వర్ 150 మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు నరేంద్రస్వామి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రంగాచారి, సంపత్, నరేందర్, కవిత, సుజాత, జ్యోత్స్న, ప్రకాశ్, భవానీ, సందీప్, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, అక్టోబరు 16: నిబంధనలను ఉల్లంఘించిన పలువురు వాహనదారులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి విద్యాసాగర్ జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 17 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా 16 మందికి రూ.19,000 జరిమానా, పలివేల్పులకు చెందిన షేక్ సమీర్‌కు రెండు రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్ కోసం తహసీల్దార్‌కు అప్పగించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఒక వ్యక్తికి రూ.500 జరిమానా విధించారని పేర్కొన్నారు.

రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గ్రీవెన్స్ సెల్

కాజీపేట, అక్టోబరు 16 (అంధ్యజ్యోతి): కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రైల్వే అధికారులు కార్మికులకు గ్రీవెన్స్ నిర్వహించారు. సీనియర్ డీపీవో ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు ఏపీవో జి.జితేందర్ కార్మికుల నుంచి వినతులు స్వీకరించారు. ఉమిద్ కార్డులు, ఐడీ కార్డులు, ప్రమోషన్లు డ్యూటీ సీనియారిటీ లిస్టు, సర్వీస్ రికార్డుల్లో మార్పులు, ఫ్యామిలీ డిక్లరేషన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రైల్వే ఉన్నతాధికారులు మాట్లాడారు. ఏటా మూడు నెలలకోసారి గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, సంఘ్ నాయకులు సాధినేని వెంకట్‌నారాయణ, చింత మురళి, పాక రాజ్‌కుమార్, ఓబీసీ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు రేండ్ల రమేశ్‌తో పాటు రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి, అక్టోబర్ 16, (ఆంధ్రజ్యోతి): చింతగట్టు సబ్ స్టేషన్ పరిధిలోని భీమారం మసీద్, భీమారం చర్చి, బొడ్రాయి, భీమారం గ్రామపంచాయతీ, సత్యసాయి కాలనీ, భీమారం బ్యాంకు కాలనీ, యాదవనగర్, అలకానందకాలనీ, కాకతీయనగర్ ప్రాంతాలలో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పి.అశోక్ తెలిపారు. ఆయా ప్రాంతాలలో విద్యుత్ లైన్‌ల పునరుద్ధరణతో పాటు లైన్‌ల క్రమబద్ధీకరణ పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

హిందువులు క్షేత్రపాలకులుగా ముందుండాలి

హసన్‌పర్తి, అక్టోబర్ 16, (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడేందుకు హైందవ సోదరులు క్షేత్రపాలకులుగా ముందుండాలని మండల ప్రముఖ పురోహితుడు దహగం రమేష్‌శర్మ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం హసన్‌పర్తి నగర హైందవ ధర్మ పరిరక్షణ ప్రముఖులు గురుమూర్తి భద్రదేవ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి జాతీయ ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగర పురోహితులు వేదాంతం సంపతాచార్యులు, గురుమూర్తి గురుదత్తు, కాజీపేట వెంకటస్వామి, ఆల య అర్చకులు శ్రీనివాస్, సుమనాచారి పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గిర్మాజీపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వరంగల్ - కాజీపేట రైల్వేస్టేషన్‌ల మధ్య శాయంపేట రైల్వేగేటు సమీపంలో బుధవారం సాయంత్రం వరంగల్ నుంచి బల్లార్ష మార్గంలో వెళుతున్న కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి (35) ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. మృతుడు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, శరీరం ఛామనఛాయ రంగు, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి కాఖీ ప్యాంటు, మల్టీకలర్ చొక్కా ధరించి ఉన్నాడని సీఐ తెలిపారు. మృతుడి కుడిచేయిపై 'అన్న' అని తెలుగులో, భుజంపై 'ప్రభ' అని ఆంగ్ల అక్షరాలతో పచ్చబొట్లు ఉన్నాయని సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి హెడ్ కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు వరంగల్ జీఆర్‌పీ ఫోన్ నెంబర్లు 9701747014, 8712658585లో సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

దీపావళి నాటికి సానుకూల నిర్ణయం

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సొసైటీల బాధ్యులు

వడ్డెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో గల మీడియా అకాడమీ కార్యాలయంలో చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన సమావేశంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజుతో పాటు సొసైటీల బాధ్యులు, యూనియన్ల నాయకులు హాజరయ్యారు. సొసైటీల బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలమైన, స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని అన్నారు. దీపావళి నాటికి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గతంలో సొసైటీలకు కేటాయించిన స్థలాలతోపాటు మరికొంత స్థలాన్ని సేకరించి అర్హులైన జర్నలిస్టులందరికీ నివేశన స్థలాలు ఇప్పించే బాధ్యత తనపై ఉందని చెప్పారు. వివిధ యూనియన్ల నాయకులు, సొసైటీల బాధ్యులు, సిక్స్‌మెన్ కమిటీ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సమావేశంలో వివిధ యూనియన్లు, హౌసింగ్ సొసైటీలు, సిక్స్‌మెన్ కమిటీ బాధ్యులు, జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జీలకు శిక్షన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద దొడ్డు, సన్నం రకం ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధర తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డు, సన్నరకం ధాన్యాల కొనుగోలుకు వేరు వేరు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందని, వాటి కొనుగోలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యం బస్తాలకు ఎరుపురంగు దారంతో, దొడ్డు రకం ధాన్యం బస్తాలకు ఆకుపచ్చ రంగుదారంతో కుట్లు వేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు అందించిన టోకెన్ ఆధారంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోళ్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, జిల్లా సహకార అధికారి నీరజ, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, ఇతర అధికారులు, ప్యాక్స్ కార్యదర్శులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జీలు పాల్గొన్నారు.

ధరణి కుటుంబాన్ని ఆదుకోవాలి

హసన్‌పర్తి, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మృతి చెందిన నల్లబెల్లి పోలీసుస్టేషన్ మహిళా కానిస్టేబుల్ జోరుక ధరణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ అన్నారు. మండలంలోని పెంబర్తిలో బుధవారం ధరణి అంత్యక్రియలు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ధరణి కుటుంబ సభ్యులను పలువురు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. కానిస్టేబుల్ ధరణి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దావ రవి, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి దండ్రె శ్రీనివాస్, ఓబీసీ నాయకులు ఊరబిండి ఓంకార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు కొయ్యడ గోపి, సౌరం నాగరాజు, ఇల్లందుల గోపి, చాతళ్ల వేణుగోపాల్ తదితరులున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2311	2080
పల్లికాయ (సూక)	6640	4500
పల్లికాయ (పచ్చిది)	4700	4000
కందులు	---	---
పెసళ్లు	6450	4052
పత్తి	7060	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	11359	10000
పసుపు (గోల)	11179	10800
తేజ మిర్చి	12500	10000
తేజ ఏసీ	17500	12000
వండర్‌హాట్ ఏసీ	15000	13000
యూఎస్341ఏసీ	15500	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

నాణ్యమైన పత్తికే మంచి ధర

ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మల



వరంగల్ వ్యవసాయం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): రైతులు మార్కెట్‌కు నాణ్యంగా ఉన్న పత్తిని అమ్మకానికి తీసుకువస్తే మంచి ధర లభిస్తుందని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల సూచించారు. మార్కెట్లో పత్తి ధర తగ్గడంపై బుధవారం నిర్మల మాట్లాడారు. పత్తికి మంచి ధర రావడానికి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరబెట్టిన, ఎండిన, తేమలేని పత్తికి మార్కెట్లో మంచి ధర పలుకుతుందన్నారు. నీళ్లు చల్లడం, తేమ ఎక్కువగా ఉన్న పత్తికి ధర పలకదన్నారు. పత్తిపై నీళ్ల చల్లడం వల్ల రంగు మారుతుందని, గింజలు బూజుపట్టి నాణ్యత తగ్గి నూనె దిగుబడి తగ్గుతుందన్నారు. అలాగే వివిధ రకాల పత్తి పంటలను ఒకేచోట కలుపరాదని, పత్తిలో అపరిపక్వమైన కాయను వేరు చేయాలని కోరారు. కొడి పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలుపరాదన్నారు. మంచి, చెడు పత్తిని వేర్వేరుగా మార్కెట్‌కు తీసుకురావాలని, తేమ ఎక్కువగా ఉండడం వల్ల పత్తి రంగుమారి పత్తిలోని పోగులు, గింజల నాణ్యత చెడిపోతుందన్నారు. పూర్తిగా ఆరిన పత్తిని మార్కెట్‌కు తీసుకుని వచ్చి మంచి ధరలు పొందాలని ఆమె సూచించారు.

గొప్ప మానవతావాది రతన్ టాటా

కేయూ క్యాంపస్ అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గొప్ప మానవతావాది రతన్ టాటా అని వరల్డ్ పీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ కొనియాడారు. బుధవారం కేయూ అర్థశాస్త్ర విభాగంలో విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన రతన్‌టాటా సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రతన్‌టాటా చిత్రపటానికి వర్సిటీ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి, ఇతరసభ్యులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. రతన్ టాటా ఎంతో మంది పేదలకు అపన్నహస్తం అందచేసి ఆదుకున్నారని చెప్పారు. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన రతన్‌టాటాకు భారత రత్న బిరుదు ఇచ్చి గౌరవించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ పీస్ సొసైటీ జనరల్ సెక్రటరీ శ్రీపాద సుధాకర్‌రావు, కోశాధికారి పి.విష్ణువర్ధన్, ప్రొఫెసర్ కె.విజయబాబు, శనిగరపు రాజమోహన్, కాజీపేట పురుషోత్తం, ప్రొఫెసర్ వి.నరసింహమూర్తి, విప్పనపల్లి రవికుమార్, అనుసూరి చంద్రమౌళి, వెలాంగిరి, వెలుదొండి రవికుమార్, అశోక్, రావులకోలను రామమూర్తి, లక్ష్మినారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

ఉమ్మడి జిల్లా అభివృద్ధి కమిటీ కన్వీనర్ వెంకటనారాయణ


మాట్లాడుతున్న వెంకటనారాయణ

బాలసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి నాయకులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ జిల్లా అభివృద్ధి కమిటీ కన్వీనర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. బుధవారం బాలసముద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటికాల మధుసూదన్ రావు ఎన్ఐటీని సాధించి అత్యున్నత నాణ్యత విలువలు గల విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. అదే విధంగా ఎంఎస్ రాజలింగం కాకతీయ మెడికల్ కాలేజీని స్థాపించడానికి కృషి చేశారని అన్నారు. ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ.. 1969 తెలంగాణ అమరవీరుల త్యాగ ఫలితంగానే కాకతీయ యూనివర్సిటీ ఏర్పడిందని అన్నారు. ఉత్తర తెలంగాణకు అతి పెద్దదైన వరంగల్ సెంట్రల్ జైలును కూల్చివేసి మహారాష్ట్ర బ్యాంకుకు పాలకులు తాకట్టు పెట్టారని, మామునూరు ఎయిర్‌పోర్ట్ ఇంకా మూలుగుతూనే ఉందని అన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ.. పదేళ్లలో కొత్తరాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగిందని అన్నారు. ఉమ్మడి జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడంతో ప్రజలు ఆగ్రహించి ప్రభుత్వ మార్పు కోసం 12 అసెంబ్లీ స్థానాల్లో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు.

పేద బతుకుల్లో వెలుగులేవీ?

- రోజులు మారుతున్నా వీడని పేదరికం
- ఇప్పటికీ కూడు, గూడు కోసం లక్షలాది కుటుంబాల తండ్లాట

నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం



హనుమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాలం మారుతున్నా.. పరిస్థితులు మారుతున్నా.. పేదల జీవితాలు మాత్రం మారడం లేదు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతల జాడలు నేటికీ కనిపిస్తున్నాయి. కోట్లాది కుటుంబాలు కూడు, గూడు, గుడ్డ లాంటి మౌళిక సదుపాయాలు లేక అల్లాడుతున్నాయి. ఇప్పటికీ అనేక మంది కనీసం ఒక్క పూట కూడా కడుపునిండా భోజనం దొరక్క ఆకలితో అలమటిస్తున్నారు. తలదాచుకునేందుకు సరైన నీడ లేక వేసారిపోతున్నారు. దశాబ్దకాలంలో పట్టణాల్లో పెరిగిన మురికివాడల సంఖ్యే ఇందుకు ఉదాహరణ. అయితే జనాభ గణన జరిగిన 2011-12 సంవత్సరంతో పోల్చితే మాత్రం కొద్ది మేరకు పేదరికం స్థాయిలు కొంత మేరకు తగ్గినట్టు స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వ నిర్వహించిన ఆర్థిక, సామాజిక తాజా సర్వే ప్రకారం 2011-12లో గ్రామీణ పేదరికం 39.4 శాతం, పట్టణ పేదరికం 38.1 శాతం ఉండగా 2022-23 సంత్సరం నాటికి పేదరికం 37.6 శాతం, పట్టణ పేదరికం 25.4 శాతం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షలాది కుటుంబాల పరిస్థితి ఇంకా అట్టగునే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన సర్వేలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాని మెజారిటీ ప్రజలు పేదరికంలోనే మగ్గుతున్నారు. నెలకు రూ. 10వేల కన్నా తక్కువ ఆదాయం ఉండి, పెద్దగా భూవి ుకానీ, సొంతానికి వాహనం కానీ లేని గ్రామీణులను పేదల కింద పరిగణిస్తారు. గురువారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేదరికం స్థాయిలు, అందుకు కారణాలు, పేదరికం నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేక కథనం.

తలసరి ఆదాయంలో అట్టడుగున

ఒక దేశం లేదా భౌగోళిక ప్రాంతంలో ఒక వ్యక్తి సంపాదించిన డబ్బుకు కొలమానంగా తీసుకునే తలసరి ఆదాయం.. జనాభా జీవన ప్రమాణం జీవన నాణ్యతను అంచనా వేయడానికి ఉపయోగించబడుతుంది. అలాంటి తలసరి ఆదాయం విషయంలో ఉమ్మడి వరంగల్ మిగతా జిల్లాల కన్నా వెనుకబడి ఉంది. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే గణాంకాల ప్రకారం తలసరి ఆదాయంలో జయశంకర్ భూపాలపల్లి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా కాస్త ముందుంది. ఆ జిల్లా రూ.2,71,555తో రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉండగా.. హనుమకొండ జిల్లా రూ.1,86,784తో అన్నిటికన్నా అట్టడుగున 30వ స్థానంలో ఉంది. ములుగు జిల్లా రూ. 197,539తో 25వ స్థానంలో, రూ. 2,17,277 తలసరి ఆదాయంతో జనగామ 19వ స్థానంలో ఉంది. ఇక వరంగల్ జిల్లా రూ. 2,22,628తో 15వ స్థానం, మహబూబాబాద్ జిల్లా రూ.1,99,588తో 22వ స్థానంలో ఉంది.

పేదరిక నిర్మూలన దిశగా..

గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు 2000 సంవత్సరం నుంచి ఊపందుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా ప్రత్యేక కార్యాచరణను చేపట్టాయి. ఇందులో భాగంగా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తునాయి. 2000 నుంచి గ్రామీణ నిరుపేద నిర్మూలనా సంస్థ (సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పేదలను గుర్తించడం మొదలైంది. అయితే పేదలను భాగస్వామ్య పద్ధతిలో పేదల ద్వారానే గుర్తించే విధానాన్ని (పీఐపీ) అమలు చేస్తున్నారు. పేదలంటే ఎవరు? ఎలాంటి వారిని పేదలంటారు? అనేవి గుర్తించి వర్గీకరించారు. మొదటి కేటగిరి అత్యంత నిరుపేదలు, రెండోది పేదలు. మూడోది పేదలు కానివారు. మొదటి రెండు కేటగిరీలు లక్ష్యంగా ఆ కుటుంబాల్లో మహిళలందరినీ మొదట సాచురేషన్ మోడ్‌లో పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేయడం భాగస్వాములను చేయడం మొదలు పెట్టారు.

సంఘటితంగా సత్ఫలితాలు..

పేదరిక నిర్మూలన అనేది వ్యక్తిగతంగా కాక సంఘాల ద్వారా సంఘటితంగానే సాధ్యమవుతుంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా కార్యక్రమాలను చేపట్టాయి. కుటుంబాల్లో కీలకమైన మహిళలు లక్ష్యంగా తీసుకుని వారికి ఆర్థికంగా, సామాజికంగా సుస్థిరతను సాధించగలిగితే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్న వ్యూహంతో స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేశారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా పది నుంచి పదహేను మంది సభ్యులతో సంఘాలను రూపొందించారు. వారిని ఆర్థిక స్వావలంబన వైపు నడిపే దిశగా ప్రోత్సహించారు. తొలుత వాడలు, ఆతర్వాత గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో సమాఖ్యలను ఏర్పాటు చేశారు. దాంతో ఆయా స్థాయిల్లో అధికారులు, కలెక్టర్లు సమావేశాలకు హాజరవడంతో సమస్యల పరిష్కారం సులువైంది. అలాగే సంఘాలు సమర్థవంతంగా పనిచేసేలా సామర్థ్యాల పెంపు శిక్షణనిచ్చారు. ఇతరులపై ఆధారపడకుండా ప్రభుత్వం అందించే సాయంతో ఆర్థిక సుస్థిరతను ఎలా సాధించాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ చర్యలతో కొంతమేర సత్ఫలితాలు వచ్చాయన్నది గణాంకాలు చెబుతున్నాయి.

బ్యాంకుల అనుసంధానం

ఎంత చేసినా డబ్బులు అవసరం కనుక పేదరికం నుంచి బయటపడటానికి అవసరమైన ఉపాధి అవకాశాల కల్పనకు గాను ప్రతీ మండలానికి సీడ్ క్యాపిటల్ కింద రూ.80లక్షల వరకు ఇచ్చారు. వీటిని సంఘాలు రొటేషన్ చేసుకుంటూ సుస్థిర ఆదాయ కల్పనకు బాటలు వేసుకుంటున్నాయి. దీంతో ప్రతీ మండలం సంఘాలు రూ. 2 నుంచి రూ. 3 కోట్ల వరకు టర్నోవర్ చేసుకునే స్థాయికి చేరుకున్నాయి. కొన్ని మండలాల టర్నోవర్ అయితే రూ. 5 కోట్ల వరకు ఉంది. అయితే ఈ డబ్బుతోనే సరిపెట్టకుండా ఆర్థికంగా మరింత ముందుకు వెళ్లేందుకు వీలుగా ఈ సంఘాలను బ్యాంకులతో కూడా అనుసంధానం చేశారు. ప్రతీ సంవత్సరం ఆదాయాభివృద్ధి కోసం రూ.10కోట్ల వరకు బ్యాంకులు రుణాలిస్తున్నాయి. తద్వారా సంఘాల్లోని సభ్యులు తమకు తెలిసిన వృత్తి ఆధారంగానే ఉపాధి అవకాశాలు కల్పించుకుంటున్నాయి. ఇంతటితో సరిపెట్టుకోకుండా రెండేళ్లుగా గ్రామ సంఘానికి 80 కుటుంబాలు కచ్చితంగా పేదరికం నుంచి బయటకు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం 'లక్‌పతి దీదీ యోజన' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ గ్రామ సంఘంలో 80 మంది ఒకటికన్నా ఎక్కువ ఉపాధి మార్గాలను చేపట్టేలా ప్రోత్సహిస్తున్నారు. తద్వారా గతంలో కన్నా ఇప్పుడు గ్రామ స్థాయిలో సంఘాల ద్వారా మెరుగైన ఉపాధిని పొందుతున్నారు. తద్వారా పేదరికం నుంచి కొంతమేరకైనా తగ్గుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1800లకుపైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇవి సమర్థవంతంగా పని చేస్తున్నాయి. బ్యాంకులు కూడా ఒక్కో మండల సమాఖ్యకు కుటీర పరిశ్రమల స్థాపనకు రూ 20 కోట్ల వరకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు వస్తున్నాయి.



పేదరిక నిర్మూలన కోసం..

గ్రామీణ పేదరిక నిర్మూలనతో పాటు పట్టణాల్లో పేదరిక నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు అమలవుతున్నాయి. పట్టణపేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, స్వయం ఉపాధి కార్యక్రమం (ఎస్ఈపీ), బ్యాంకు రుణాలు, వీధి విక్రయదారుల పథకం (పీఎంఎస్‌విఏ నిధి), ఇందిరా మహిళా శక్తి పథకం అమలు అవుతున్నాయి. వీటి ద్వారా కోట్లాది రూపాయల టర్నోవర్‌తో స్వయం ఉపాధి కల్పన జరుగుతోంది.



గిజిగాళ్ల గూళ్లు.. అదిరెన్..

గిజిగాడుగా పిలుచుకునే బయవీవర్ అనే పిట్ట గూడు నిర్మించుకునే విధానం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. గడ్డిపుల్లలను ఒక్కొక్కటిగా సేకరించి గూడును నిర్మించి అందులో ఆకులను పేర్చుకుంటుంది. ముచ్చటగొలిపే ఆ గూడును పూర్చిచేసేందుకు ఆ పిట్టకు చాలారోజుల సమయం పడుతుంది. ఈ పక్షులు ఒకే చెట్టుకు పదుల సంఖ్యలో గూళ్లను ఏర్పాటు చేసుకుంటాయి. ఇలా హనుమకొండ కాజీపేట దర్గా ఇందిరమ్మ కాలనీలో ఓ చెట్టుపై గిజిగాళ్లు సందడి చేశాయి.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

ఘనంగా వీణ, వాణి పుట్టినరోజు

అవిభక్త కవలలతో కేక్ కట్‌చేయించిన తల్లిదండ్రులు, అధికారులు




వీణ, వాణికి కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

దంతాలపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవిభక్త కవలలు వీణ, వాణీ పుట్టినరోజు వేడుకలను వారి స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని బీరిశెట్టిగూడెంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీరిశెట్టిగూడేనికి చెందిన మారగాని మురళి-నాగలక్ష్మి దంపతుల కుమార్తెలైన వీణ, వాణి ప్రస్తుతం హైదరాబాద్ చైల్డ్‌హోం సంరక్షణలో ఉంటూ సీఏ చదువుతున్నారు. బుధవారం వారి 22వ పుట్టినరోజు కావడంతో హైదరాబాద్ చైల్డ్‌హోం అధికారులు సఫీయా, సోమలక్ష్మి సంరక్షణలో అవిభక్త కవలలను స్వగ్రామానికి తీసుకొచ్చి వేడుకలు నిర్వహించారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, దంతాలపల్లి తహసీల్దార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించిన అనంతరం తిరిగి చైల్డ్‌హోం అధికా రులు వారిని హైదరాబాద్ తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్, ఎంపీడీవో వివేకరామ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌స్వామి, ఎంపీవో అప్సర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించి.. చదువులో రాణించి..

- టీచర్ ఉద్యోగం సాధించిన సింధూజ
- ఆర్థిక ఇబ్బందులను ఇబ్బందులను అధిగమించి కొలువు బాటలో..
- ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో విజయం



తోలెం సింధూజ

కొత్తగూడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆమెది నిరుపేద కుటుంబం. మూడేళ్ల వయస్సులో తండ్రిని కోల్పోయింది. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న తన తల్లి తనపై పెట్టుకున్న నమ్మకానికి 'కొలువు' రూపం ఇచ్చింది. నాన్నలేడన్న బాధను దిగమింగుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి.. తన ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఉన్నత విద్యనభ్యసించి.. టీచర్ కొలువు కొట్టేసి ఆదర్శంగా నిలిచింది తోలెం సింధూజ. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఉమ్మడి మండలంలోని పుట్టల భూపతి గ్రామానికి చెందిన తోలెం సారయ్య-రజిత దంపతులకు కుమార్తె సింధూజ, కుమారుడు రఘు ఉన్నారు. సింధూజకు మూడేళ్ల వయసున్నప్పుడు తండ్రి సారయ్య చనిపోవడంతో తల్లి రజిత కూలీ పనులు చేసి ఆమెను చదివించింది. ఇక సింధూజకు పద్నాలుగేళ్ల వయసులో ఉన్నప్పు డు ఆమె తమ్ముడు రఘు అనారోగ్యంతో మృతి చెందాడు. అయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా.. తొలినుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నా.. ఆర్థిక ఇబ్బందులున్నా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. అయితే పదో తరగతిలో ఉన్నప్పుడు కుటుంబ పరిస్థితుల కారణంగా కొన్ని రోజులపాటు సింధూజ చదువు మానేసింది. కానీ ఉత్తమ మార్కులు సాధించే సింధూజ చదువు మానేసిందని తెలుసుకున్న ఉపాధ్యాయుడు వాసం వీరస్వామి ఆమె ఇంటికి వెళ్లి చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని కౌన్సెలింగ్ ఇచ్చి చదువువైపు మళ్లించారు. ఆ తర్వాత గంగారంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2018లో 10వ తరగతి పూర్తిచేసిన సింధూజ 2020లో నర్సంపేటలో త్రివేణి కళాశాలలో ఇంటర్, 2022లో భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన డైట్ కళాశాలలో టీటీసీ పూర్తి చేసింది. ఐటీ రామయ్య కోచింగ్ సెంటర్‌లో 2023లో మూడునెలలు డీఎస్సీ కోచింగ్ తీసుకుంది. అలా ఉపాధ్యాయుడు వాసం వీరస్వామి.. సింధూజ ఉపాధ్యాయురాలి కొలువు కొట్టే వరకు ఆమెను ప్రోత్సహించారు. కొలువు కొట్టే క్రమంలో సింధూజ అయన మార్గదర్శకాలను తూచతప్పకుండా పాటించి విజయం సాధించింది. బుధవారం ఆమె కొత్తగూడ ఉమ్మడి మండలంలోని మర్రిగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు స్వీకరించింది. ఆ గ్రామంలో ఉద్యోగం పొందిన మొదటి యువతిగా సింధూజను గ్రామస్థులు అభినందించారు.

అమ్మవారిని దర్శించుకున్న చీఫ్ విప్



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారిని ప్రభుత్వ చీఫ్ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ ప్రధానార్చకుడు శేషు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆది శ్రీనివాస్ దంపతులు వల్లభ గణపతి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు వారికి అమ్మవారి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

మిద్దె తోట.. ఆరోగ్య పంట

ఇంటిపైన తీరొక్క కూరగాయల సాగు

- సేంద్రియ విధానంలో పెంపకంపై నగరవాసుల ఆసక్తి
- ఇంటికి సరిపడా కూరగాయలు మిద్దెతోటలోనే లభ్యం
- పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ ఉత్సాహంగా పెంపకం





ఇంద్రారెడ్డి ఇంటి మిద్దెపై పెంచుతున్న పూలు, కూరగాయల మొక్కలు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ప్రస్తుతం రూ.600పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. రోజురోజుకు పెరుగుతుతున్న జనాభాకు తోడు కూరగాయల ఉత్పత్తి తగ్గుతుండటం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండటం ధరల పెరుగుదలకు కారణమవుతోంది. కోతులు, వన్యప్రాణులు, పక్షులతో ఇబ్బందితోపాటు మార్కెటింగ్ సమస్యలతో రైతులు కూరగాయల సాగుపై దృష్టి పెట్టడం లేదు. వీటికి తోడు చీడపీడల బెడద ఎక్కువవడం వాటిని నియంత్రించేందుకు క్రిమిసంహారక మందులను వినియోగిస్తుండటంతో కూరగాయలు విషపూరితమై ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో చాలా మంది నగర, పట్టణ ప్రజలు సేంద్రియ పద్ధతిలో సాగయ్యే పంట ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. కొందరైతే మిద్దె, పెరటి తోటలను పెంచుతున్నారు. రసాయన ఎరువులు వాడకుండా వంటింటి వ్యర్థాలను పోగు చేసి సేంద్రియ ఎరువులుగా మార్చి కూరగాయల మొక్కలు పెంచుతున్నారు. అంతర్జాలం వేదికగా చీడపీడల గురించి తెలుసుకుంటూ వాటికి విరుగుడుగా కషాయాలను తయారుచేస్తూ దిగుబడి పొందుతున్నారు. పెరటి, మిద్దె తోటల్లో పనితో వ్యాయామంగా ఉండటంతో పాటు పచ్చని మొక్కల మధ్య గడపడంతో ఉత్సాహంగా ఉంటోందని, పచ్చని స్వచ్ఛమైన గాలి కూడా తమకు అందుతోందని నగరంలో మిద్దెతోటలు సాగుచేస్తున్న వారు పేర్కొంటున్నారు.

పట్టణాల్లో పెరుగుతున్న మిద్దెతోటల సాగు

గతంలో వేళ్లమీద లెక్కపెట్టే విధంగా ఇళ్లపైన కూరగాయలు, పూలమొక్కలు సాగుచేసేవారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో మేడపైన వీటిని పెంచుతున్న సంఖ్య ఇప్పుడు వేలల్లోకి చేరింది. హనుమకొండ, వరంగల్, కాజీపేట పట్టణాల్లో సుమారు 500మందికి పైగా సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2వేలకు పైగా కూరగాయలు, పూలమొక్కలు సాగుచేస్తున్నట్టు సమాచారం. కొందరు పల్లెల్లో ఇంటి ఆవరణలో ధరలు ఎక్కువగా ఉండే వాటిని పండిస్తూ ఇంటి అవరాలకు వాడుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోని ఇళ్లలో ఈ తరహా పెరటి తోట సంస్కృతి పెరిగితే కూరగాయల పరంగా ఆర్థిక భారం తగ్గుతుంది.

ఎవరైనా పండించొచ్చు..

టమాట, వంకాయ, బీర, దొండ, సొరకాయ, గోరుచిక్కుడు, బెండ లాంటి కూరగాయలు, పాలకూర, చుక్కకూర, గోంగూర, పుదీన, కరివేపాకు, కొత్తిమీర లాంటి ఆకుకూరలు ఇంటి ఆవరణలో, మేడపైన సులభంగా సాగు చేసుకోవచ్చు. వీటిని పెంచడం ఏమంత కష్టం కాదు. ఒక్కసారి మంచి మట్టిని, సేంద్రియ ఎరువులను వాడి విత్తనాలు వేసి అవసరాన్ని బట్టి నీళ్లు అందిస్తే 20 నుండి 30రోజుల వ్యవధిలోనే తాజా కూగరాయలు అందుబాటులోకి వస్తాయి. కొన్ని కొన్ని కుండీల్లో తక్కువ చోటులో పెరిగే మొక్కలు లభ్యమవుతున్నాయి. 60చదరపు అడుగుల నుంచి 100 చదరపు అడుగుల్లో అయితే తీరొక్క కాయగూరలను వేసుకోవడం సులభం.

హైదరాబాద్ తరహాలో జిల్లాల్లో కిట్‌లు అందిస్తే మేలు..

హైదరాబాద్ పట్టణంలో మిద్దెతోటల సాగుకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందుతోంది. రూ.6వేల విలువైన కిట్‌ను రూ.3వేలకు అందిస్తున్నారు. ఇందులో కొన్ని రకాల విత్తనాలతోపాటు మొక్కల సంచులు, నీళ్లను పోసే పరికరం, సేంద్రియ ఎరువులు, సూచనలు, జాగ్రత్తలపై కరపత్రాలను ఇస్తున్నారు. ఇలాంటి ప్రోత్సాహకాన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వం అందిస్తే ఇళ్లలో కూరగాయల పెంపకం పెరిగే అవకాశం ఉంటుంది.



నందనవనాన్ని తలపిస్తున్న ఇంద్రారెడ్డి ఇల్లు

మొక్కల పెంపకం నాకు మక్కువ



జన్నపురెడ్డి ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌నగర్, హనుమకొండ

పచ్చదనమంటే చాలా ఇష్టపడతా. నగరంలో ఉంటున్నందున ఇంటిపైన గ్రీనరీ ఏర్పరుచుకోవాలన్న ఆలోచన వచ్చింది. కూరగాయలు, పూలమొక్కలు పెంచితే ఇంట్లోకి అవసరంతోపాటు నా అభిరుచికి తగ్గట్టు ఉంటుందని ఇంటిపైన, ఇంటి చుట్టు 70రకాల పూలమొక్కలతో పాటు కూరగాయలైన బీర, సొర, కాకర, పొట్లకాయ, వంకాయ, టమాట, మిర్చితోపాటు తోటకూర, చుక్కకూర, పుదీన, పాలకూర, కొత్తిమీర లాంటివి పెంచుతున్నా.



సంకల్పం

పదిహేనేళ్లకే పెళ్లి. పద్దెనిమిదేళ్లు నిండకుండానే ఒక బిడ్డకు తల్లి. వద్దు వద్దని మొత్తుకున్నా పుట్టింటివాళ్లు బరువు వదిలించుకున్నారు. అత్తింటివారు మాఇంటికి రావద్దని అన్నారు. అందరూ ఉండి ఒంటరి అయ్యారు 24 ఏళ్ల **రోషిణీ పర్వీన్**. కానీ ఆమె కుంగిపోలేదు. విపత్కర పరిస్థితులకు ఎదురొడ్డి ఆత్మవిశ్వాసంతో నిలబడ్డారు. బాల్య వివాహాలను అరికడుతూ... ఎందరో బాలికల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు.

నా కష్టం... వేరొకరికి రాకూడదని...

"నా బాల్యం అంతా ముళ్ల బాటలోనే సాగింది. బాగా చదువుకొని... ఒకరిపై ఆధారపడకుండా నా బతుకు నేను బతుకుదామని అనుకున్నా. కానీ ఆ సంకల్పానికి మా అమ్మానాన్నలే విఘాతం కలిగించారు. బీహార్ రాష్ట్రం కిషన్‌గంజ్ జిల్లాలోని మారుమూల పల్లె సిమల్‌బారీలో ఓ సాధారణ కుటుంబం మాది. ఎనిమిదో తరగతి వరకు అంతా బాగానే సాగింది. ఎప్పుడైతే తొమ్మిదో తరగతిలోకి అడుగుపెట్టానో అప్పటి నుంచీ ఊహించని కష్టాలు వచ్చిపడ్డాయి. మా ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. 'ఇంకా పదో తరగతి కూడా పూర్తవ్వలేదు. అప్పుడే పెళ్లేంటి?' అని అడిగాను. నాకు ఇంకా చదువుకోవాలని ఉందని, అప్పటివరకు ఓపిక పట్టమని ప్రాధేయపడ్డాను. అమ్మానాన్న వినలేదు. రోజూ ఎవరూ ఒకరు నన్ను చూడ్డానికి వచ్చేవారు. చాలా



సంబంధాలు తిప్పి పంపాను. అయినా వాళ్ల ప్రయత్నం ఆగలేదు. చివరకు నా పోరాటం వృథా అయింది. బలవంతంగా పెళ్లి చేశారు. అది కూడా నాకంటే వయసులో మూడు రెట్లు పెద్దవాడితో. అప్పుడతనికి 45 సంవత్సరాలు. అత్తింటికి వెళ్లేవరకు అతని వయసు నాకు తెలియదు. వివాహ బంధం అంటే ఏంటో కూడా అవగాహన లేదు. వేధింపులు ఎక్కువయ్యాయి. దాంతో భయం వేసి మూడు నెలలకే మా ఇంటికి వెళ్లిపోయాను.

పుట్టింటివారూ పట్టించుకోలేదు...

కొన్నాళ్లకు తెలిసింది... నేను గర్భవతిని అని. తరువాత బాబు పుట్టాడు. భర్త దగ్గరకు వెళ్లమని అమ్మానాన్న చెప్పారు. నేను ఆ నరకంలోకి మళ్లీ వెళ్లాలనుకోలేదు. కానీ ఇంట్లోవాళ్లు బలవంతం చేశారు. వెళితే... అత్తింటివాళ్లు నన్ను లోపలికి రానివ్వలేదు. ఏడాది దూరంగా ఉన్నానని, అందుకే నేను తనకు వద్దని నా భర్త తెగేసి చెప్పాడు. మా ఇంట్లోవాళ్లు కూడా నన్ను రానివ్వలేదు. అందరూ ఉండి ఎవరూ లేని అనాథనయ్యాను. చంకలో పసి బిడ్డతో రోడ్డున పడ్డాను. అలాగని బాధతో కూర్చోలేదు. నా కాళ్ల మీద నేను నిలబడాలని ఆ క్షణమే బలంగా నిర్ణయించుకున్నాను.

'యునిసెఫ్'తో కలిసి...

'సేవ్ ది చిల్డ్రన్, యునిసెఫ్' తదితర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో బీహార్‌లోని చాలా గ్రామాలు తిరిగాను. బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు చెప్పాను. అది వారి భవిష్యత్తును మొగ్గలోనే చిదిమేస్తుందని, అది చట్టవిరుద్ధమని వివరించాను. ఫలితంగా ఇప్పటికి పదుల సంఖ్యలో బాల్య వివాహాలు ఆపగలిగాను. నా ప్రయత్నానికి ప్రోత్సాహకంగా రెండేళ్ల కిందట జెనీవాలో జరిగిన సదస్సులో 'యునైటెడ్ నేషన్స్' నాకు ప్రతిష్ఠాత్మక అవార్డునిచ్చి సత్కరించింది. సమాజంలో పాతుకుపోయిన కట్టుబాట్లను దాటి, మహిళల జీవితాల్లో మంచి మార్పునకు కృషి చేస్తున్నందుకుగానూ నన్ను కొనియాడింది.

బంధాలు తెంచుకుని...

నన్ను వద్దనుకున్న భర్త, నాకు ఆశ్రయం ఇవ్వని తల్లిదండ్రులు, సామాజిక కట్టుబాట్లు... బంధాలన్నిటినీ తెంచుకొని ధైర్యంగా అడుగు బయటకు వేశాను. నా కోసం, నా బిడ్డకు బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలని సంకల్పించాను. తొలుత ఒక షోరూమ్‌లో హెల్పర్‌గా చేరాను. అదే సమయంలో 'చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్'లో వాలంటీర్‌గా పని చేశాను. అక్కడ నాలా భయంకరమైన కథలున్న మహిళలు చాలామందిని చూశాను. బాల్య వివాహానికి బలయింది నేనొక్కదాన్నే కాదని అప్పుడు అర్థమైంది. అలాంటి మహిళల గళం నేనెందుకు కాకూడదనే ఆలోచన వచ్చింది. నాటి నుంచి మహిళల హక్కుల సాధన, సాధికారత దిశగా అడుగులు వేశాను. ముఖ్యంగా బాల్య వివాహాలను నియంత్రించడంపై దృష్టి పెట్టాను.

పాఠశాలల్లో పునాది...

సమాజంలో రుగ్మతలు రూపుమాపి, బాల్య వివాహాలు అరికట్టాలంటే తల్లిదండ్రులతో పాటు బాలికలకు కూడా అవగాహన కల్పించాలి. ఆ ఉద్దేశంతోనే పలు గ్రామాల్లోని బాలికలతో పదిహేను బృందాలు ఏర్పాటు చేశాను. స్థానిక పెద్దలు, నాయకుల సాయం కూడా తీసుకున్నాను. వారందరి సహకారంతో ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తాను. ఎక్కడైనా అందుకు



ఏర్పాట్లు జరుగుతుంటే తక్షణం వెళ్లి, పెద్దలతో మాట్లాడి ఆపడానికి ప్రయత్నిస్తాను. ఒకవేళ వినకపోతే తదనంతర పరిణామాల గురించి వివరిస్తాను. అప్పటికీ దారికి రాకపోతే పోలీసుల సహాయం తీసుకొంటాను.

ఇక్కడే ఎక్కువ...

'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే' (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్)-5 నివేదిక ప్రకారం... 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసుగల ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకున్నవారే. అంత చిన్న వయసులో వివాహ బంధంలోకి అడుగుపెట్టడంవల్ల వాళ్లు విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అది వారికి జీవితాంతం ఒక మాయని గాయంలా మిగిలిపోతోంది. అలాగే మహిళల అక్రమ రవాణా కూడా పెద్ద సమస్యగా మారింది. వీటన్నిటిపైనా ఒక యుద్ధమే చేస్తున్నా. అమ్మాయిలు నిర్భయంగా తమ జీవితానికి ఏంకావాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను కల్పించేందుకు కృషి చేస్తున్నా. స్వయంసాధికారత దిశగా వారిని నడిపించేందుకు నావంతు ప్రయత్నం ఇది."

కౌన్సెలింగ్

కడుపులో నొప్పి ఎందుకు?

Q A

డాక్టర్! తరచూ కడుపు నొప్పి వేధిస్తోంది. నొప్పి ఎందుకొస్తుందో, అసలు కారణమేంటో తెలియడం లేదు. లక్షణాలను బట్టి నొప్పికి మూల కారణాన్ని కనిపెట్టే మార్గం ఉందా?

- ఓ సోదరి, హైదరాబాద్.

నొప్పి వచ్చే ప్రదేశాన్ని బట్టి కడుపు నొప్పికి కారణాన్ని కనిపెట్టొచ్చు. తిన్న ఆహారం జీర్ణం కాకపోయినా, కలుషిత ఆహారం తీసుకున్నా కడుపు నొప్పి తప్పదు. ఈ నొప్పుల్లో రకాలున్నాయి. అవేంటంటే...- అసిడిటీ నొప్పి: మసాలాలు, పులుపు, కారాలతో కూడిన పదార్థాలు తినటం వల్ల అసిడిటీతో, పొట్టలో నొప్పి మొదలవుతుంది. ఈ నొప్పి పొట్ట పైభాగంలో మొదలవుతుంది. కడుపు ఉబ్బరం, బిర్రుగా తయారవటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు పొట్టలో, కత్తితో పొడిచినంత విపరీతమైన నొప్పి కూడా రావొచ్చు. సాధారణంగా ఈ నొప్పి ఒకటి, రెండు రోజుల్లో తగ్గిపోతుంది. ఆ సమయంలో పెరుగు, మజ్జిగ తీసుకుంటూ ఉప్పు, పులుపు, కారాలు తగ్గిస్తే అసిడిటీ తాలూకు నొప్పి తగ్గిపోతుంది. ఈ జాగ్రత్తలు తీసుకున్నా రెండు రోజులకు మించి నొప్పి వేధిస్తే, తప్పనిసరిగా వైద్యుల్ని సంప్రదించాలి.

- **గాల్ బ్లాడర్ స్టోన్స్:** గాల్ బ్లాడర్‌లో రాళ్లున్న వాళ్లు నూనె పదార్థాలు తిన్న వెంటనే కడుపులో నొప్పి మొదలవుతుంది. ఈ నొప్పి కుడి వైపు డొక్కలో మొదలవుతుంది. నొప్పి భరించలేనంత తీవ్రంగా ఉంటుంది. వాంతులు కూడా అవుతాయి. ఇలా గాల్‌బ్లాడర్‌లో రాళ్లున్న వ్యక్తులు నూనె పదార్థాలు తిన్నప్పుడు గాల్ బ్లాడర్ నుంచి రాళ్లు బయటకి రావటానికి ప్రయత్నిస్తాయి. దాంతో పొట్టలో నొప్పి మొదలవుతుంది. ఈ లక్షణం కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. గాల్ బ్లాడర్ వాపు, రాళ్ల పరిమాణం, కదలికలను బట్టి వైద్యులు మొదట యాంటీబయాటిక్స్, అవసరాన్నిబట్టి సర్జరీని ఎంచుకుంటారు.
- **పాంక్రియాటిక్ పెయిన్:** ముఖ్యంగా మద్యపానం చేస్తూ ఆ సమయంలో నూనెతో కూడిన పదార్థాలు తినేవారికి ఈ నొప్పి వస్తుంది. పొట్ట మధ్య భాగంలో, పైన నొప్పి ఉంటుంది. పొట్ట నుంచి వీపులోకి కూడా నొప్పి ప్రసరిస్తుంది. పాంక్రియాస్ వెనక భాగంలో ఉంటుంది కాబట్టి వెల్లకిలా పడుకుంటే దాని మీద ఒత్తిడి పడి నొప్పి ఎక్కువవుతుంది. దాంతో రోగి బోర్లా పడుకోవటానికి ఇష్టపడతాడు. సాధారణంగా సెలైన్లు, యాంటీబయాటిక్స్‌తో ఈ నొప్పిని అదుపులోకి తేవొచ్చు. మద్యపానం మానేసి, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకుంటే పాంక్రియాస్ నొప్పిని నియంత్రించవచ్చు.



- **చిన్న పేగు, పెద్ద పేగుల్లో ఇన్‌ఫెక్షన్:** వర్షాకాలం ఆహారం, నీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువ. దాంతో చిన్నపేగు, పెద్దపేగులు ఇన్‌ఫెక్షన్‌కు గురై బొడ్డు చుట్టూ నొప్పి, విరేచనాలు మొదలవుతాయి. ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల వాంతులు కూడా అవుతాయి. ఈ సమస్యను కూడా మందులతో అదుపు చేయొచ్చు. అలాగే ఇన్‌ఫెక్షన్‌కు గురైన రోగులు శుభ్రమైన ఆహారం, నీరు మాత్రమే తీసుకోవాలి.

డాక్టర్. భవానీ రాజు
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హైదరాబాద్.

స్ఫూర్తి

అంతా సవ్యంగా సాగిపోతోంది అనుకుంటున్న సమయంలోనే ఉపద్రవాలు విరుచుకుపడతాయి. మీరట్‌కు చెందిన 45 ఏళ్ల లవీనా జైన్ విషయంలో ఇదే జరిగింది. ఆ దంపతులిద్దరూ కేన్సర్ బారిన పడడం, కుటుంబం రోడ్డున పడడం ఒకేసారి జరిగిపోయాయి. అయినా తనకెంతో ఇష్టమైన పచ్చళ్ల వ్యాపారంతో కుటుంబాన్నెలా కాపాడుకుందో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం!

కేన్సర్‌ను జయించి.. పచ్చళ్లతో పైకెదిగి..

"రొమ్ము కేన్సర్ సోకినప్పుడు, ఆదుకోడానికి ఆయన ఉన్నారని గుండె దిటవు చేసుకున్నాను. కానీ అదే సమయంలో ఆయన కూడా నోటి కేన్సర్ బారిన పడ్డారు. ఇద్దరికీ సర్జరీలు పూర్తయి, కీమోథెరపీలు మొదలయ్యాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు కేన్సర్ రోగులుంటే, ఆర్థిక పరిస్థితులు ఎంతలా దిగజారుతాయో ఎవరికీ తెలియనిది కాదు. బాబు పదో తరగతి చదువుతున్నాడు. పాప ఇంకా చిన్నది. ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్‌లో వచ్చే ఆదాయమంతా మా చికిత్సలకే సరిపోతోంది. దాంతో ఇల్లు గడవడం కష్టమైపోయింది. బంధువులు ఇల్లు అమ్మేయమని సలహా ఇచ్చారు. కానీ పిల్లలకు మేం సంపాదించి పెట్టిన ఆస్తి అదొక్కటే! కాబట్టి అందుకు మనసొప్పలేదు. ఏం చేయలో పాలుపోని పరిస్థితి.



పాత సీసాల్లో నింపి...

నాకు పచ్చళ్ల తయారీ వచ్చు. నిల్వ పచ్చళ్లు బ్రహ్మాండంగా తయారుచేస్తూ ఉంటాను. ఆ ఆసక్తినే ఆదాయంగా ఎందుకు మలుచుకోకూడదు? అని మావారు ప్రశ్నించారు. నిజమే! స్కూలు రోజుల్లో ఫుడ్ ప్రిపరేషన్ కోర్సు కూడా పూర్తి చేశాను. కాబట్టి ఆ జ్ఞానాన్ని పచ్చళ్ల తయారీలో ప్రవేశపెట్టి, నిల్వ పచ్చళ్లు, పానీయాలను తయారుచేసి అమ్మాలనే ఆలోచన వచ్చింది. అలా 2012లో, 1500 రూపాయల పెట్టుబడితో, 10 సీసాల లెమన్ స్క్వాష్ తయారుచేశాను. అప్పట్లో సీసాలు కొనే స్తోమత లేకపోవడంతో, ఇంట్లో ఉన్న పాత సీసాలే ఉపయోగించాను. కానీ వాటినెలా అమ్మాలో తెలియలేదు. అమ్మకాల కోసం, ఎక్కువ మహిళలు కలుసుకునే వేడుకలను ఎంచుకున్నాను. లెమన్ స్క్వాష్‌తో పాటు, 5 కిలోల మామిడి కాయ పచ్చడి, పది కిలోల నిమ్మ పచ్చళ్లను చిన్న చిన్న కిట్టీ పార్టీలు, వేడుకలకు హాజరయ్యే మహిళలకు పరిచయం చేశాను.

ఒడిదొడుకులను ఎదుర్కొని...

మొదటి మూడేళ్లూ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నాను. అయినా పిల్లలకు మంచి జీవితాన్నివ్వాలనే పట్టుదలతో, రేయింబవళ్లూ కష్టపడ్డాను. 12వ తరగతి పరీక్షల కోసం సిద్ధపడుతున్న మా అబ్బాయి, పగలంతా పచ్చళ్ల తయారీలో సహాయం చేసి, అర్ధరాత్రి దాటిన తర్వాత, కొద్దిపాటి సమయాన్నే చదువుకు కేటాయించేవాడు. మరో పక్క భర్త ఆరోగ్య సమస్యలు మళ్లీ తిరగబెట్టాయి. ఆయన సరిగా మాట్లాడలేకపోయేవారు, వినలేక పోయేవారు. మూడేళ్లకు నా శ్రమ ఫలించింది. నా పచ్చళ్లను మంచి గుర్తింపు లభించింది. లవీన తృప్తి పేరుతో, కాకర, అల్లం పచ్చళ్లతో పాటు, చట్నీలు, అప్పడాలు, స్క్వాష్‌లు, జామ్స్... ఇలా ఎన్నో రకాల ప్రొడక్ట్సను తయారు చేయడం మొదలుపెట్టాను. ఈ రోజు 60 నుంచి 70 రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నాను. పిఎమ్ ముద్ర యోజన పథకం సహాయంతో, యుపి హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా కిసాన్ మేళా, వరల్డ్ ఫుడ్ ఇండియా 2024లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లలో నా ఉత్పత్తులను ప్రదర్శించాను. ఇప్పటికి పచ్చళ్ల వ్యాపారంలోకి అడుగుపెట్టి 13 ఏళ్లు. ఇంత దూరం రాగలుగుతానని నేనెప్పుడూ అనుకోలేదు. పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించాలనే పట్టుదల వల్లే, ప్రారంభంలో ఎదురైన కష్టాలకు, సవాళ్లకు కుంగిపోకుండా, ధైర్యంగా ముందడుగు వేయగలిగాను. అంతిమంగా విజయం సాధించగలిగాను."

మనకు ఏదైనా సమస్య వస్తే... దాని నుంచి బయటపడితే చాలనుకుంటాం. ఆ సమస్య ఉన్నవారందరికీ ఒక దారి చూపించాలనుకొనేవారు చాలా కొద్దిమంది. వారిలో రూప్‌మణి ఛత్రి ఒకరు. పుట్టుకతోనే ఉన్న వినికిడి లోపాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు. 'సైనబుల్' అనే యాప్‌తో తనలాంటి ఎంతోమందికి కొత్త జీవితాన్నిస్తున్నారు.

సైగల యాప్‌తో వినిపిస్తున్నారు..

"ఏ పిల్లలకూ ఎదురవకూడదని కోరుకోవాల్సిన బాల్యం నాది. పుట్టుకతోనే నాకు వినికిడి శక్తి లేదు. దాంతో నా సొంత కుటుంబమే నన్ను వెలివేసినట్టుగా ప్రవర్తించేది. కుటుంబ కార్యక్రమాలకు, సంభాషణలకు నన్ను దూరంగా ఉంచేవారు. 'ప్రపంచంలో నేను మాత్రమే బధిరురాల్ని' అని అప్పట్లో నేను గట్టిగా నమ్మేదాన్ని. 'నాకే ఎందుకిలా జరిగింది?' అని బాధపడని రోజు లేదు. నా స్వస్థలం డార్జిలింగ్. అప్పట్లో బధిరుల కోసం ప్రత్యేకమైన స్కూల్ లేదు. మా నాన్న సెక్యూరిటీ గార్డ్‌గా పని చేసేవారు. ఆర్థిక సమస్యల కారణంగా... ప్రభుత్వ పాఠశాలలో చేర్చారు. నేను బడిలో ఏదైనా సైగల ద్వారా చెప్పడానికి ప్రయత్నించేదాన్ని. నా వైకల్యాన్ని గుర్తించడంలో విఫలమైన టీచర్లు నాకు తరచూ పనిష్మెంట్లు ఇచ్చేవారు. బధిర బాలికని కావడంతో... తోటి పిల్లలు పట్టించుకొనేవాళ్ళు కాదు. నా చదువంతా కేవలం నోట్సుల్ని చూసి రాసుకోవడమే. పాఠ్యాంశాలేవీ నాకు అర్థమయ్యేవి కావు. ఇక మా ఇంట్లో చూస్తే... నాకు చదువు చెప్పించడం అనవసరమనే భావనలో మా పెద్దలు ఉండేవాళ్ళు కొన్నాళ్ళు స్పీచ్ థెరపీలో నన్ను చేర్పించినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. కష్టపడి తొమ్మిదో తరగతి వరకూ చదివాను. ఆ తరువాత నాకు పెళ్ళి చేశారు. నా భర్త కూడా బధిరుడే. ఢిల్లీలోని అత్తవారింటికి వెళ్ళాను. అక్కడ నన్ను తీవ్రంగా వేధించేవారు. దాంతో నా పుట్టింటికి వెళ్ళాను. "నీ బతుకు నువ్వే చక్కదిద్దుకోవాలి. మేమేం చెయ్యలేం" అన్నారు నా తల్లితండ్రులు.


నన్ను పట్టించుకొనేవారు కాదు...

ఢిల్లీకి తిరిగివచ్చి, చిన్న ఉద్యోగంలో చేరాను. 2011లో... నా భర్తతో విడాకులు తీసుకున్నాను. ఆ తరువాత... నేను ఆపేసిన హైస్కూల్, సోషియాలజీలో డిగ్రీ పూర్తి చేశాను. ఈ క్రమంలో నాకు అనేకమంది బధిరులు పరిచయం అయ్యారు. మొట్టమొదట... పూర్తి అర్థవంతమైన సైగల భాషను నేను చూసింది అక్కడే. కానీ నాకు ఆ భాష రాకపోవడంతో వాళ్ళు నన్ను పట్టించుకొనేవాళ్ళు కాదు. చివరకు నోడియాలో 'డెఫ్ సొసైటీ', 'ది వే డెఫ్' లాంటి సంస్థల గురించి తెలుసుకొని, వాటిని సంప్రతించాను. సైగల భాషలో శిక్షణ తీసుకున్నాను. డిగ్రీ పూర్తయ్యాక ఢిల్లీలోని ఒక ఎన్జీవోతో పని చేశాను. అప్పుడే 'యునైటెడ్ నేషన్స్ డెవెలప్‌మెంట్ ప్రోగ్రామ్' (యుఎన్‌డిపి) తరఫున యూరప్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. కమ్యూనికేషన్ అసిస్టెంట్‌గా... ఉక్రెయిన్ యుద్ధ బాధితుల సహాయక కార్యక్రమాల్లో పని చేశాను. వినికిడి సమస్య ఉన్న పిల్లలకు సైగల భాష తరగతులు నిర్వహించాను. జర్మనీలో, ఇండియాలో కూడా ఐక్యరాజ్యసమితి కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకున్నాను.

రిస్క్ అని తెలిసినా...

ఉక్రెయిన్‌లో పని చేసిన ఏడాదిన్నర కాలం నా జీవితంలో చాలా క్లిష్టమైనది. ఆ దేశానికి వెళ్ళొద్దని చాలా మంది హెచ్చరించారు. అది రిస్క్ అని నాకూ తెలుసు. కానీ ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవాలని నిశ్చయించుకున్నాను. యుద్ధంలో ఎంతోమంది వికలాంగులయ్యారు, చాలామంది గాయపడ్డారు. మూడు వందల మందికి పైగా బధిరులు నిరాశ్రయులయ్యారు. నేను వారిని కలిసినప్పుడు... తోటి బధిర వ్యక్తిగా నన్ను సాయం అడిగేవారు. యుద్ధం లాంటి విపత్తు తరువాత తలెత్తే మానసిక సంఘర్షణల్ని ఎలా ఎదుర్కోవాలో వారికి నేర్పించాను. ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న ఎన్నో సంస్థలు అక్కడ చేపట్టిన సహాయక కార్యక్రమాల్లో భాగస్వామినయ్యాను. యూరప్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చాక... మళ్ళీ ఉద్యోగం కోసం వేట మొదలుపెట్టాను. అదే సమయంలో... సైగల భాషను అవసరమైనవారందరికీ అందుబాటులో తేవడానికి ఏదైనా చెయ్యాలని ప్రణాళికలు వేసుకొనేదాన్ని. అప్పుడే నాకు తరుణ్ సర్వాల్ పరిచయం అయ్యారు. ఆయన యూరప్‌లో దాతృత్వ సంస్థలతో పదేళ్ళకు పైగా పని చేశారు. బధిరులకు ఏది అవసరమో కచ్చితంగా తెలుసుకోవడానికి ఆయన ఒక ప్రాజెక్ట్ ప్రారంభించారు. అందులో నేను ఉద్యోగిగా చేరాను. ఆయనకు కూడా సైగల భాష నేర్పించాను. అప్పుడే ఒక యాప్ రూపొందించాలనే ఆలోచన మాకు వచ్చింది. విదేశాల్లో ఉన్నప్పుడు, నా పురోగతికి అవసరమైన సమాచారం, వనరులు పెద్ద స్థాయిలో అందుబాటులో ఉండేవి. మన దేశంలో కూడా వినికిడి సమస్య ఉన్న వారు తమకి ఇష్టమైన రంగంలో రాణించడానికి అవసరమైన అంశాలన్నీ సైగల భాషలో అందుబాటులో ఉంచాలని నిర్ణయించుకున్నాం. అలా 2019లో 'సైనబుల్' అనే వెంచర్ ప్రారంభించాం.





అది ప్రాథమిక హక్కు...

ఈ రోజు సైనబుల్ ఒక వైవిధ్యభరితమైన వేదిక. ఇక్కడ దాదాపు యాభై మంది ఇంటర్‌ప్రిటర్స్ ఉన్నారు. బధిరులు ఎదుర్కొంటున్న కమ్యూనికేషన్ అవరోధాలను ఇంగ్లీష్‌తో పాటు పన్నెండు వేర్వేరు భాషల్లో... వారు అధిగమించేలా చేస్తున్నారు. యూట్యూబ్‌లో ఉన్న కంటెంట్ ప్రత్యక్షానువాదంతో పాటు పాఠ్యాంశాలు తదితరాలను నేర్చుకోవడానికి వీలుగా అనువాదాలు చేయడం, టెక్స్ నుంచి సైగల భాషలోకి అనువర్తన... ఇలా ఎన్నో సేవల్ని మేం అందిస్తున్నాం. ఇండియన్ సైన్ లాంగ్వేజ్ కోర్సెస్ కూడా నిర్వహిస్తున్నాం. ఇంటర్‌ప్రిటర్లందరికీ కఠోరమైన శిక్షణ ఉంటుంది. ఇప్పటి వరకూ 350 మందికి పైగా ఇంటర్‌ప్రిటర్స్‌ను మేం తయారు చేశాం. అనువాద సేవలతో పాటు, 'అమెజాన్', 'విప్రో', 'యాక్సెంచర్' తదితర కంపెనీల్లో ఉద్యోగులకు, ఉన్నతస్థాయిలో ఉన్నవారికి శిక్షణ, కమ్యూనికేషన్ సపోర్ట్ అందిస్తున్నాం. ఇప్పటివరకూ కొన్ని వేలమంది బధిరులు మా ద్వారా ప్రయోజనం పొందారు.. నామమాత్రపు రుసుముతో మా యాప్ సేవల్ని అందుబాటులో ఉంచుతున్నాం. కార్పొరేట్ సంస్థల నుంచి విరాళాలతో పాటు, జిఎస్ఎంఎ తదితర సంస్థలు నిర్వహించే పోటీల్లో పాల్గొనడం ద్వారా నిధులు సమకూర్చుకుంటున్నాం. 'సైనబుల్' ఎంతో మంది బధిరులకు విద్య, ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలను చూపిస్తోంది. మూడేళ్ళ క్రితం 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' నిర్వహించిన ఒక సర్వే ప్రకారం భారత దేశంలో కనీసం కోటీ ఇరవై లక్షల మంది వినికిడి సమస్యలతో బాధపడుతున్నారు. సైగల భాష బధిరులకు మాతృభాష లాంటిది. తమను తాము వ్యక్తీకరించుకోడానికీ, కమ్యూనికేట్ చేసుకోవడానికి అది సాయపడుతుంది. అందుకే అది ఒక ప్రాథమిక హక్కు. వినికిడి సమస్యలున్నవారికి చిన్నతనంలోనే దాన్ని నేర్పించాలి. దీనికోసం మా వంతుగా తల్లితండ్రులకు శిక్షణ ఇవ్వడానికి, పాఠశాలల్లోని బధిర విద్యార్థులకు సైగల భాష నేర్పించడానికి ప్రణాళికలు రూపొందించాం. వైకల్యం కారణంగా ఎవరూ వివక్షకు గురికాకూడదు, ఎవరూ అవకాశాలను కోల్పోకూడదు. ఇదే నా ఆశయం."

తియ్యని ఖర్జూర తినేద్దామా!

ఖర్జూర అద్భుతమైన పోషకాహారం. శరీరంలో పిత్తం ఎక్కువగా ఉన్నవారు ఖర్జూరపండును, వాత శరీరం ఉన్నవారు ఎండు ఖర్జూరాన్ని తినడం మంచిది. ఎండు ఖర్జూర అనేది డ్రై ఫ్రూట్స్‌లో ఒకటైనప్పటికీ ఇందులో షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందనే అపోహతో దీనిని తక్కువగా వినియోగిస్తుంటారు. ఖర్జూరలో అత్యధికంగా ఫైబర్‌తోపాటు ప్రొటీన్లు, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. రోజుకు మూడు ఖర్జూరాలు తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. క్యాన్సర్‌ను నిరోధించడంలో, బరువు తగ్గడంలో, శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంలో ఖర్జూర పాత్ర విశేషమైంది.

- ఖర్జూరలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె కొట్టుకునే వేగాన్ని, రక్తపోటును సాధారణ స్థాయిలో ఉంచుతాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- నీటిలో నానబెట్టిన ఎండు ఖర్జూరాలు తినడం వల్ల మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తక్షణ శక్తి లభిస్తుంది.



- మహిళలు ప్రతిరోజూ ఖర్జూర తింటే రుతుక్రమం సరిగా ఉంటుంది. హార్మోన్లు నియంత్రణలో ఉంటాయి. గర్భధారణ సమయంలో ఆక్సిటోసిస్ డిమాండ్‌ను తగ్గిస్తుంది. గర్భవతులకు సహజ ప్రసవం అవుతుంది. కాలేయ సమస్యలు కూడా దూరమవుతాయి.
- ప్రతిరోజూ ఉదయం అల్పాహారంలో ఖర్జూరాలు ఉండేలా చూసుకుంటే శరీరానికి అవసరమైన విటమిన్లు అంది చర్మం కాంతివంతంగా మారుతుంది. శిరోజాలు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఆందోళన తగ్గి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అల్జీమర్స్ లక్షణాలు తగ్గుతాయి.
- ఖర్జూరలో చక్కెర కంటెంట్ ఉన్నప్పటికీ అది రక్తంలో చక్కెర స్థాయిని త్వరగా పెంచదు. వ్యాయామం చేయడానికి అరగంట ముందు రెండు నుంచి నాలుగు ఖర్జూరాలు తీసుకుంటే శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది. వీటిలోని మెగ్నీషియం, సెలీనియం, మాంగనీస్ వంటి సూక్ష్మ పోషకాలు ఎముకల బలోపేతానికి దోహదం చేస్తాయి.
- బాగా ఆకలిగా ఉన్నపుడు భోజనానికి ముందు ఖర్జూరాలు తినడం వల్ల నోటిలో ప్రత్యేకమైన ఎంజైమ్‌లు విడుదలవుతాయి. ఇవి భోజనం తరవాత పొట్టలోని ఆహారం సక్రమంగా జీర్ణం కావడానికి సహాయం చేస్తాయి.
- అర్ధరాత్రి సమయంలో ఆకలి అనిపించినపుడు రెండు లేదా మూడు ఖర్జురాలు తినడం వల్ల పొట్ట నిండిన అనుభూతి కలిగి మంచి నిద్ర పడుతుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 17 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com

అఖండ తాండవం ఆరంభం



నందమూరి బాలకృష్ణ-బోయపాటి శ్రీను హిట్ కాంబినేషన్‌లో నాలుగో చిత్రం మొదలైంది. వీరిద్దరి కలయికలో తెరకెక్కి ఘన విజయం అందుకున్న 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా 'అఖండ 2' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. బుధవారం ఈ చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమాలతో మొదలైంది. బాలకృష్ణ పవర్‌ఫుల్ డైలాగ్‌తో మొదలైన ముహూర్తం షాట్‌కు తేజస్విని కెమెరా స్విచాన్ చేయగా, బ్రాహ్మణి క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా తమన్ నేపథ్య సంగీతంతో రూపొందిన 'అఖండ 2 తాండవం' టైటిల్ థీమ్‌ను నందమూరి రామకృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. శివలింగం, ఢమరుకం, హిమాలయాల నేపథ్యంలో రూపొందించిన 'అఖండ 2' టైటిల్ పోస్టర్‌ను చూస్తుంటే యాక్షన్ అంశాలతో పాటు మనసును కదిలించే ఆధ్యాత్మిక అంశాలతో రూపొందుతోందని తెలుస్తోంది. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సి. రామ్ ప్రసాద్, సంతోష్ డి డెటాకే, ఆర్ట్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్: తమ్మిరాజు



సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ బుధవారం తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 19న నిర్వహించే మ్యూజికల్ కాన్సర్ట్‌కు హాజరవ్వాలని కోరుతూ ఆహ్వానం అందించారు. దేవిశ్రీ ప్రసాద్ వెంట నిర్మాత బండ్ల గణేశ్ కూడా ఉన్నారు.

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)

సైకిల్‌పై 1600 కిలోమీటర్లు!



అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. వాళ్లలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహిత్ ఒకరు. తన అభిమాన హీరోను చూడాలని అలీఘర్ నుంచి సైకిల్‌పై బయలుదేరి 1600 కిలోమీటర్లు ప్రయాణించి అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్నాడు. సైకిల్‌పై వందల కిలోమీటర్లు ప్రయాణించి తనను చేరుకున్న అభిమానిని చూసి ఆశ్చర్యపోయారు అల్లు అర్జున్ ఆప్యాయంగా అతనితో మాట్లాడారు. 'హీరో అల్లు అర్జున్‌ని కలవడం నా జీవితంలో మరుపురాని అనుభూతి. సైక్లింగ్ మొదలు పెట్టే ముందు చాలా సార్లు హనుమాన్ చాలీసా చదివాను' అని మోహిత్ తెలిపారు. అతనికి దారి ఖర్చులు ఇచ్చి మళ్లీ ఉత్తరప్రదేశ్‌కు పంపించారు అల్లు అర్జున్.

జస్ట్ ఆస్కింగ్ కాదు..
జస్ట్ షూటింగ్



'జస్ట్ ఆస్కింగ్' అంటూ ఈ మధ్య వరుస ట్వీట్లతో వార్తల్లో నిలిచారు ప్రకాశ్ రాజ్. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన ట్వీట్స్ చర్చనీయాంశంగా మారాయి. అలా జస్ట్ ఆస్కింగ్ అని ప్రశ్నించిన ఆయన.. ఇప్పుడు జస్ట్ షూటింగ్ అనుకున్నారో ఏమో వరుస షూట్లతో హైదరాబాద్‌లో బిజీగా ఉన్నారు. ఉదయం బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'జాక్' సినిమాతో.. రాత్రి పూట పవన్‌కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం షూటింగ్‌లతో తీరిక లేకుండా గడుపుతున్నారు.

ఆరేళ్ల విరామం తర్వాత

సీనియర్ నటుడు అర్జున్ ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ మెగా ఫోన్ చేపడుతున్నారు.



2018లో ఆయన దర్శకత్వంలో ఓ తమిళ సినిమా వచ్చింది. ఆ తర్వాత విష్వక్ సేన్ హీరోగా ఓ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో ప్రారంభించారు కానీ అది ఆరంభంలోనే ఆగిపోయింది. తాజాగా ఇప్పుడు 'సీతా పయనం' అనే పొయిటిక్ టైటిల్‌తో ఓ సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించనున్నారు. తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో ఈ చిత్రం ఒకేసారి విడుదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తారు.







పీరియాడిక్ ఫిల్మ్స్... నయా ట్రెండ్!

సినిమాల్లో కొత్తదనం కనిపించేందుకు ఫిల్మ్ మేకర్స్ ఫాలో అవుతున్న నయా ఫార్ములా 'పీరియాడిక్ నేపథ్యం'. పదులు, వందల సంవత్సరాలు వెనక్కి వెళ్లి, చరిత్రకు ఆధునిక సాంకేతిక హంగులు జోడించి విజయాలు అందుకుంటున్నారు. గతంలో జరిగిన సంఘటనలకు కొంత కల్పన జోడించి తీస్తున్న ఈ సినిమాలకు ప్రేక్షకుల స్పందన కూడా బాగుంది. అందుకే ఇప్పుడంతా ఈ నయా ట్రెండ్ నడుస్తోంది. ఇలా రూపుదిద్దుకుంటున్న చిత్రాలేమిటో ఒకసారి చూద్దాం.

ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఫౌజీ'. చారిత్రక అంశాలు కలిగిన ఈ పీరియాడిక్ లవ్ యాక్షన్ డ్రామా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. 'సీతారామం'తో సూపర్ హిట్ కొట్టిన హను, 'సలార్', 'కల్కి 2898ఏ.డీ'లతో వసూళ్ల సునామీ సృష్టించిన ప్రభాస్ కలయికలో వస్తుండడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి.

స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్: బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న చిత్రం 'ఆర్‌సీ 16'. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే పీరియాడిక్ కథ ఇది. ఇందులో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది.

ప్రజానాయకుడిగా: నాని, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'దసరా'లో నటించి సూపర్‌హిట్ కొట్టారు. ఇప్పుడు ఆయన అదే దర్శకుడితో మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇది కూడా పొలిటికల్ టచ్‌తో సాగే పీరియాడికల్ చిత్రమట. ఇందులో ప్రజానాయకుడి పాత్రలో ఊర మాస్ లుక్‌లో నాని కనిపించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

వీరుడిగా విజయ్: రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ పీరియాడిక్ చిత్రంలో నటిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య జరిగిన కొన్ని చారిత్రక సంఘటనలను ఆధారం చేసుకుని రూపొందుతున్న చిత్రమిది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విజయ్ వీరుడిగా అలరించనున్నారు.

యదార్థ సంఘటనలతో: 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'మట్కా'. 1950 నుంచి 1980ల మధ్య కాలంలో వైజాగ్ నేపథ్యంలో జరిగిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ సినిమా నవంబర్ 14న విడుదల కానుంది.


స్వాతంత్ర్యానికి పూర్వం: నూతన దర్శకుడు రోహిత్.కే.పీ దర్శకత్వంలో 1940 నేపథ్యంలో తెరకెక్కుతున్న ఓ సినిమాలో సాయి దుర్గాతేజ్ నటించనున్నారు. 'ఎస్‌డీటీ 18' వర్కింగ్ టైటిల్‌తో స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కథతో తెరకెక్కుతోంది. దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా సాయి దుర్గాతేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో కూడుకున్నది. సాయి దుర్గాతేజ్ పుట్టినరోజు సందర్భంగా ఇటీవలే విడుదల చేసిన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది.


అక్కినేని అఖిల్, దర్శకుడు అనిల్‌కుమార్ ఉపాధ్యాయుల దర్శకత్వంలో నటించే చిత్రం కూడా పీరియాడికల్ నేపథ్యం ఉన్నదే. ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం.

చారిత్రక నేపథ్యంలో: పవన్ కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. చారిత్రక నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను రెండు భాగాలుగా జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు. బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాత్రను పోషిస్తున్నారు.

తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా నటిస్తున్న చిత్రం 'కంగువ'. ఈ సినిమా కథాంశం.. ఎక్కువ శాతం చారిత్రక నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా.. కొంత శాతం వర్తమానంలో సాగేలా ఉండనుంది. నవంబర్ 14న విడుదలవుతోంది. శివ దర్శకుడు. ఇందులో సూర్య చారిత్రక పోరాట యోధుడు 'కంగువ'.. వినోదాలు పంచే 'ఫ్రాన్సిస్' పాత్రల్లో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. మరోవైపు, కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న 'సూర్య 44' కూడా పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతోంది.

నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న 'స్వయంభు' చారిత్రక నేపథ్యంలో సాగే పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది.. భరత్ కృష్ణమాచారి దర్శకుడు. మరోవైపు నిఖిల్ స్వాతంత్ర్యానికి ముందు సాగే పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ద ఇండియా హౌస్'లోనూ నటిస్తున్నారు.







భారీసెట్‌తో మొదలు



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఇటీవలే ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. 'శర్వా 38' అనేది వర్కింగ్ టైటిల్. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బేనర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. 1960లో ఉత్తర తెలంగాణ, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని గ్రామీణ నేపథ్యంలో కథ సాగుతుండడంతో ఆనాటి సంస్కృతిని ప్రతిబింబించేలా హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. 15 ఎకరాల విస్తీర్ణంలో భారీ వ్యయంతో ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె ఈ సెట్‌ను రూపొందిస్తున్నారు. ఈ సెట్‌లో సినిమాకు కీలకమైన ఘట్టాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

విభిన్నంగా ప్రయత్నించాను



'పొట్టేల్' చిత్రంలో నాలుగు పాటలకూ చక్కటి ప్రేక్షకాదరణ లభించడం ఆనందాన్నిస్తోందని సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర అన్నారు. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. సురేశ్ కుమార్ సడిగె నిర్మాత. 'పొట్టేల్' ఈ నెల 25న విడుదలవుతోన్న సందర్భంగా శేఖర్ చంద్ర సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రం కావడంతో 'పొట్టేల్'కు సందర్భానుసారం సంగీత సృజన చేయడానికి కాస్త ఎక్కువ సమయం పట్టింది. పల్లె ప్రాంతంలో సహజమైన వాతావరణంలో ఈ సినిమాను చిత్రీకరించారు. దానికి తగినట్లు సంగీతం సమకూర్చడానికి విభిన్నంగా ప్రయత్నించాను. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ పాటను పాశ్చాత్య శైలిలో స్వరాలు సమకూర్చడం ద్వారా ఓ ప్రయోగం చేశాను. అది ప్రేక్షకులకు బాగా నచ్చుతోంది' అన్నారు.

ఆ ఇద్దరి కోసం



యాక్షన్ కింగ్ అర్జున్, జె.డి చక్రవర్తి కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఇద్దరు'. ఎస్.ఎస్ సమీర్ దర్శకత్వంలో మహమ్మద్ ఫర్హీన్ ఫాతిమా నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతున్న సందర్భంగా బుధవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మంచి లోకేషన్లలో గ్రాండ్‌గా చిత్రీకరణ చేశాం. అర్జున్, చక్రవర్తి ఇద్దరూ పోటీపడి నటించారు. కళాతపస్వి కే. విశ్వనాథ్‌గారు నటించిన చివరి సినిమా ఇదే. ఆయన ఎంతో ఇష్టపడి చేసిన చిత్రమిది. ఓ పాటలో ఆయన స్టెప్స్ కూడా వేశారు' అని తెలిపారు. హీరోలు ఇద్దరూ కలసి చేసిన యాక్షన్ హంగామా ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు.



రకుల్ వెన్నెముకకు గాయం

బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గన్‌తో కలిసి 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నారు రకుల్ ప్రీత్ సింగ్. సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తూ ప్రస్తుతం తన దృష్టినంతా బాలీవుడ్‌పైనే కేంద్రీకరించారు. అయితే, జిమ్‌లో రెగ్యులర్‌గా వర్కవుట్స్ చేసే రకుల్... ఇటీవల 80 కిలోల బరువును లిఫ్ట్ చేసే క్రమంలో వెన్నెముకకు తీవ్ర గాయమైంది. ఆమె వర్కవుట్ బెల్ట్ పెట్టుకోకుండా భారీ వెయిట్ లిఫ్టింగ్ చేయడంతోనే గాయమైందని డాక్టర్లు నిర్ధారించారు. డాక్టర్ల సూచనల మేరకు ప్రస్తుతం రకుల్ ప్రీత్ బెడ్ రెస్ట్ తీసుకుంటున్నారు. కాగా, సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్‌తో తన ఆరోగ్యంపై తాజా అప్‌డేట్స్ షేర్ చేసుకున్నారు రకుల్ ప్రీత్. 'ఆరు రోజుల నుంచి బెడ్ రెస్ట్ తీసుకుంటున్నాను. పూర్తిగా కోలుకోవడానికి మరో వారం రోజులు పడుతుంది. త్వరితగతిన కోలుకుంటాననే నమ్మకం నాకుంది. విశ్రాంతి భారంగా అనిపిస్తోంది' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రకుల్ పోస్ట్ చేశారు.

శివగాడు యమాస్పీడ్



నటుడు సుమన్ ముఖ్య పాత్రధారిగా రూపొందుతున్న చిత్రం 'శివగాడు యమాస్పీడ్'. శివ జొన్నలగడ్డ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మెడికల్ మాఫియా మోసాల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజేందర్, రవిశంకర్, పొట్టి ప్రసాద్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని శివ చెప్పారు. సినిమాటోగ్రఫీ: ఏఎస్ రత్నం.

ఇన్ ప్రోగ్రెస్

కొత్త ఒరవడి సృష్టిస్తుంది



అకిరా డ్రీమ్ క్రియేషన్స్ పతాకంపై రాజేష్ నాయుడు దర్శకత్వంలో యోగేష్, ఆకృతి అగర్వాల్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'త్రిముఖ'. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను హీరో సాయి దుర్గా తేజ్ ఆవిష్కరించి మాట్లాడారు. 'యోగేష్ మంచి పట్టుదల ఉన్న వ్యక్తి. ఈ చిత్రం డెఫినెట్‌గా కొత్త ఒరవడి సృష్టిస్తుంది' అని అన్నారు. హీరో యోగేష్ మాట్లాడుతూ 'నా మొదటి ప్రాజెక్ట్‌గా త్రిముఖలో నటించడం సంతోషంగా ఉంది. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని చాలా నమ్మకంగా ఉంది' అని అన్నారు.

మర్డర్ మిస్టరీ-క్రైమ్ థ్రిల్లర్



మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోనీ నటించిన తాజా చిత్రం 'గగన మార్గన్'. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోని నిర్మించారు. ఎన్నో చిత్రాలకు ఎడిటర్‌గా పని చేసిన లియో జాన్ పాల్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కాగా, తాజాగా రిలీజ్ చేసిన ఈ చిత్రం టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విజయ్ ఆంటోని రెండు రకాలుగా కనిపించారు.

పుట్టినరోజున 'ఈశ్వర్'



ప్రభాస్ 'ఈశ్వర్' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న రీ రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్ అంటూ రిలీజ్ చేసిన మూవీ ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ మూవీని జయంత్ సీ పరాన్జీ తెరకెక్కించారు. కె.అశోక్ నిర్మించారు. లక్ష్మీ నరసింహా మూవీస్ సంస్థ రీ రిలీజ్ చేస్తోంది.

టైమ్ ట్రావెల్



సాయి రోనక్, అమృత చౌదరి హీరో హీరోయిన్లుగా క్రాస్ వైర్ క్రియేషన్స్‌పై నిర్మాత, దర్శకుడు కళ్యాణ్ చక్రవర్తి తెరకెక్కించిన చిత్రం రివైండ్. ఈ నెల 18న సౌత్ ఇండియా వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. 'కొత్త కాన్సెప్ట్‌తో టైమ్ ట్రావెల్ మీద ఈ సినిమాని తీసుకొస్తున్నాం. తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని, కొత్త కంటెంట్‌ని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తారు' అని చెప్పారు.

థ్రిల్ ఇచ్చే డీల్



హను కోట్ల హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది డీల్'. హెచ్ పద్మా రమాకాంతరావు, రామకృష్ణ కొళివి నిర్మించారు. చందన, ధరణి, ప్రియ కథానాయికలు. ఈ నెల 18న విడుదలయ్యే ఈ చిత్రం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని నిర్మాతలు తెలిపారు.

2035 నాటికి భారత రోడ్లపైకి
రోజుకు 12,000 కొత్త కార్లు

మెక్సికో దేశ కరెంట్ వినియోగాన్ని మించనున్న ఏసీల విద్యుత్ వాడకం

2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా

కోరలు చాస్తున్న ఇంధన డిమాండ్.. ఐఈఏ నివేదిక వెల్లడి

భారతదేశ ఇంధన దాహం రోజురోజుకు పెరిగిపోతోంది. ఆర్థికాభివృద్ధి, జనాభా ఇందుకు దోహదం చేస్తున్నాయి. అంతేకాకుండా వ్యక్తిగత, వాణిజ్య వాహనాలకు ఏటేటా డిమాండ్ పెరిగిపోతోంది. దీంతో భారత్‌లో 2035 నాటికి రోజుకు 12,000 కార్లు కొత్తగా రోడ్లపైకి రానున్నాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) అంచనా వేసింది. ఇదే సమయంలో మన దేశంలోని ఎయిర్ కండీషనర్లు (ఏసీలు) వినియోగించే విద్యుత్.. మెక్సికో దేశ మొత్తం కరెంట్ వినియోగాన్ని మించిపోతుందని వెల్లడించింది.



న్యూఢిల్లీ: భారత ఇంధన అవసరాలు ఏటా గణనీయంగా పెరిగిపోతున్నాయి. వచ్చే పదేళ్లలో భారత్‌లో ఇది మరింతగా పెరగనుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ).. వరల్డ్ ఎనర్జీ ఔట్‌లుక్-2024 పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2035 నాటికి భారత ఇంధన డిమాండ్ మరో 35 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. అప్పటికి దేశంలో స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం ప్రస్తుత స్థాయి నుంచి మూడింతలు పెరిగి 14 లక్షల మెగావాట్లకు చేరుతుందని తెలిపింది. ఆర్థికాభివృద్ధి, పెరుగుతున్న జనాభా భారత్‌లో ఇంధన వినియోగాన్ని ఏటికేటికీ పెంచేస్తున్నాయని నివేదిక పేర్కొంది.

వాహనాలు పెరిగిపోతే కష్టమే: దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న మోటారు వాహనాలపైనా ఐఈఏ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పెరుగుదల ఇలానే కొనసాగితే 2035 నాటికి రోజుకు 12,000 కొత్త కార్లు రోడ్లపైకి వస్తాయని అంచనా వేసింది. దాంతో వీటి పార్కింగ్ పెద్ద సమస్యగా మారనుంది. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు ఏటా 100 కోట్ల చదరపు మీటర్ల స్థలం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇది దాదాపు దక్షిణాఫ్రికా దేశ విస్తీర్ణానికి సమానం. 2035 నాటికి భారత్‌లో ఏసీలు వినియోగించే కరెంట్.. మెక్సికో దేశం వినియోగించే మొత్తం కరెంట్‌ను మించిపోతుందని తెలిపింది.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ: ఎన్ని శషభిషలు ఉన్నా 2028 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని ఐఈఏ అంచనా. కాకపోతే ఇందుకు జీడీపీ వృద్ధి రేటు ప్రస్తుత స్థాయిలో కొనసాగాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గత ఏడాది (2023) భారత్ 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటుతో ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యధిక వృద్ధి రేటు సాధించిన దేశంగా నిలిచిన విషయాన్ని గుర్తు చేసింది.

బొగ్గే గతి: పునరుత్పాదక ఇంధన వనరులపై ఎంతగా ప్రచారం జరుగుతున్నా భారత ఇంధన రంగంలో ఇప్పటికీ బొగ్గుదే హవా అని ఐఈఏ తెలిపింది. ప్రస్తుతం మొత్తం ఇంధన వినియోగంలో బొగ్గు వాటా 40 శాతంగా ఉంది. ఇక మొత్తం స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నా.. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల వాటా 60 శాతానికి పైగా ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. మరో రెండేళ్లలో ఇది 68 శాతానికి చేరుతుందని తెలిపింది. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ కేంద్రాలతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువ. 2030 నాటికి అందుబాటులోకి వచ్చే కొత్త విద్యుత్ ఉత్పాదక సామర్థ్యంలోనూ దాదాపు 60,000 మెగావాట్లు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారానే అందుబాటులోకి రానుందని ఐఈఏ నివేదిక తెలిపింది.

చమురు ఉత్పత్తి దేశాలకు తిప్పలు తప్పవు: మరో ఐదేళ్ల తర్వాత చమురు ఉత్పత్తి దేశాలకు తిప్పలు తప్పవని ఐఈఏ స్పష్టం చేసింది. అప్పుడు ఇప్పటిలా కృత్రిమంగా ఉత్పత్తి కుదించి చమురు ధరలు పెంచుకునే ఈ దేశాల వ్యూహం పెద్దగా ఫలించకపోవచ్చని తెలిపింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వనరులే ఇందుకు కారణమని స్పష్టం చేసింది. అయితే భారత్ ఈ విషయంలో కొన్ని సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఐఈఏ అంచనా వేసింది.

ముఖ్యంగా డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ వాహనాలు, చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారనుంది. దీంతో ఇప్పటికే చమురు వినియగం, దిగుమతుల్లో మూడో స్థానంలో ఉన్న భారత్ వచ్చే పదేళ్లలోనూ అదే స్థానంలో కొనసాగుతుందని ఐఈఏ అంచనా. అప్పటికి భారత రోజువారీ చమురు దిగుమతులు మరో 20 లక్షల బ్యారెల్స్ మేర పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

పసిడి.. రికార్డ్!

రూ.79,000 చేరువలో బంగారం

ముంబై: దేశీయంగా పసిడి ధర సరికొత్త జీవితకాల రికార్డు స్థాయికి చేరింది. బుధవారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.250 పెరుగుదలతో రూ.78,900కి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ విలువైన లోహం రేటు పెరగడంతో పాటు దేశీయంగా ఆభరణ వర్తకుల కొనుగోళ్లు పెరగడం ఇందుకు దోహదపడిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. కిలో వెండి ధర సైతం రూ.1,000 పెరిగి రూ.93,500గా నమోదైంది. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రేటు 0.51 శాతం పెరిగి 2,692.50 డాలర్లకు చేరుకోగా..వెండి 0.91 శాతం పెరుగుదలతో 32.05 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఆర్ఐఎల్ బోనస్ షేర్ల జారీకి ఈ నెల 28 రికార్డు తేదీ

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేసేందుకు కంపెనీ షేర్‌హోల్డర్ల నుంచి ఆమోదం లభించింది. బోనస్ షేర్ల జారీకి ఈ నెల 28 రికార్డు తేదీగా నిర్ణయించినట్లు కంపెనీ బుధవారం ప్రకటించింది. గడిచిన ఏడేళ్లలో కంపెనీకిదే తొలి బోనస్ షేర్ల జారీ కానుంది. చివరిసారి 2017 సెప్టెంబరులోనూ సంస్థ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసింది. ఆర్ఐఎల్ బోనస్ షేర్లను జారీ చేయడం ఇది ఆరోసారి.

డాక్టర్ రెడ్డీస్ షేర్ల విభజనకు సైతం: హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తన షేర్లను 1:5 నిష్పత్తిలో విభజించనుంది. రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.1 ముఖవిలువతో కూడిన 5 షేర్లుగా విభజించనుంది. షేర్ల కేటాయింపునకు అర్హులైన షేర్‌హోల్డర్లను ఈ నెల 28న నిర్ణయించనుంది.

ఏఓపీలకూ డీమ్యాట్ అకౌంట్లు!

ముంబై: అసోసియేషన్స్ ఆఫ్ పర్సన్స్ (ఏఓపీ) పేరిట డీమ్యాట్ ఖాతాలు తెరిచేందుకు, ఈక్విటీ షేర్లు మినహాయించి కొన్ని రకాల సెక్యూరిటీలను డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉండేందుకు అనుమతించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రాన్ని బుధవారం విడుదల చేసింది. వచ్చే నెల 5 నాటికల్లా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది. సెబీ తాజా ప్రతిపాదన సులభతర వ్యాపార నిర్వహణతో పాటు సెక్యూరిటీలను భౌతికంగా కాకుండా ఎలక్ట్రానిక్ రూపంలో కలిగి ఉండటాన్ని ప్రోత్సహించనుంది.

డెట్ సెక్యూరిటీ ఇన్వెస్టర్ల కోసం లిక్విడిటీ విండో

స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా డెట్ సెక్యూరిటీలను కొనుగోలు చేసే ఇన్వెస్టర్ల కోసం సెబీ లిక్విడిటీ విండోను ప్రవేశపెట్టింది. ఇన్వెస్టర్లు తాము కలిగి ఉన్న లిస్టెడ్ డెట్ సెక్యూరిటీలను వాటిని జారీ చేసిన వారికి నిర్దేశిత తేదీతో కూడిన పుట్ ఆప్షన్ ద్వారా తిరిగి విక్రయించేందుకు ఇది వీలు కల్పిస్తుందని సెబీ తెలిపింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది.

ఐటీ, వాహన షేర్లలో అమ్మకాలు

- 318 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రేడింగ్ ట్రెండ్, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ఐటీ, వాహన రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో ప్రామాణిక సూచీలు నష్టాలు చవిచూశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 461.86 పాయింట్ల మేర క్షీణించినప్పటికీ, చివరికి 318.76 పాయింట్ల నష్టంతో 81,501.36 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86.05 పాయింట్లు కోల్పోయి 24,971.30 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ మరోసారి 25,000 దిగువకి చేరింది.

వచ్చే ఏడాది కాలంలో 27,800 స్థాయికి నిఫ్టీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ప్రామాణిక సూచీ నిఫ్టీ 50 వచ్చే ఏడాది కాలంలో 27,867 స్థాయికి చేరుకోవచ్చని దేశీయ బ్రోకరేజీ సంస్థ పీఎల్ క్యాపిటల్ అంచనా వేసింది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలోనూ చురుకుగా వృద్ధి చెందుతున్న రంగాలు, మదుపరులలో జాగురూకతతో కూడిన ఆశావహం సూచీ ర్యాలీకి దోహదపడనున్నాయని తాజా నివేదికలో పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,890 ▲	71,400 ▲	1,02,900 ▼
ముంబై	76,553 ▲	70,123 ▲	91,512 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	505
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	538	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	127
కర్నూలు	126	నెల్లూరు	127
విశాఖపట్నం	125	అనంతపురం	127
గోదావరి	135		

ఎగుమతులు..కాస్త మెరుగు

- 2 నెలల క్షీణత తర్వాత మళ్లీ వృద్ధి బాటలోకి..
- సెప్టెంబరులో రూ.2.90 లక్షల కోట్లుగా నమోదు
- ఐదు నెలల కనిష్ఠానికి తగ్గిన వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: భారత విదేశీ వాణిజ్యం మళ్లీ కాస్త పుంజుకుంది. వరుసగా రెండు నెలలపాటు క్షీణించిన ఎగుమతులు.. సెప్టెంబరులో మళ్లీ వృద్ధిని నమోదు చేశాయి. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో దేశీయ ఉత్పత్తుల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 0.5 శాతం పెరిగి 3,458 కోట్ల డాలర్లకు (రూ.2,90,472 కోట్లు) చేరుకున్నాయి. కాగా, గత నెలలో దిగుమతులు కూడా 1.6 శాతం పెరుగుదలతో 5,536 కోట్ల డాలర్లుగా (రూ.4,65,024 కోట్లు) నమోదయ్యాయి. అయినప్పటికీ, వాణిజ్య లోటు 5 నెలల కనిష్ఠ స్థాయి 2,078 కోట్ల డాలర్లకు (రూ.1,74,552 కోట్లు) పరిమితమైంది. ఎగుమతుల ద్వారా లభించే ఆదాయం కంటే ఎగుమతుల వ్యయం అధికంగా ఉండటాన్ని వాణిజ్య లోటు అంటారు. ఎగుమతులు గణనీయంగా క్షీణించిన కారణంగా ఈ ఆగస్టులో వాణిజ్య లోటు 10 నెలల గరిష్ఠ స్థాయి 2,965 కోట్ల డాలర్లకు పెరిగింది.

చైనా నుంచే అధిక దిగుమతులు: భారత దిగుమతుల్లో చైనాదే అత్యధిక వాటా. వాణిజ్య శాఖ డేటా ప్రకారం.. ఈ ప్రథమార్ధంలో చైనా నుంచి 5,629 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులు దిగుమతయ్యాయి. కాగా, భారత ఎగుమతులకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. గత ఆరు నెలల్లో అమెరికాకు ఎగుమతులు 5.62 శాతం పెరుగుదలతో 4,038 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

శాటిలైట్ స్పెక్ట్రమ్‌పై అంబానీ, మిట్టల్‌కు చుక్కెదురు

కేటాయింపుల ద్వారానే స్పెక్ట్రమ్

న్యూఢిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్లకు ఉపయోగించే స్పెక్ట్రమ్‌ను వేలం ద్వారా కేటాయించాలన్న రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ డిమాండ్‌కు చుక్కెదురైంది. ఈ స్పెక్ట్రమ్‌ను మిగతా అన్ని దేశాల్లానే మన దేశంలోనూ ప్రత్యేక కేటాయింపు ద్వారా కేటాయిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన విధి విధానాలు, ధరలను ట్రాయ్ నిర్ణయిస్తుందని ఢిల్లీలో జరుగుతున్న ఐఎంసీ సదస్సులో కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటియా మాత్రం దీనికి సంబంధించి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్టార్‌లింక్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్వాగతించారు. శాటిలైట్ కమ్యూనికేషన్ కంపెనీలు ఈ స్పెక్ట్రమ్ ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం టెలికాం, బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించవచ్చు. దీంతో ఈ రంగాలపై తమ పట్టు ఎక్కడపోతుందోననే భయంతో, ఈ కంపెనీలకు కూడా స్పెక్ట్రమ్‌ను తమలాగే వేలం ద్వారా కేటాయించాలని రిలయన్స్ జియో అధినేత ఆకాశ అంబానీ, ఎయిర్‌టెల్ అధినేత సునీల్ మిట్టల్ ప్రభుత్వాన్ని కోరారు.

స్పోర్ట్స్

టాస్ కూడా వేయలేదు!

- తొలి రోజు ఆట వర్షార్పణం
- భారత్-కివీస్ మొదటి టెస్ట్

ఉ. 9.15 నుంచి స్పోర్ట్స్18లో..


జైస్వాల్, కోహ్లీ

బెంగళూరు: ఎడతెరిపిలేని వర్షం కారణంగా భారత్-న్యూజిలాండ్ మధ్య తొలి టెస్ట్ మొదటి రోజు ఆట ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. బుధవారం ఉదయం నుంచే వాన కురుస్తుండడంతో మధ్యాహ్నం 2.30 గంటలకు తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కనీసం టాస్ వేయడానికి కూడా పరిస్థితులు సహకరించలేదు. మధ్యాహ్నం 2 గంటలకు అంపైర్లు పిచ్‌ను పరిశీలించడానికి వచ్చినప్పుడు.. వికెట్‌కు ఇరువైపులా తడిగా ఉన్నట్టు గమనించారు. ఆ సమయంలో మరోసారి భారీ వర్షం కురవడంతో ఆటను రద్దు చేశారు. రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో హాక్-ఐ కెమెరాలను కూడా అమర్చలేదు. ఒకవేళ మ్యాచ్ జరిగే పరిస్థితులుంటే ఆ కెమెరాలను అమర్చడానికే మరో గంటన్నర సమయం పట్టేది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ చెప్పుకోదగ్గ సంఖ్యలో ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. వీరికి కోహ్లీ, యశస్వీ జైస్వాల్ నెట్ ప్రాక్టీస్‌ను చూసే చాన్స్ దక్కింది. గురువారం కూడా మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం బట్టి తెలుస్తోంది. ఒక రోజు నష్టపోవడంతో.. మిగిలిన నాలుగు రోజులు 98 ఓవర్ల చొప్పున ఆట సాగేందుకు మ్యాచ్ 15 నిమిషాలు ముందుగా ఆరంభమై.. 15 నిమిషాలు ఆలస్యంగా ముగియనుంది. స్లో ఓవర్ రేట్ నడిస్తే మరో అరగంటపాటు ఆటను పొడిగించే అవకాశం ఉంది. గురువారం ఉదయం 8.45 గంటలకు టాస్‌ను షెడ్యూల్ చేశారు.

గాయత్రి, సిక్కి జోడీలకు నిరాశ

ఓడెన్స్ (డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ డబుల్స్‌లో భారత్ పోరు ముగిసింది. మహిళల డబుల్స్ ఆరంభ రౌండ్లో ట్రీసా జాలీ/గాయత్రీ గోపీచంద్ జోడీ 21-19, 17-21, 15-21తో మలేసియా ద్వయం పెర్లీ టాన్/టీనా చేతిలో ఓటమి పాలైంది. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి/సిక్కి రెడ్డి జంట 22-20, 19-21, 22-24తో కెనడా జోడీ కెవిన్/ఎలియానా చేతిలో పరాజయం పాలైంది. మిగతా భారత షట్లర్లలో మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్ కూడా మొదటి రౌండ్లోనే ఇంటిబాట పట్టారు.

ఫేవరెట్ ఆస్ట్రేలియా

దక్షిణాఫ్రికాతో నేడు తొలి సెమీఫైనల్
మహిళల టీ20 వరల్డ్ కప్



షట్ — ఎంలాబా

దుబాయ్: వరుసగా మూడుసార్లు డిఫెండింగ్ చాంపియన్‌గా నిలుస్తూ టీ20 వరల్డ్ కప్‌లో తిరుగులేని జట్టుగా ముద్ర వేసుకున్న ఆస్ట్రేలియా మహిళలు ప్రతిష్ఠాత్మక టోర్నీలో మరో పోరుకు సిద్ధమయ్యారు. గురువారం జరిగే సెమీఫైనల్లో సౌతాఫ్రికాను ఢీకొననున్నారు. అయితే గ్రూపు దశలో ప్రత్యర్థులపై ప్రదర్శించిన ఆధిపత్యాన్ని చూస్తే..సెమీస్‌లో ఆస్ట్రేలియా జట్టే నిస్సందేహంగా హాట్ ఫేవరెట్. 2009లో ఈ మెగా టోర్నమెంట్ ప్రారంభమయ్యాక ఇది తొమ్మిదో వరల్డ్ కప్. కాగా, ఈ టోర్నీలో అన్నిసార్లూ కంగారూలు సెమీఫైనల్‌కు చేరడం విశేషం. ఇక, ఆరుసార్లు ఆస్ట్రేలియా చాంపియన్‌గా నిలిచింది. ఇకపోతే..ఈసారి సెమీఫైనల్ 2023లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌ను గుర్తు తెస్తోంది. నాడు ఈ రెండు జట్లే తుది పోరులో తలపడగా..19 పరుగులతో కంగారూలు జయకేతనం ఎగురు వేశారు. మహిళల టీ20లలో ఇరుజట్లూ 10 సార్లు పరస్పరం ఢీకొన్నాయి. ఇందులో 9 సార్లు విజేతగా నిలవడం ఆసీస్ సత్తాను తెలియజేస్తుంది. టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికాతో 7సార్లు తలపడిన ఆసీస్ అన్నిసార్లూ గెలిచింది. రిటైర్మెంట్ ప్రకటించిన మెగ్ లానింగ్ మినహా 2023 మెగా టోర్నమెంట్ ఫైనల్లో ఆడిన అలీసా హీలీ, బెత్ మూనీ, పెర్రీ, మేగన్ షట్, గార్డ్‌నర్..తదితర 10 మంది క్రికెటర్లు ప్రస్తుత ఆసీస్ జట్టులో ఉన్నారు. మందకొడిగా ఉండే దుబాయ్ పిచ్‌పై ఆడనుండడం బ్యాటింగ్ డెప్త్ ఉన్న ఆస్ట్రేలియాకు కలిసి వచ్చే అంశం. మరోవైపు స్లో లెఫ్టామ్ స్పిన్నర్ ఎంలాబానే దక్షిణాఫ్రికా జట్టుకు తురుపు ముక్క. గ్రూపు దశలోని 4 లీగ్ మ్యాచ్‌ల్లో ఆమె 10 వికెట్లు పడగొట్టింది. లారా వోల్వార్ట్, బ్రిట్స్, మరిజానే కాప్ ముగ్గురూ మ్యాచ్ విన్నర్లే. కానీ హీలీ సారథ్యంలో అత్యంత పటిష్ఠంగా ఉన్న జట్టుపై వారు ఎలా రాణిస్తారనేది కీలకం.

'హాల్ ఆఫ్ ఫేమ్'లో నీతూ

కుక్, డివిల్లీర్స్ కూడా..


నీతూ డేవిడ్

దుబాయ్: భారత మహిళల జట్టు మాజీ స్పిన్నర్ నీతూ డేవిడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో డేవిడ్‌కు చోటు లభించింది. డయానా ఎడుల్జీ తర్వాత ఈ ఘనత సొంతం చేసుకొన్న రెండో భారత ప్లేయర్‌గా నీతూ (47) నిలిచింది. ఆమెతోపాటు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్, దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిల్లీర్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌కు ఎంపికయ్యారు. నీతూ ప్రస్తుతం భారత మహిళల జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన డేవిడ్ ఎడమ చేతి వాటం స్పిన్నర్. 1995-2008 మధ్య నీతూ 10 టెస్టులు, 97 వన్డేలు ఆడింది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో 100 వికెట్ల మైలురాయిని చేరిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కింది. 2006లో రిటైర్మెంట్ ప్రకటించినా మళ్లీ వెనక్కు తీసుకొని కొంతకాలం ఆడింది. 1995లో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఒక ఇన్నింగ్స్‌లో 8/53తో రికార్డు సృష్టించింది. మహిళల టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటికీ ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

ఢిల్లీలో ఖో ఖో వరల్డ్ కప్

- జనవరి 13న టోర్నీ ప్రారంభం

న్యూఢిల్లీ: తొలిసారి నిర్వహిస్తున్న ఖో ఖో వరల్డ్ కప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ మెగా టోర్నీ వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు వరల్డ్ కప్ అధికారిక లోగోను ఆవిష్కరించారు. పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నీలో 24 దేశాల జట్లు పాల్గొంటున్నాయని భారత ఖో ఖో సమాఖ్య అధ్యక్షుడు సుధాంశు మిట్టల్ వెల్లడించాడు.

మళ్లీ ముంబై జట్టులోకి పరాస్ మాంబ్రే

ముంబై: టీమిండియా మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే ఐపీఎల్‌లో మళ్లీ ముంబై ఇండియన్స్ జట్టుతో చేరాడు. వచ్చే ఐపీఎల్ సీజన్‌కు తమ జట్టు బౌలింగ్ కోచ్ మలింగతో కలిసి పరాస్ పని చేయనున్నట్టు ముంబై ఇండియన్స్ యాజమాన్యం బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన టీమిండియాకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన 52 ఏళ్ల పరాస్ పదవీకాలం ఈ జూన్‌తో ముగిసింది. దీంతో ముంబై ఫ్రాంచైజీ తిరిగి అతణ్ని జట్టులోకి తీసుకుంది. 2013లో ఐపీఎల్ విజేతగా నిలిచినప్పుడు ముంబై జట్టుతో పరాస్ పనిచేశాడు. ఇక, ముంబై చీఫ్ కోచ్‌గా మహేల జయవర్ధనే వ్యవహరించనున్న సంగతి తెలిసిందే.

హర్మన్ కెప్టెన్సీపై వేటు?

బీసీసీఐ నిర్ణయం!
త్వరలో సెలెక్షన్ కమిటీ భేటీ



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్ కప్‌లో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి గ్రూపు దశ నుంచే వైదొలగడం..భారత జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పదవికి ఎసరు తెచ్చేలా ఉంది. టీమిండియా దారుణ ప్రదర్శనపై బీసీసీఐ ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం. ఈమేరకు హర్మన్‌ప్రీత్‌ను సారథ్య బాధ్యతలనుంచి తప్పించాలని బోర్డు పెద్దలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రపంచ కప్ గ్రూపు 'ఎ'లో తలపడిన భారత్ నాలుగు మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిచి మరో రెండింటిలో ఓడింది. దాంతో మొత్తం నాలుగు పాయింట్లతో ఐదు జట్ల గ్రూపులో మూడోస్థానంతో టోర్నీనుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే. కాగా..ఈనెల 24 నుంచి భారత్‌లో న్యూజిలాండ్ మహిళల జట్టు పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. ఈ సిరీస్‌కు టీమిండియాను ఎంపిక చేసేందుకు సెలెక్టర్లు సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా సెలెక్షన్ కమిటీ, జట్టు చీఫ్ కోచ్ అమోల్ మజుందార్‌తో భేటీ అయ్యే బీసీసీఐ పెద్దలు హర్మన్‌ప్రీత్ భవితవ్యంపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. 'జట్టుకు కొత్త కెప్టెన్ ఉండాలా..వద్దా..అనే విషయమై బీసీసీఐ తప్పకుండా చర్చిస్తుంది. జట్టు ఏది కావాలంటే అది బోర్డు ఇచ్చింది. కానీ జట్టు ప్రదర్శన గమనిస్తే కొత్త సారథిని నియమించే సమయం ఆసన్నమైందని భావిస్తున్నాం. హర్మన్‌ప్రీత్ జట్టులో ముఖ్య సభ్యురాలిగానే కొనసాగుతుంది. కాకపోతే.. మార్పునకు ఇదే తగిన సమయం' అని బోర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అయితే హర్మన్‌ను తొలగిస్తే..వైస్-కెప్టెన్ స్మృతి మంధానాకు సారథ్య బాధ్యతలు అప్పగిస్తారా లేక జెమీమా రోడ్రిగ్స్ పేరును పరిశీలిస్తారా అన్నది చూడాలి.. 2016లో హర్మన్ టీ20 జట్టు కెప్టెన్‌గా నియమితురాలైంది. ఆమె సారథ్యంలో 2018, 2023 టీ20 ప్రపంచ కప్ సెమీస్‌కు క్వాలిఫై అయిన జట్టు.. 2020లో ఫైనల్‌కు చేరింది.

ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టిన సాజిద్

● డకెట్ సెంచరీ ● స్టోక్స్ సేన 239/6, పాక్ 366

ముల్తాన్: స్పిన్నర్ సాజిద్ ఖాన్ (4/86) తిప్పేయడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ పైచేయి సాధించింది. ఓపెనర్ బెన్ డకెట్ (114) మినహా మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో.. ఆటకు రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 239/6 స్కోరు చేసింది. బుధవారం ఆట చివరకు జేమ్ స్మిత్ (12), కార్స్ (2) క్రీజులో ఉన్నారు. 10 బంతుల తేడాతో రూట్ (34), డకెట్, బ్రూక్ (9)ను అవుట్ చేసిన సాజిద్.. స్టోక్స్ సేనను గట్టి దెబ్బ కొట్టాడు. కాగా, ఓవర్‌నైట్ స్కోరు 259/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాక్ 366 రన్స్‌కు ఆలౌటైంది. లీచ్ 4, కార్స్ 3 వికెట్లు పడగొట్టారు.

అత్యంత ధనవంతుడు అజయ్ జడేజా!



న్యూఢిల్లీ: భారత్‌లో ధనవంతుడైన క్రికెటర్‌గా అజయ్ జడేజా నిలిచాడు. అతడి నికర ఆస్తుల విలువ అక్షరాల రూ. 1450 కోట్లు!! దసరానాడు అజయ్ జడేజాను గుజరాత్‌లోని జామ్‌నగర్ సంస్థానానికి వారసుడిగా ప్రకటించారు. దాంతో రూ. 1450 కోట్లు జడేజాకు వారసత్వంగా లభించనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటిదాకా రూ. వేయి కోట్ల నికర విలువతో టాప్‌లో ఉన్న విరాట్ కోహ్లీని జడేజా పక్కకు నెట్టేశాడు!

అఖిల్‌కు కాంస్యం



న్యూఢిల్లీ: సొంత గడ్డపై జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ ఫైనల్ టోర్నమెంట్‌లో భారత షూటర్ అఖిల్ షెరాన్ పతకంతో మెరిశాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్యం సాధించాడు. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో పారిస్ ఒలింపిక్స్ విజేత లూ యుకున్ (చైనా)ను అధిగమించిన అఖిల్ 452.6 స్కోరుతో మూడోస్థానంలో నిలిచాడు. హంగేరీ షూటర్ ఇస్త్‌వాన్ పెని స్వర్ణం, చెక్ రిపబ్లిక్‌కు చెందిన జిరి ప్రివ్‌రాస్కీ రజతం గెలిచారు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది రెండో పతకం. మంగళవారం మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో సోనమ్ మస్కార్ రజతం నెగ్గింది.

బతుకమ్మరోజు

ఆడబిడ్డలకు ఒక్కచీరా ఇవ్వలేదు

» కాంగ్రెస్ మార్పు అంటే ఇదేనా?: హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బతుకమ్మరోజు రెండుచీరలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆడబిడ్డలకు ఒక్క చీరకూడా ఇవ్వలేదు. దసరా పండుగకు రాష్ట్రంలోని అక్కా చెల్లెళ్లను ప్రభుత్వం నిరాశపరిచింది" అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ తెస్తానన్న మార్పు ఇదేనా? ఉన్న పథకాలు బంద్ పెట్టడమేనా..? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే రైతుబంధు రూ.15వేలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ వానాకాలం పంటకు ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ముదిరాజ్‌లు, గంగపుత్రుల ఉపాధి దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్చడంతో ప్రజలపై రూ.20వేల కోట్ల భారం పడనుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన అనుచరులు, ముఖ్యుల స్వార్థ ప్రయోజనాల కోసమే ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు.

కుల గణన ఆధారంగా స్థానిక రిజర్వేషన్లు ఇవ్వాలి: కోదండరాం

రాష్ట్రంలో కుల గణన పారదర్శకంగా జరగాలని, దాని ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఎమ్మెల్సీ కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పచ్చ జెండా ఊపిన ప్రాజెక్టులు, పథకాలను ఇప్పుడు ఆ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. మూసీ ప్రక్షాళన అవసరమని.. నదులు, చెరువుల పునరుద్ధరణ వల్ల కలిగే ప్రయోజనాలు అందరికీ దక్కాలన్నారు.

యూట్యూబ్ చానళ్లకు కేటీఆర్ పైసలు: షబ్బీర్ అలీ

కొన్ని యూట్యూబ్ చానళ్లకు కేటీఆర్ పైసలు వెదజల్లి హైడ్రా, మూసీ ప్రక్షాళనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆరోపించారు. ఎంఐఎం పార్టీకి మోదీ మద్దతు ఉందని, అందుకే ఔరంగాబాద్‌లో ఆ పార్టీ నేత ర్యాలీకి రెడ్ కార్పెట్ పరిచారని అన్నారు. గురుకులాల భవనాలకు తాళాలు వేయడం రాజ్యాంగ విరుద్ధమని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులలో బీఆర్ఎస్‌లో ప్రతిపక్ష నేత ఎవరని ప్రశ్నించారు.

హాస్టల్ భవనాలకు అద్దె ఇవ్వకపోవడమా:ఈటల

న్యూఢిల్లీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ భవనాలకు అద్దె కూడా చెల్లించకపోవడం సిగ్గుచేటని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో వంట సామగ్రి సరఫరా చెయ్యడం లేదని, డైట్ చార్జీలు కూడా ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆరోపించారు. కొత్తవి పెట్టకపోయినా పర్వాలేదని కానీ ఉన్న గురుకులాలను మూసివేయవద్దని కోరారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి డాంబికాలు బంజేసి పేద విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. కాగా, ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈటల రాజేందర్ కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిశారు.

నాబార్డ్ 'దక్కన్ హాత్' ఎగ్జిబిషన్ షురూ

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత హస్తకళాకారులు, చేనేత వస్త్రాల తయారీదారులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'దక్కన్ హాత్' ఎగ్జిబిషన్‌ను నాబార్డ్ అధికారులు బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. తెలంగాణ చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ప్రదర్శనను ప్రారంభిస్తూ.. గ్రామీణ కళాకారులు, చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు నాబార్డ్ ఏటా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తుండటం గొప్ప విషయమన్నారు. ఇలాంటి ప్రదర్శనలతో ప్రజలకు ఎలాంటి ఉత్పత్తులు అవసరమో చేతివృత్తికళాకారులకు తెలిసే అవకాశం ఉంటుందని చెప్పారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. గత నాలుగు దశాబ్దాలుగా తాము గ్రామీణ హస్త కళాకారులకు ప్రోత్సాహమందిస్తున్నామన్నారు.

సర్కారు నిర్లక్ష్యం.. పత్తిరైతుకు నష్టం: నిరంజన్‌రెడ్డి

సకాలంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తోందని.. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. దళారులకు మేలు చేసేందుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలేదని, పత్తిని ఎక్కువరోజులు నిల్వ ఉంచుకోలేనిస్థితిలో రైతులు తక్కువధరకు అమ్ముకో వాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మైనారిటీల్లోని ఉపకులాలను పరిగణనలోకి తీసుకోవాలి

» బీసీ కమిషన్ చైర్మన్‌కు మజ్లిస్ ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్‌ల విస్తరణ కోసం తలపెట్టిన కులగణన సర్వేలో బీసీ 'ఈ' గ్రూపుగా గుర్తించిన మైనారిటీ విభాగంలోని 14 ఉప కులాలనుపరిగణనలోకి తీసుకోవాలని మజ్లిస్ పార్టీ బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంటింటి కులాల వారీ సర్వేలో ముస్లింలలోని అత్యంత వెనుకబడిన అచ్చుకట్ల, సింగాలి, అత్తర్ సాయబులు, దోబీ ముస్లిం, ఫకీర్, గారడి ముస్లిం, ఖురేషీ షేక్, తురక, కాశా వర్గంలోని ఉప కులాలను కూడా లెక్కించాలని కోరింది. ఈ మేరకు అక్బరుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ బృందం బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌కు వినతి పత్రం సమర్పించింది. అక్టోబరు 24 నుంచి బీసీ కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి ఈ విషయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని నిర్ణయించింది. కుల గణన సర్వే ఆధారంగా స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు కేటాయించాల్సిన రిజర్వేషన్ శాతాన్ని ఖరారు చేయనున్నందున ముస్లిం మైనారిటీ వర్గాల్లోని నిరుపేద వర్గాలను పరిగణనలోకి తీసుకోవాలని మజ్లిస్ ఎమ్మెల్యేలు కోరారు. బీసీ 'ఈ' గ్రూపులోని మైనారిటీ వర్గం కులాలను కూడా సర్వేలో చేర్చాలని నిర్ణయం తీసుకున్నట్టు బీసీ కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి.

ఎల్వీపీఈఐలో 37 ఏళ్లలో 50 వేల కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్వీపీఈఐ) 37 ఏళ్లలో 50 వేల కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు చేసి అరుదైన రికార్డును సృష్టించింది. ఎల్వీపీఈఐలో కార్నియా సంరక్షణకు అత్యుత్తమ కేంద్ర మైన శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ ఈ ఘనతను సాధించింది. 50 వేల కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఎల్వీపీఈఐలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వీడియో కాల్ ద్వారా వైద్యులు, సంస్థను అభినందించారు. ఎల్వీపీఈఐ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు ఈ మైలురాయిని చేరుకోవడం గురించి వివరించారు. దేశంలోని వయోజన జనాభాలో దాదాపు 2 శాతం అంధులు, దాదాపు 13 శాతం దృష్టిలోపంతో బాధపడుతున్నట్లు తెలిపారు. దేశంలో 50 ఏళ్ల, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో అంధత్వానికి కార్నియా రెండో కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ భారతదేశంలో నేత్రనిధి ప్రస్తుత స్థితి గురించి మాట్లాడారు. నేత్ర ఆరోగ్య పిరమిడ్ నమూనా ద్వారా సంస్థ ఇప్పటివరకూ 3.89 కోట్లకు పైగా ప్రజలకు సేవలు అందించింది. శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.ప్రవీణ్ కృష్ణ.. మారుతున్న సాంకేతికతలతో కార్నియా మార్పిడిలో భవిష్యత్తు అవకాశాల గురించి వివరించారు.

చంద్రబాబు రక్షణకు సీఆర్‌పీఎఫ్

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రక్షణ బాధ్యతలు ఇకపై సీఆర్‌పీఎఫ్ చూసుకుంటుంది. తిరుపతిలోని అలిపిరిలో చంద్రబాబుపై నక్సల్ దాడి (2003 అక్టోబరు) జరిగినప్పటి నుంచి, గత 21సంవత్సరాలుగా ఆయనకు రక్షణగా ఉన్న ఎన్ఎస్‌జీ....ఇక ఉగ్రవాద చర్యల నిరోధానికే పరిమితం కానుంది. అందువల్ల దాని స్థానంలో సీఆర్పీఎఫ్‌కు కొత్త బాధ్యతలు ఇవ్వాలని కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎన్ఎస్‌జీ బలగాలతో జడ్ ప్లస్ భద్రతను కల్పిస్తున్నారు. అలాగే, మరో ఎనిమిది మంది కూడా ఈ కేటగిరీలో ఉన్నారు. వీరందరినీ సీఆర్పీఎఫ్ భద్రతా వలయంలోకి తీసుకురానున్నారు.

ఇక సిద్దిపేట 'కుంకుమ పువ్వు'!

» మందమర్రిలో డీఎక్స్ఎన్ కంపెనీ సాగు
» 40 వేల మొక్కలతో గదిలో పైలట్ ప్రాజెక్టు
» 4 నెలల్లోనే 600 గ్రాముల దిగుబడి..

సిద్దిపేట టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లాంటి చల్లని వాతావరణంలో మాత్రమే సాగయ్యే కుంకుమ పువ్వు పంటను డీఎక్స్ఎన్ కంపెనీ ఏరోపోనిక్స్ టెక్నాలజీ సాయంతో సిద్దిపేటలో సాగు చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. పంట సాగును ప్రారంభించిన నాలుగు నెలల్లోనే 600 గ్రాముల దిగుబడిని రాబట్టింది. త్వరలోనే ఇది సిద్దిపేట కుంకుమ పువ్వుగా మార్కెట్‌లో అందుబాటులోకి రానుంది. మాజీ మంత్రి హరీశ్ రావు సూచన మేరకు 2019లో డీఎక్స్ఎన్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.లిమ్ సియోవ్ జిన్ సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి శివారులో 50 ఎకరాల్లో కంపెనీని స్థాపించారు. ఇక్కడ పలు వ్యవసాయ ప్రాజెక్టులు నడుస్తుండగా.. 20 రకాల ఆహార పదార్థాలు ఉత్పత్తవుతున్నాయి. 500 మందికి పైగా ఉపాధి లభిస్తోంది. ఈ నేపథ్యంలోనే సియోవ్ జిన్ కశ్మీర్ నుంచి కుంకుమపువ్వు విత్తనాలను తెచ్చి 40 వేల మొక్కలతో పైలట్ ప్రాజెక్టు కింద సాగు మొదలుపెట్టారు. ఇందుకోసం కంపెనీలోని ఐడబ్ల్యూహెచ్ బ్లాకులో ఏరోపోనిక్స్ సాయంతో ఓ గదిని ఏర్పాటు చేశారు. దానిలో కుంకుమపువ్వు సాగుకు అవసరమయ్యే చల్లని ఉష్ణోగ్రత ఉండేలా ఏసీలను అమర్చారు. ఆ గదిలో ట్రేలలో విత్తనాలను ఉంచి ఎలాంటి మట్టి, నీరు అందించకుండా సంరక్షించారు. దీంతో సాధారణంగా ఎకరా స్థలంలో రావాల్సిన 600 గ్రాముల కుంకుమ పువ్వు.. గది విస్తీర్ణంలోనే సాగు అయ్యింది.



మొక్కలను చూపిస్తున్న డీఎక్స్ఎన్ కంపెనీ ప్రతినిధులు

తెలంగాణలోనే అతి పెద్దది..


కుంకుమ పువ్వు పెంపకం ప్రాజెక్టు తెలంగాణలోనే అతి పెద్దది. ఇది కంపెనీ చైర్మన్ కల.. ఆయన సూచనలతోనే మేం సాధించగలిగాం. దీన్ని కంపెనీతో పాటు ఇక్కడి ప్రజల సహకారంతో సాధించిన విజయంగా భావిస్తున్నాం. తెలంగాణ భూభాగంపై డీఎక్స్ఎన్ ఒక అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు సంతోషంగా ఉంది.

– పవన్ దేశ్‌పాండే, డీఎక్స్ఎన్ ప్రాజెక్టుల కో ఆర్డినేటర్

మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థ!

10,954 రెవెన్యూ గ్రామాలకు సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు

» ఇప్పటికే ఓసారి నివేదిక ఇచ్చిన సీసీఎల్ఏ
» మరోసారి నివేదిక కోరిన రెవెన్యూ శాఖ
» సిబ్బంది ఎంపిక, హోదా, బాధ్యతలు, విధివిధానాలపై స్పష్టత ఇవ్వాలన్న సర్కారు



హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని సంకల్పించిన ప్రభుత్వం.. ఆ మేరకు కసరత్తు ముమ్మరం చేస్తోంది. దీనిపై అధ్యయనం చేయాల్సిందిగా భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు గతంలోనే సూచించింది. ఈ మేరకు అధ్యయనం చేసిన సీసీఎల్ఏ.. ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న ప్రతిపాదనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గ్రామ స్థాయి రెవెన్యూ యంత్రాంగం ఎంపికపై మరోసారి నివేదిక ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం తాజాగా సీసీఎల్ఏను కోరింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్.. సీసీఎల్ఏకు లేఖరాశారు. కాగా, సీసీఎల్ఏ తొలుత ఇచ్చిన నివేదికలో.. గతంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో, ప్రతి ఆవాసానికి ఒక వీఆర్ఏ పనిచేసేవారని, అంతా కలిపి సుమారు 25,750 మంది ఉండేవారిని తెలిపింది. వీరిలో వీఆర్వోలుగా 5,195 మంది ఉండగా.. ఎక్కువ మంది డిగ్రీ, ఇంటర్మీడియట్ అర్హతతో ఉన్నట్లు పేర్కొంది. ఇక వీఆర్ఏలు 20,555 మంది ఉండగా.. వారిలో డిగ్రీ అర్హత కలిగిన వారు 3680 మంది, ఇంటర్మీడియట్ వరకు చదివిన వారు 2761, పదో తరగతి అర్హత ఉన్నవారు 10,347 మంది ఉన్నట్లు వివరించింది. ఇకపై గ్రామస్థాయిలో నియమించే రెవెన్యూ సిబ్బందికి జేఆర్వో (జూనియర్ రెవెన్యూ అధికారి) లేదా గ్రామ రెవెన్యూ కార్యదర్శి అనే పేర్లు పెట్టాలని ప్రతిపాదించింది.

కీలకం కానున్న రెండో నివేదిక..

రాష్ట్ర వ్యాప్తంగా 10,954 రెవెన్యూ గ్రామాలకు సిబ్బందిని నియమించాల్సి ఉన్నందున.. వారిని ఎంపిక చేయాల్సిన విధానం, అర్హతలు, వేతనాల చెల్లింపులు వంటి అంశాలపై సీసీఎల్ఏ రెండోసారి ఇవ్వనున్న నివేదిక కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో అసలు ఎంత మందిని తీసుకోవాలి, పాతవారిని తీసుకుంటే ఏ ప్రాతిపదికన తీసుకోవాలనే దానిపై రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. అయితే.. గతంలో తొలగించిన వీఆర్వో, వీఆర్ఏల నుంచి సుమారు 5వేల మందిని తీసుకోవాలని, నూతనంగా మరో 5 వేల మందిని నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గతంలో పనిచేసిన వారిలో ప్రస్తుత అవసరాలకు తగిన అర్హతలు ఉన్నవారిని తిరిగి ఎంపిక చేయాలని రెవెన్యూ ఉద్యోగుల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందుతున్నాయి. ఇదిలా ఉండగా.. గ్రామస్థాయిలో పనిచేసే రెవెన్యూ ఉద్యోగులకు వివిధ రకాల ధ్రువపత్రాల జారీ, ప్రభుత్వ భూముల సంరక్షణ బాధ్యతలు, చెరువులు, కుంటల సంరక్షణ, భూ సమస్యలపై క్షేత్ర స్థాయి విచారణలు, సర్వే పనులకు సహాయకులుగా, విపత్తుల సమయంలో సేవలందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడం, ఎన్నికల విధులు, అభివృద్ధి కార్యక్రమాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవడం వంటి విధులు నిర్వహించే బాధ్యతలు అప్పగించాలిన తొలుత ఇచ్చిన నివేదికలో సీసీఎల్ఏ ప్రతిపాదించింది.

గుజరాత్ తరహాలో భూ ఆక్రమణల నిరోధక చట్టం

» ఆక్రమణదారులపై కఠిన చర్యల కోసం కొత్త చట్టం తెచ్చేందుకు సర్కారు దృష్టి

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైడ్రా దూకుడుతో భూ ఆక్రమణదారుల్లో అలజడి మొదలైంది. అయితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు భూ ఆక్రమణల నిరోధక చట్టం అమల్లో లేకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆ చట్టాన్ని మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. గతంలో కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఆ చట్టాన్ని రాష్ట్రమంతా అమలు చేసేలా కొత్తగా తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. పాత చట్టం కింద కేసులు నమోదైనా శిక్షల పరంగా ఆశించిన ఫలితాలు రాలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాత చట్టంలోని లొసుగులను అధిగమిస్తూ కొత్త చట్టాన్ని గుజరాత్ తరహాలో తీసుకురావాలని రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. గుజరాత్‌లో చట్టం కింద కఠిన శిక్షలు పడుతున్నాయని వారు చెబుతున్నారు. భూ ఆక్రమణల నిరోధక చట్టం ద్వారా ఏర్పాటైన ప్రత్యేక కోర్టు ఉమ్మడి ఏపీలో ఉండేది. అదే చట్టం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక 2016 వరకు కొనసాగింది. అయితే కేసీఆర్ ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసింది. దీంతో భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. 'రాష్ట్రంలో కొన్నేళ్లుగా భూ ఆక్రమణల కేసులు పెరుగుతున్నాయి. వీటిపై న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. ఈ సమయంలో భూ ఆక్రమణల నిరోధక చట్టం చాలా అవసరమ'ని భూ చట్టాల నిపుణుడు సునీల్ పేర్కొన్నారు.

మా పనిలో మంత్రి జోక్యం ఏల?

» పార్టీ భవిష్యత్తు దృష్ట్యా ఓపిక పడుతున్నం
» మంత్రి కొండా సురేఖపై టీపీసీసీ చీఫ్‌కు.. వరంగల్ లోక్‌సభ పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో తాము నిర్వహించాల్సిన పనుల్లోనూ మంత్రి కొండా సురేఖ జోక్యం పెరిగిపోయిందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని ఆమెను నియంత్రించాలని కోరారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు డీసీసీ అధ్యక్షులు, ఒక ఎమ్మెల్సీ బుధవారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భగా తమ తమ నియోజకవర్గాల్లో మంత్రి కొండా సురేఖ జోక్యం ఎక్కువైందని ఆయన దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సైతం సరిగా పాటించట్లేదంటూ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అన్ని విషయాల్లోనూ మంత్రి జోక్యం చేసుకుంటూ ఇబ్బందికరమైన వాతావరణాన్ని కలిగిస్తున్నారన్నారు. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తాము ఓపిక పడుతున్నామని, ఇదే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ఇబ్బంది కలగదా అని ప్రశ్నించారు. ఈ పరిస్థితులను నియంత్రించాలని టీపీసీసీ చీఫ్‌ను వారు కోరారు. కాగా.. ఇదే అంశంపైన వారు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీనీ కలిసి ఫిర్యాదు చేశారు. అధిష్ఠానానికీ లేఖ రాశారు. కార్యకర్తల అత్యుత్సాహంతో తలెత్తిన ఈ సమస్యలను.. మాట్లాడి పరిష్కరిస్తామంటూ మహేష్ కుమార్‌గౌడ్, దీపామున్షీదాస్‌లు ఎమ్మెల్యేలు, నేతలకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. సురేఖపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల్లో నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, యశస్వినీరెడ్డి తదితరులు ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

డబ్బు వసూళ్ల కోసమే హైడ్రా

» పేదల ఇళ్లు కూల్చి.. బిల్డర్లను భయపెడుతున్నారు..
» రేవంత్‌రెడ్డిది అసమర్థ పాలన
» మూసీ సుందరీకరణ వెనుక భారీ స్కాం
» పేదలకు మద్దతుగా బీఆర్ఎస్ పర్యటనలు
» 80 వేల కోట్లు ఏమయ్యాయ్?: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్లుకూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అక్రమ నిర్మాణమైతే.. నా ఫాంహౌస్‌ను కూల్చేయండి.. ఉన్నవాళ్ల ఇళ్లను కూల్చండి.. తప్ప.. హైడ్రా పేరుతో పేదల ఇళ్లుకూల్చి వారిని రోడ్డుపాలు చేయొద్దు' అని అన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని ప్రచారం చేస్తూ.. తెలంగాణ పట్ల అందరూ నమ్మకం కోల్పోయేలా.. రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దిక్కుమాలిన పాలనవల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. లక్షన్నర కోట్లతో చేపడుతున్న మూసీ సుందరీకరణ వెనుక భారీ కుంభకోణం ఉందని, దానికోసం నిధులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. నగరంలో చాలా చోట్ల కాంగ్రెస్ హయాంలో అనుమతులిచ్చి.. ఇప్పుడు కూల్చుతున్నారని డిప్యూటీ సీఎం భట్టికి తెలియదా? అని ప్రశ్నించారు.

ఉన్నట్టుండి రేవంత్‌కు దేశరక్షణ గుర్తొచ్చింది

వికారాబాద్ జిల్లాలో రేడార్ స్టేషన్ పనులకు శంకుస్థాపన సందర్భంగా జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డిచేసిన ప్రసంగం ఆశ్చర్యం కలిగించిందని కేటీఆర్ అన్నారు. ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రేనా? లేక బీజేపీలో ఉన్నారా? అర్థం కావడంలేదన్నారు. ఉన్నట్టుండి ఆయనకు దేశరక్షణ గుర్తొచ్చిందని, గతంలో ఆయన ఆర్మీలో ఏమైనా పనిచేశారా? అంటూ ఎద్దేవా చేశారు. రేడార్ స్టేషన్‌తో స్థానికులకు ఒక్క ఉద్యోగం కూడా రాదని.. పర్యావరణానికి నష్టం కలిగించే ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడం తగదన్నారు. పర్యావరణ హితం కోసమే.. నేవీ రేడార్ స్టేషన్ ఏర్పాటుకు కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం కేటాయించలేదన్నారు. ఇదిలా ఉండగా.. కేటీఆర్ నిర్వహించిన సమావేశానికి ఇద్దరు ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు కాలేదు. మరోవైపు.. అధికారం చేపట్టిన పది నెలల్లోనే రేవంత్‌రెడ్డి.. రికార్డు స్థాయిలో రూ.80,500 కోట్ల అప్పులు చేశారని, ఆ డబ్బులను ఏంచేశారని నిలదీశారు. కొత్తగా సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు.. ఎన్నికల హామీలు తీర్చలేదు. తెచ్చిన అప్పు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి.. అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

పాత అప్పులు, వడ్డీలకే రూ.56,440 కోట్లు కట్టాం

» మేము వచ్చాక చేసిన అప్పులు రూ.49,618 కోట్లు
» కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్
» వడ్డీలు చెల్లించేందుకే కొత్త అప్పులు
» ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన మిమ్మల్ని దేంతో కొట్టాలి: మంత్రి సీతక్క





హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించి వడ్డీలు/అసలుకే ఇప్పటిదాకా రూ.56,440కోట్లు కట్టామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రూ.80 వేల కోట్లకు పైగా అప్పులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం... ఒక్క ప్రాజెక్టు అయినా కట్టిందా...? డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? అని 'ఎక్స్' వేదికగా కేటీఆర్ అడిగిన ప్రశ్నకు భట్టి కౌంటర్ ఇచ్చారు. 2023 డిసెంబరు నుంచి ఈనెల 15వ తేదీ దాకా రూ.49,618 కోట్ల అప్పులు చేశామని, ఇందులో మూలధన వ్యయం కింద రూ.21,881 కోట్లు వెచ్చించామని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక అమలు చేసిన రైతు రుణమాఫీ, రైతు భరోసా, చేయూత, ఎల్పీజీ సబ్సిడీ, మహాలక్ష్మి, గృహజ్యోతి(200 యూనిట్ల దాకా ఉచిత కరెంట్), విద్యుత్ సబ్సిడీ, రైస్ సబ్సిడీ, ఉపకార వేతనాలు, ఆర్టీసీతో పాటు కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ వంటి పథకాలకు రూ.54,346 కోట్లు వెచ్చించామని వెల్లడించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని కౌంటర్ ఇచ్చారు. తొమ్మిదన్నరేళ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పులకు.. వడ్డీలు కట్టడం కోసమే కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని మంత్రి సీతక్క తెలిపారు. కేటీఆర్ పోస్టుపై 'ఎక్స్' వేదికగానే ఆమె ఘాటుగా స్పందించారు. "అప్పుల వారసత్వానికి ఆద్యులు మీరే. ప్రతినెలా సగటున రూ.6వేలకోట్ల ప్రజాధనాన్ని మీ అప్పుల కుప్పను కడిగేందుకే సరిపోతోంది. అప్పుల అప్పారావులా అందిన కాడల్లా అప్పు చేసి.. రాష్ట్రాన్ని తిప్పలు పెట్టి, వడ్డీలతో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన విమ్మల్ని దేంతో కొట్టాలి" అని ప్రశ్నించారు. అది చాలదన్నట్టు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలు మోపారని, చేసిన పనులకు బిల్లులూ చెల్లించలేదని మండిపడ్డారు. ప్రతి శాఖలో వందల కోట్లు బకాయిలు పెట్టి.. ఇప్పుడు బుకాయిస్తే ఎలా? అని నిలదీశారు. అప్పులు, బకాయిలు, హామీల విషయమై కేటీఆర్ నీతులు చెప్పడం.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని విమర్శించారు.



కిడ్నీల మార్పిడి నిర్వహించిన నిమ్స్ యూరాలజీ వైద్య బృందం

పదేళ్లలో వెయ్యి మందికి కిడ్నీల మార్పిడి

» నిమ్స్ అరుదైన రికార్డు
» ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 101 కిడ్నీల మార్పిడి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. దశాబ్దకాలంలో 1,000 మందికి మూత్ర పిండాల మార్పిడి శస్త్రచికిత్సలు చేసిన ఘనతను సాధించింది. కొవిడ్ తీవ్రత కారణంగా 2020 ఏడాదిని మినహాయించి.. వరుసగా పదేళ్లలో ఏటా 100కుపైగా కిడ్నీల మార్పిడి చేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. 1989లో నిమ్స్‌లో కిడ్నీల మార్పిడి ప్రారంభించారు. అప్పటి నుంచి 2014 వరకు 730 మందికి కిడ్నీల మార్పిడి శస్త్రచికిత్సలు చేయగా.. 2015 నుంచి 2024 వరకు వెయ్యి మందికి మూత్రపిండాల మార్పిడి చేశారు. జీవన్‌దాన్ కెడవర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కార్యక్రమం ప్రవేశపెట్టడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లలో వేగం గణనీయంగా పెరిగింది. 2015 ప్రారంభం నుంచి యూరాలజిస్టుల బృందం పిల్లలు, పెద్దలకు కలిపి వెయ్యి కిడ్నీల మార్పిడిని పూర్తి చేసింది. ఈ ఏడాదిలో వైద్య బృందం ఇప్పటి వరకు 101 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లను నిర్వహించింది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులలో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వ్యయం అయ్యే శస్త్రచికిత్స పూర్తిగా ఉచితంగా అందించారు. తెలంగాణ ప్రభుత్వ నిధులు, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య పథకం కింద కూడా ఉచితంగా కిడ్నీ మార్పిడిలకు అవకాశం కల్పిస్తున్నారు. మూత్ర పిండాల మార్పిడిలే కాకుండా మూత్ర పిండాల్లో రాళ్లు, ప్రొస్టేట్ సమస్యలు, క్యాన్సర్, పునర్నిర్మాణ యూరాలజీ, రోబోటిక్ పద్ధతులు, పీడియాట్రిక్ యూరాలజీకి సంబంధించిన శస్త్రచికిత్సలతో సహా ప్రతి నెలా 900 నుంచి 1000 ఇతర యూరాలాజికల్ వైద్య ప్రక్రియలను నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన శస్త్రచికిత్సలను నిర్వహిస్తూనే.. ఒకే రోజులో రెండు లేదా అంతకంటే ఎక్కువ కిడ్నీ మార్పిడిలను చేసినట్లు హెచ్‌వోడీ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఈ మార్పిడిల్లో డాక్టర్ రాహుల్ దేవరాజ్ నేతృత్వంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రామచంద్రయ్య, డాక్టర్ రఘువీర్, డాక్టర్ చరణ్ కుమార్, డాక్టర్ ధీరజ్, డాక్టర్లతో కూడిన యూరాలజిస్టుల బృందం శస్త్రచికిత్సలు నిర్వహించింది. నెఫ్రాలజీ బృందంలో ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్, ప్రొఫెసర్ డాక్టర్ భూషణ్ రాజు, ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత కీలకంగా వ్యవహరించారు. నిమ్స్ దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న యూరాలజీ యూనిట్లలో ఒకటిగా నిలిచిందని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి తెలిపారు.

తల్లిపై కన్నేసి కుమార్తెను చంపేసి..

» ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని ఎత్తుకెళ్లి చంపిన దుండగుడు
» పాప తల్లి ఫిర్యాదుతో విచారించి కేసును ఛేదించిన పోలీసులు

గాజులరామారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లిపై కన్నేసిన వ్యక్తి ఇంటి ముందు ఆడుకుంటున్న ఆమె కూతురిని తీసుకెళ్లి చంపిన కేసును పోలీసులు ఛేదించారు. సూరారం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న సూరారంలోని జీవన్ జ్యోతి నగర్‌కు చెందిన ప్రభాకర్, సుమ.. తమ పెద్ద కుమార్తె జోత్స్న (7) ఇంటి ముందు ఆడుకుంటూ తప్పి పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాలుగు టీమ్‌లుగా ఏర్పడి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి పాపను బైక్‌పై తీసుకు వెళుతున్న వ్యక్తిని గుర్తించారు. ఆ వ్యక్తిని విచారించగా నేరం అంగీకరించాడు. అదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభాకర్, సుమ ఇద్దరు కుమార్తెలతో కలిసి సూరారం వచ్చి నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన తిరుపతికి వీరితో పరిచయమైంది. అతడు తరచూ వీరి ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో అతను సుమపై కన్నేశాడు. ఆమెను వశపర్చుకోవాలని భావించి అందుకు అడ్డుగా ఉన్న ప్రభాకర్, కుమార్తెలను అడ్డు తొలగించుకుంటే సుమ ఒంటరై తనకే సొంతం అవుతుందని భావించాడు. దసరా రోజు ఇంటి ముందు ఆడుకుంటున్న జోత్స్నను బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడు. పాపను గుండ్లపోచంపల్లి, బాసరగడి శివారు ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో మెడ కోసి, ఆ తరువాత కడుపులో పొడిచి చంపాడు. తన వెంట తెచ్చుకున్న గోనె సంచిలో మృతదేహాన్ని కుక్కి చెట్ల పొదల్లో పెట్టి, పైన బండరాయి పెట్టాడు. అదే రాత్రి పాప వాళ్ల ఇంటికి వచ్చి ప్రభాకర్, సుమతో కలిసి పాపను వెతుకుతున్నట్లు నాటకమాడాడు. పాప తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించారు. అయితే సుమ భర్త ఈ మధ్యకాలంలో ప్రమాదంలో మృతిచెందగా, ప్రభాకర్‌తో సహజీవనం చేస్తూ.. బతుకుదెరువు కోసం సూరారం వచ్చిందని ఏసీపీ చెప్పారు.



ఈఆర్‌సీ భవనాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

ఐదేళ్లలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం

- భావి అవసరాలకు తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకుని వచ్చే ఐదేళ్లలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్ కల్యాణ్‌నగర్‌లో నిర్మించిన తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) కొత్త కార్యాలయం 'విద్యుత్ నియంత్రణ్ భవన్'ను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నెట్‌జీరో బిల్డింగ్‌ను నిర్మించినందుకు ఈఆర్సీ ఛైర్మన్, సభ్యులను అభినందించారు. రైతుల పంటపొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని భట్టి ప్రకటించారు. రైతులు తమ పంప్‌సెట్లకు అవసరమైన విద్యుత్‌ను వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన గ్రామాల్లో దీన్ని అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధికి దోహదపడే రంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వచ్చే పదేళ్లలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు..

'సీతారామ'లో ప్యాకేజీ-6 పనులకు టెండర్లు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్యాకేజీ-6లో రూ.315.89కోట్లతో పనులు చేపట్టడానికి వీలుగా డిస్ట్రిబ్యూటరీ పనులకు ప్రభుత్వం బుధవారం టెండర్లు పిలిచింది. డిస్ట్రిబ్యూటరీలను 8 ప్యాకేజీలుగా విభజించి వాటి నిర్మాణానికి రూ.3,858.93 కోట్లు అవుతాయని ఇదివరకే అంచనా వేశారు. ఇప్పటికే ప్యాకేజీ -1, 2, 7, 8తో పాటు ఎస్కేప్ కమ్ క్రాస్ రెగ్యులేటరీ కోసం టెండర్లు పిలవగా.. తాజాగా ప్యాకేజీ-6లో పనులకు టెండర్లు పిలిచారు.

ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా సుశీల్‌కుమార్

గనుల శాఖ సంచాలకుడిగా ఉంటూ ఆగస్టులో పదవీ విరమణ చేసిన సుశీల్‌కుమార్‌ను తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా(ఎండీ) ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.

410 మంది పోలీసులకు పతకాలు

హైదరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. సీనియర్ ఐపీఎస్‌ల నుంచి హోంగార్డు స్థాయి సిబ్బంది వరకు రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 410 మందికి ఉత్కృష్ట, అతి-ఉత్కృష్ట సేవా పతకాలు ప్రకటించింది. అదనపు డీజీపీలు మహేష్ భగవత్, వీవీ శ్రీనివాస్ రావు, స్వాతి లక్రాతోపాటు హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీ పి. విశ్వప్రసాద్, ఐజీ వి. సత్యనారాయణ, డీజీపీలో డీఎస్పీగా కొనసాగుతున్న ఉదయ్ భాస్కర్ సహా రాష్ట్రవ్యాప్తంగా 202 మందికి అతి-ఉత్కృష్ట సేవా పతకం-2024 లభించింది. డీఐజీలు తఫ్సీర్ ఇక్బాల్, డా. గజరాజ్ భూపాల్, డీసీపీ కోటిరెడ్డి సహా 208 మందికి ఉత్కృష్ట సేవా పతకం-2024 ప్రకటించింది. పతకాలు సాధించిన వారందరికీ డీజీపీ డా. జితేందర్ అభినందనలు తెలిపారు.

వేద విద్వన్మణి త్రిగుళ్ల ప్రభాకర శర్మ కన్నుమూత



హైదరాబాద్, అక్టోబరు 16: సిద్దిపేట జిల్లా త్రిగుళ్ల గ్రామానికి చెందిన వేద విద్వన్మణి, బ్రహ్మశ్రీ త్రిగుళ్ల ప్రభాకర శర్మ (84) కన్నుమూశారు. గుండె సంబంధ వ్యాధితో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వందలాది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రభాకర శర్మ.. సనాతన వైదిక కార్యక్రమాల్లోనూ నిష్ణాతులు. తండ్రి రాజమౌళి శర్మ వద్ద సనాతన వైదిక ప్రతిష్ఠ కార్యక్రమాలను అభ్యసించడమేగాక తెలంగాణలో వందకు పైగా ఆలయాల్లో ప్రతిష్ఠలు చేసి, ధర్మవ్యాప్తికి దోహదపడ్డారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తరాల ద్వారా వచ్చే అనేక ధర్మ సందేహాలకు శాస్త్ర ఆధారమైన సమాధానాలు ఇచ్చేవారు. శర్మకు భార్య, కుమార్తె, నలుగురు కుమారులు ఉన్నారు.

ఓటుకు నోటు కేసు విచారణ వచ్చే నెలకు వాయిదా

హైదరాబాద్, మంగళ్‌హాట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాంపల్లి ఈడీ కోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడింది. బుధవారం ఈ కేసు విచారణ జరగాల్సి ఉండగా న్యాయమూర్తి సెలవుపై వెళ్లడంతో కేసు విచారణ వాయిదా పడింది. బుధవారం నాటి విచారణకు సీఎం రేవంత్ రెడ్డి సహా ఈ కేసులో నిందితులుగా ఉన్నవారంతా హాజరు కావాల్సి ఉంది. కానీ న్యాయమూర్తి సెలవుపై వెళ్లడంతో కేసు తదుపరి విచారణ నవంబరు 14కు వాయిదా వేశారు. కాగా ఈ కేసులో నిందితులుగా ఉన్న సెబాస్టియన్, సండ్ర వెంకట వీరయ్య, జెరూసలెం మత్తయ్య కోర్టుకు హాజరయ్యారు.

భుజంగరావు మధ్యంతర బెయిల్ పొడిగింపు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను న్యాయస్థానం మరోసారి పొడిగించింది. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న భుజంగరావుకు వైద్యులు రెండు స్టెంట్లు వేశారు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్నందున మధ్యంతర బెయిల్ గడువు పెంచాలని ఆయన నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెగ్యులర్ బెయిల్‌పై కోర్టు నిర్ణయం వెలువడే వరకు మధ్యంతర బెయిల్ గడువు పొడిగించారు. అయితే రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడంతో మధ్యంతర బెయిల్‌ను నవంబరు 10 వరకు పొడిగించారు.

తాత్కాలిక డీజీపీలా?

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపిస్తూ.. ప్రకాశ్‌సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుకు సంబంధించి 2006లో దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తూ ఎనిమిది రాష్ట్రాలు అడ్‌హాక్ డీజీపీలను నియమించాయని తెలిపారు. నిబంధనల ప్రకారం.. డీజీపీ పోస్టు ఖాళీ అవడానికి మూడు నెలల ముందే యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన ఉండే కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సీనియారిటీ ప్రకారం పేర్లను పంపించాలన్నారు. కనీసం ఆరు నెలల సర్వీసు ఉన్న డీజీ ర్యాంకు అధికారులందరి జాబితాను పంపాలని, మెరిట్, సీనియారిటీ ఆధారంగా ముగ్గురు పేర్లను కమిటీ ఖరారు చేస్తుందని పేర్కొన్నారు. ఆ ముగ్గురిలో ఒకరిని డీజీపీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ, ప్రస్తుతం ఎనిమిది రాష్ట్రాల్లో తాత్కాలిక డీజీపీలు మాత్రమే ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్ర సీనియారిటీ జాబితాలో 19వ స్థానంలో ఉన్న ప్రశాంత్‌కుమార్‌ను తాత్కాలిక డీజీపీగా నియమించారని తెలిపారు. దీంతో ఎనిమిది రాష్ట్రాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతోపాటు తాత్కాలిక డీజీపీలు తదుపరి విచారణ తేదీ (ఈ నెల 21)లోపు తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

దీపావళిలోపు 4లక్షల మందికి రుణమాఫీ

- రూ.2లక్షల రుణాలున్న రైతులకూ లబ్ధి
- పంట కాలానికి 7,500 'రైతు భరోసా'
- ఈ ఏడాది నుంచే పంట బీమా: తుమ్మల

నల్లగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రూ. 2 లక్షల రుణాలున్న నాలుగు లక్షల మంది రైతులకు దీపావళి లోపు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. బుధవారం నల్లగొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌తో కలిసి తుమ్మల పర్యటించారు. నల్లగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రూ. 36 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిడమనూరు, హాలియా మార్కెట్ కమిటీ పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నామని తుమ్మల చెప్పారు. 22 లక్షల రేషన్ కార్డులున్న రైతులకు ఇది వరకే రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశామని, కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు ఈ నెలాఖరుకు వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేస్తామని తెలిపారు. రూ.2లక్షల పైన రుణాలున్న రైతులకు కూడా రుణాలు మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారు. ఈ పంట కాలంలోనే రూ.31వేల కోట్ల రుణమాఫీని చేసి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. దీంతోపాటు పంట కాలానికి రూ.7,500 రైతు భరోసా' ఇచ్చేందుకు నిర్ణయించామని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా రైతు భరోసా ఇస్తామని వెల్లడించారు. పంటలబీమా పథకాన్ని కొనసాగిస్తామని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తుమ్మల ప్రకటించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై చర్చించాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదా..? అని నిలదీశారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



నల్లగొండలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

ఎక్కడి వారు అక్కడికి వెళ్లాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఇవ్వాలా? అని ప్రశ్నించింది. వాణీప్రసాద్, వాకాటి కరుణ, ఆమ్రపాలి కాట, రొనాల్డ్ రోస్ (తెలంగాణ), జి.సృజన, లోతేటి శివశంకర్, సి.హరికిరణ్ (ఏపీ) ఎవరి రాష్ట్రాల్లో వారు రిపోర్ట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. క్యాట్‌లో నవంబరు 4న విచారణ ఉన్న నేపథ్యంలో అప్పటివరకైనా రిలీవ్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న విజ్ఞప్తిని సైతం ధర్మాసనం తోసిపుచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు విద్యాసాగర్, వి.మల్లిక్, కేఆర్‌కేవీ ప్రసాద్, లక్ష్మీనర్సింహ తదితరులు వాదనలు వినిపించారు. పిటిషనర్ల వాదనలను వ్యక్తిగతంగా విని స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వాలని ఇదే ధర్మాసనం డీవోపీటీకి ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. పిటిషనర్లకు ఆ అవకాశం ఇవ్వకుండా, ఏకసభ్య కమిటీ రిపోర్ట్ అందజేయకుండా, ఏకపక్షంగా డీవోపీటీ ఈ నెల 16న వారివారి రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. సోమేశ్‌కుమార్ తీర్పునకు పిటిషనర్ల కేసులకు సంబంధం లేదన్నారు. ఆయా అధికారుల సేవలు తామే వినియోగించుకుంటామని.. వారిని రిలీవ్ చేయడానికి 15 రోజుల సమయం కావాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఇచ్చిన లేఖలను ధర్మాసనానికి సమర్పించారు. డీవోపీటీ ఉత్తర్వులపై క్యాట్ స్టే ఇవ్వకుండా నవంబరు 4కు వాయిదా వేసిందని..అప్పటివరకైనా రిలీవ్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో క్యాట్ ఉత్తర్వులపై స్టే ఇచ్చి హైకోర్టే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. ఏకసభ్య కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌ను మూడు నెలలపాటు పెండింగ్‌లో ఉంచి ప్రస్తుతం ఆకస్మికంగా డీవోపీటీ నిర్ణయం తీసుకోవడంలో అర్థం లేదని తెలిపారు. డీవోపీటీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగులను కేటాయించే పని కోర్టుది కాదని, కేంద్రం నిర్ణయమే అంతిమమని పేర్కొంటున్న సోమేశ్‌కుమార్ తీర్పు దీనికి ఆధారంగా ఉందని గుర్తుచేశారు. ముందు పిటిషనర్లు ఎక్కడివారు అక్కడ రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన లేఖలపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుందన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. "ముందు ఎక్కడివారు అక్కడికి వెళ్లి రిపోర్ట్ చేయండి. ఆ తర్వాత పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం. ఇప్పుడు పనిచేస్తున్న రాష్ట్రాల్లోనే అధికారులను ఉంచాలని.. రిలీవింగ్‌కు కొంత సమయం ఇవ్వాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కేంద్రానికి లేఖలు ఇచ్చాయి. వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు ఇస్తాం. ఆ తర్వాతైనా పరస్పర డిప్యుటేషన్ కోరుకోవచ్చు. స్టే ఇచ్చుకుంటూ పోతే ఈ వివాదానికి అంతు ఉండదు. ఇప్పుడు క్యాట్ స్టే ఇవ్వలేదని హైకోర్టుకు వచ్చారు. ఆ తర్వాత క్యాట్ ఇచ్చే తుది తీర్పుపై మళ్లీ వస్తారు. ఇలా పొడిగించుకుంటూ పోతే ఎలా? సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలకు సైతం విలువ ఉండాలి. వాటిని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశిస్తాం. ఐఏఎస్‌లు అయినంత మాత్రాన.. అడిగిన వెంటనే స్టే ఇవ్వాలా? ఐఏఎస్‌లైనా, ప్రభుత్వ ఉద్యోగులనైనా కోర్టులు కేటాయించలేవు. అక్రమంగా, అన్యాయంగా కేటాయింపులు చేసినప్పుడు మాత్రమే జోక్యం చేసుకోగలం. ఐఏఎస్ పోస్టులు కేంద్రం పరిధిలో ఉంటాయి. చట్టప్రకారం కేంద్రమే కేటాయింపులు చేపడుతుంది. ప్రతిసారి జోక్యం చేసుకుంటే పరిపాలనకు ఇబ్బందులు కలుగుతాయి. మీరున్నది ప్రజల కోసం. వారికి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. మీరు పెద్ద అధికారులని అడిగినప్పుడల్లా స్టే ఇవ్వలేం. ఏపీ అయితే ఏంటి? తెలంగాణ అయితే ఏంటి? ఎక్కడైనా పని చేయవచ్చు" అని వ్యాఖ్యానించింది. అధికారులు ఎక్కడివారు అక్కడ రిపోర్ట్ చేస్తే పిటిషన్లు పెండింగ్‌లో ఉంచడానికి ధర్మాసనం మొగ్గుచూపింది. పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వుల కోసం పట్టుబట్టడంతో వాదనలను రికార్డు చేసిన ధర్మాసనం.. పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. కేంద్రం చేసిన కేటాయింపుల్లో జోక్యం చేసుకోలేమని, అనవసర జోక్యం వల్ల పరిపాలనకు ఇబ్బందులు వస్తాయని తీర్పులో స్పష్టంచేసింది.



ఐదుగురు ఐఏఎస్‌లు ఏపీకి!

తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ సీఎస్ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఉన్న ఐఏఎస్ అధికారులకు దారులన్నీ మూసుకుపోయాయి. ఎవరికి కేటాయించిన రాష్ట్రాల్లో వారు రిపోర్ట్ చేయాల్సిందేనని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఆదేశించడం.. హైకోర్టు కూడా అదే చెప్పడంతో తెలంగాణలోనే కొనసాగాలని శతవిధాలా ప్రయత్నించిన ఐఏఎస్‌లకు చుక్కెదురైంది. దీంతో ఐఏఎస్‌లు ఆంధ్రప్రదేశ్‌కు వెళుతున్నారు. డీవోపీటీ ఆదేశాలకు అనుగుణంగా వీరిని రిలీవ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఏపీలో పనిచేస్తూ తెలంగాణకు కేటాయించిన ముగ్గురు ఐఏఎస్‌ల్లో లోతేటి శివశంకర్, గుమ్మళ్ల సృజన బుధవారం సీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఏపీకి చెందిన మరో ఐఏఎస్ సి.హరికిరణ్ గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. తెలంగాణ యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి ఎ.వాణీప్రసాద్, స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంధన శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న రోనాల్డ్ రోస్, స్త్రీశిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని విధుల నుంచి రిలీవ్ చేస్తూ బుధవారం రాత్రి సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇలంబరిది

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇలంబరిదికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ప్రస్తుతం రవాణా శాఖ కమిషనర్‌గా పనిచేస్తుండగా.. గ్రేటర్ బాధ్యతలు అదనంగా కట్టబెట్టారు. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియాకు ఇంధన శాఖ కార్యదర్శిగా, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న క్రిస్టినా జడ్ చోంగ్తుకు ఆయుష్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్న ఎన్.శ్రీధర్‌కు యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి, ఆర్కియాలజీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న టీకే శ్రీదేవికి మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిగా, వైద్యఆరోగ్యశాఖ సంచాలకుడిగా పనిచేస్తున్న ఆర్.వి.కర్ణన్‌కు ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ జీవో జారీ చేశారు.

ఆయనతో పాటే ఆమె..

ఐఏఎస్ రోనాల్డ్‌రోస్ ఏపీకి వెళ్తుండడంతో ఆయన సతీమణి, ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారిణి విశాలాచ్చిని ఆరోగ్యశ్రీ సీఈవో బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించింది. ఆమె డిప్యుటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్నారు.

ఐపీఎస్‌లపై నేడో, రేపో ఉత్తర్వులు!

ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించిన ఐపీఎస్‌ల విషయంలో ఒకట్రెండు రోజుల్లో కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు వెలువడనున్నాయి. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్త్ తెలంగాణలోనే కొనసాగుతున్నారు. ఐపీఎస్‌లు ఏపీలో రిపోర్ట్ చేయాలని గత వారమే డీవోపీటీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే, అవి డీవోపీటీ నుంచి నేరుగా కేంద్ర హోం శాఖకు వెళ్లాయి. అక్కడ పరిశీలన పూర్తి కావడంతో ఒకటి, రెండు రోజుల్లో రిలీవింగ్ ఉత్తర్వులు సీఎస్‌కు అందనున్నాయి.

ఐపీఎస్‌ల బదిలీలకు రంగం సిద్ధం

- 'ఫోన్ ట్యాపింగ్' దర్యాప్తు అధికారికీ స్థానచలనం..!
- కేంద్ర సర్వీసు నుంచి వచ్చిన అకున్ సబర్వాల్‌కు కీలక పోస్టు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి ఐపీఎస్‌ల బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. పోలీసు శాఖలో అత్యంత కీలకమైన సైబరాబాద్ సీపీకి స్థానచలనం కలిగే అవకాశమున్నట్లు సమాచారం. సైబరాబాద్ సీపీగా ఉన్న అవినాశ్ మహంతి కేంద్ర సర్వీస్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్న నేపథ్యంలో సర్కారు ఆయన స్థానంలో కొత్త వారికి బాధ్యతలు అప్పగించే యోచనలో ఉంది. సైబరాబాద్ సీపీ రేసులో ప్రధానంగా ఇద్దరు అధికారుల పేర్లు వినిపిస్తున్నాయి. ఇక సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరిస్తున్న అధికారిని సైతం మార్చే అవకాశమున్నట్లు తెలిసింది. ఇటీవల కాలంలో కొందరు ఐపీఎస్‌ల అవినీతి, అధికార దుర్వినియోగం పోలీసుల శాఖలో తీవ్ర దుమారం రేపింది. ఇప్పటికే వారి విషయంలో సీరియస్‌గా ఉన్న ప్రభుత్వం.. తాజా బదిలీల్లో వారిని అప్రాధాన్య పోస్టులకు మార్చనుంది. ఇప్పటివరకు డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులో కొనసాగి తిరిగొచ్చిన అకున్ సబర్వాల్‌కు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా లేదా మరో కీలక బాధ్యత అప్పగించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇద్దరు ఐపీఎస్‌లు డిప్యుటేషన్‌పై జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)కు వెళ్లేందుకు దాదాపుగా లైన్ క్లియర్ అయింది. కాగా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి ఐదుగురు ఐపీఎస్‌లు పరిశీలకులుగా వెళ్తున్నారు. వారిలో నారాయణ నాయక్, తరుణ్ జోషి, ఎల్ఎస్ చౌహాన్, చందనా దీప్తి, రోహిణి ప్రియదర్శిని ఉన్నారు.

కులగణన.. ఒకే దఫాలో

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వనున్నారు. మాస్టర్ ట్రైనింగ్ తీసుకున్నవారు ఆ తరువాత జిల్లాల్లోని సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఒక్కరోజులో పూర్తిచేయనున్నారు. క్షేత్రస్థాయిలో కులగణన ప్రారంభమయ్యాక 10-15 రోజుల్లో వివరాల సేకరణ పూర్తిచేసి.. ఆ తరువాత మరో 10-15 రోజుల్లో ఆ వివరాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తారు. ఆ వివరాలను బీసీ కమిషన్ పరిశీలించి, క్రోడీకరించి స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్‌లను సూచిస్తూ ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుంది. 60 రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించింది. కాగా, ప్రభుత్వం నిర్వహించబోయే కులగణనలో కులాలతోపాటు వృత్తులు, వారి ఆర్థిక పరిస్థితులు, వృత్తి, ఆదాయం వంటి వివరాలను ప్రశ్నావళిలో నమోదు చేయనున్నారు. ముఖ్యంగా ఆయా కుటుంబాల్లో రాజకీయ ప్రాతినిధ్యం ఏమైనా ఉందా? గతంలో ఏమైనా రాజకీయ పదవుల్లో ఉన్నారా?అనే అంశాలను సేకరించనున్నారు. ఈ వివరాలన్నింటినీ మాన్యువల్‌గా సేకరించి.. ఏరోజుకారోజు వివరాలను ఆన్‌లైన్ చేయనున్నారు. కలెక్టర్లు ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తారు.

2026 డిసెంబరుకల్లా ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయాలి

ఆ సొరంగంతో ఏటా రూ.200 కోట్ల కరెంట్ బిల్లు ఆదా.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన చెక్‌డ్యామ్‌లపై విచారణ

- అదో కుంభకోణం.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులను 2026 డిసెంబరుకల్లా పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంతో రోజుకు 4 వేల క్యూసెక్కుల నీరు గ్రావిటీ ద్వారా అందుతుందని, దీనివల్ల ఏటా రూ.200 కోట్ల కరెంట్ బిల్లులు ఆదా అవుతాయని చెప్పారు. బుధవారం జలసౌధలో దేవరకొండ, మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి కోసం ఇటీవలే అంచనాలను సవరించి, రూ.4637 కోట్లతో ప్రాజెక్టును ఆమోదించామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని వేగంగా పూర్తిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఎస్ఎల్‌బీసీ హైలెవల్ కెనాల్ లైనింగ్ పనులను రూ.440 కోట్లతో చేపడుతున్నామని, ఈ కాలువల ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా నల్లగొండ జిల్లాలో 3.41 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు 200 గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందుతుందన్నారు. నక్కలగండి ప్రాజెక్టును వేగంగా పూర్తిచేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నాయని, నిర్మాణాల్లో లోపాలపై విచారణ జరపాలని మంత్రి ఆదేశించారు. ఇదో పెద్ద కుంభకోణమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. మిర్యాలగూడ, దేవరకొండలో ప్రాజెక్టులకు భూసేకరణను వేగిరం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులను తానే పర్యవేక్షిస్తానని చెప్పారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు మరమ్మతు చేయాలన్నారు. ఈ సందర్భంగా పొగిళ్ల, కంబాలపల్లి, అంబభవాని, ఏకేబీఆర్, పెద్దగట్టు, దున్నపోతుల గండి, వీర్లపాలెం, జానంపాడు తదితర ఎత్తిపోతల పథకాలపై చర్చ జరిగింది. వీటికి తగిన డిజైన్లు ఖరారు చేయాలని మంత్రి ఆదేశించారు.



ప్రాజెక్టులపై సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బునియాదిగాని కాలువకు రూ.266 కోట్లు

మూసీ ప్రాజెక్టు పరిధిలోని బునియాదిగాని కాలువ పునరుద్ధరణ పనులకు రూ.266.65 కోట్లతో పాలనాపరమైన అనుమతి లభించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం జీవో జారీ చేశారు. యాదాద్రి జిల్లాలో మూసీ ప్రాజెక్టు కింద బునియాదిగాని కాలువతోపాటు పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డిపల్లి కాలువలు ఉన్నాయి.

'మూసీ'పై విపక్షాలది రాద్ధాంతం

- కూల్చివేతలపై లేనిపోని భయాలు సృష్టిస్తున్నారు
- టీ ఫైబర్ నెట్‌వర్క్ పూర్తికి కేంద్రం సహకరించాలి
- సెమీ కండక్టర్ మిషన్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యమివ్వాలి
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


న్యూఢిల్లీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మూసీ కూల్చివేతలపై పేదలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అధికారుల అత్యుత్సాహం వల్ల కొంతమంది పేదలకు అన్యాయం జరిగితే ప్రభుత్వంపై చెడు ప్రచారం చేస్తున్నారని, కూల్చివేతలపై ప్రజలలో ప్రతిపక్షాలు లేనిపోని భయాలు సృష్టిస్తున్నాయన్నారు. హైడ్రాతో పెద్దల ఆక్రమణలను కూలగొడితే అందరూ హర్షం వ్యక్తం చేశారని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రి శ్రీధర్‌బాబు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మూసీ కూల్చివేతలు ప్రస్తుతం నెమ్మదించినప్పటికీ కొనసాగుతాయన్నారు. కొండా సురేఖపై బీఆర్ఎస్ సోషల్ మీడియా దారుణంగా వ్యవహరించిందని, పాత ఆడియోలను వైరల్ చేయడం సరికాదని ఆయన సూచించారు. వివాదంపై కొండా సురేఖ విచారం వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.2.80 లక్షల కోట్లకు చేరుకున్నాయన్నారు. త్వరలో విద్యుత్ పాలసీలో సంస్కరణలు తీసుకొస్తామని, గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట వేస్తామని మంత్రి చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి ఇంటికి ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించేందుకు ఉద్దేశించిన టీ ఫైబర్ నెట్‌వర్క్‌ను పూర్తి చేయాలంటే కేంద్రం సహకారం అందించాలని కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విజ్ఞప్తి చేశామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రూ.1600 కోట్ల మేర నిధులు అవసరమని తక్షణమే ఆ నిధులను రాష్ట్రానికి విడుదల చేయాలని కేంద్ర మంత్రులను కోరామన్నారు. రూ.3 వేల కోట్ల రాష్ట్రప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ ద్వారా ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతాలలో ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో భాగంగా నిర్వహించిన ఐటీ మంత్రుల కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగించారు. ఇండియన్ సెమీకండక్టర్ మిషన్ కింద అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్స్, అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్ యూనిట్లను తెలంగాణలో స్థాపించాలని మంత్రి కేంద్రాన్ని అభ్యర్థించారు.

బీఆర్ఎస్ నేతల కబ్జాలను బయటపెడతాం

- మూసీ మధ్యలో ఉన్న కట్టడాలే తొలగిస్తున్నాం
- బీజేపీ, బీఆర్ఎస్ నాటకాలను ప్రజలు నమ్మరు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎక్కడెక్కడ కబ్జాలు చేశారో బయటకు తీస్తున్నామని, ఆ వివరాలన్నీ త్వరలోనే బయట పెడతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ విషయంలో ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మూసీతోపాటు చెరువులను పునరుద్ధరించి హైదరాబాద్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వారు ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. అబద్ధపు ప్రచారంతో బీఆర్ఎస్ తృప్తి చెందుతుండవచ్చని, కానీ దీర్ఘ కాలంలో ఆ పార్టీ నష్టపోతుందన్నారు. గాంధీభవన్‌లో బుధవారం హైదరాబాద్ జిల్లాలో పార్టీ బలోపేతం, జీహెచ్ఎంసీ ఎన్నికల సన్నద్ధతపైన నేతలు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వంద శాతం సీట్లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో మేము పేదల ఇళ్లు కూల్చడం లేదని, నదీ గర్భంలో ఉన్న కట్టడాలను మాత్రమే తొలగిస్తున్నామని చెప్పారు. మూసీ నది ప్రక్షాళనపై ప్రతిపక్షాల విధానమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. హైడ్రా అంశంపైనా తాజా సమీక్షలో చర్చించినట్లు తెలిపారు. కాగా, సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ నేతలకు పదవులు ఇస్తున్నామని, రానున్న రోజుల్లో అందరికీ సముచిత స్థానం దొరుకుతుందన్నారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అందరూ పార్టీ లైన్‌లోనే పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయని, ఆ పార్టీల కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ పార్టీ నేతలు విభేదాలు పక్కనబెట్టి.. కలిసి పనిచేయాలని సూచించారు.

మరో ప్రైవేటు వైద్య కళాశాలకు గ్రీన్ సిగ్నల్

» 27కు చేరిన ప్రైవేటు మెడికల్ కాలేజీలు

హైదరాబాద్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మరో కొత్త ప్రైవేట్ వైద్యవిద్య కళాశాలకు జాతీయ వైద్య కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో 150 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతులు జారీ చేసింది. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారికి సమీపంలో రంగారెడ్డి జిల్లాలో ఈ కొత్త నోవా మెడికల్ కళాశాల ఏర్పాటైంది. కొత్త కళాశాలలో మొత్తం 150 సీట్లలో 50% అంటే 75 సీట్లు కన్వీనర్ కోటా కిందకు వెళ్తాయి. రెండో రౌండ్ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత 20-25 సీట్లు ఆ కోటా ఉన్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. దాంతో ఆ 75 సీట్లు, మిగిలిన ఉన్న ఈ 20-25 సీట్లు కలుపుకొని మొత్తం 95-100 సీట్లు కన్వీనర్ కోటాలో ఉంటాయని హెల్త్ వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ఇక కొత్త కళాశాలతో కలిపి రాష్ట్రంలో ప్రైవేట్ మెడికల్ కళాశాలల సంఖ్య 27(ఇటీవల డీమ్డ్ యూనివర్సిటీగా మారిన మల్లారెడ్డి గ్రూప్‌కు చెందిన 2 కళాశాలలు కాకుండా)కు చేరింది. కాగా, కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ రెండు రౌండ్లు ముగిసిన తర్వాత కొత్త ప్రైవేట్ కళాశాలకు అనుమతులు రావడం గమనార్హం. గత బీఆర్ఎస్ సర్కారులో అప్పటి సీఎం కేసీఆర్‌కు పక్కనే ఉన్న ఓ సీనియర్ నేత, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సమీక్ష సమావేశాల్లో సీఎం రేవంత్ పక్కనే ఉండే నేత ఈ కళాశాలకు అనుమతులు రావడం వెనుక కీలక పాత్ర పోషించినట్లు వైద్యవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఏడాది కొత్తగా అనుమతులు పొందిన 8 వైద్య విద్య కళాశాలల్లో ఈనెల 21 నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ కళాశాలలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించే యోచనలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నట్లు సమాచారం.

ఈవీల బ్యాటరీలను మార్చుకోవచ్చు: కేంద్రం

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) చార్జింగ్ అయిపోయినా.. తక్కువ చార్జింగ్ ఉన్నా.. అందులోని బ్యాటరీని మార్చుకోవచ్చు. దాని స్థానంలో పూర్తి చార్జింగ్‌తో ఉన్న బ్యాటరీని చార్జింగ్ స్టేషన్లలో పొందవచ్చు. బ్యాటరీల మార్పిడి, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ కోసం తాజాగా కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను ప్రకటించింది. ఈ విధానంతో గంటల తరబడి చార్జింగ్ స్టేషన్ల వద్ద నిరీక్షించాల్సిన అవసరం లేకుండా.. చార్జింగ్ అయిపోయిన బ్యాటరీలను క్షణాల్లో పొందడానికి అవకాశం కలుగుతుంది. ఇక ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే మెట్రోపాలిటన్ నగరాల్లో కేవలం 3 రోజుల్లోనే అనుమతులివ్వాలని కేంద్రం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. మునిసిపాలిటీల్లో 7 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లో, కొండ ప్రాంతాల్లో 30 రోజుల్లో, సబ్‌స్టేషన్లు, విద్యుత్తు లైన్లు వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉంటే 90 రోజుల్లో విద్యుత్ కనెక్షన్ జారీ చేయాలని కేంద్రం విద్యుత్తు పంపిణీ సంస్థలకు స్పష్టం చేసింది. ఇక ఈవీ చార్జింగ్ కేంద్రాల్లో ఏసీ/డీసీ చార్జింగ్‌కు వసూలు చేయాల్సిన సర్వీసు చార్జీలపై గరిష్ఠ పరిమితిని కేంద్రం విధించింది. జీఎస్టీ, భూమి ధరకు సంబంధించిన చార్జీలు వీటికి అదనం కానున్నాయి. 2028 మార్చి 31 వరకు దేశవ్యాప్తంగా ఇవే సర్వీస్ చార్జీలను, టారిఫ్‌ను అమలు చేయాలని తెలిపింది.

నృసింహుడి లడ్డూ తయారీకి నాణ్యమైన నెయ్యి

» నమూనా పరీక్షల నివేదికల్లో వెల్లడి: ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యాదగిరీశుడి పుణ్యక్షేత్రంలో లడ్డూల తయారీకి నాణ్యమైన నెయ్యిని వినియోగిస్తున్నామని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్టలో తయారుచేసే లడ్డూల్లో వాడే నెయ్యి నమూనాలను గత నెల 21న హైదరాబాద్ నాచారంలోని ఆహార ప్రయోగశాలకు పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. ఈ నమూనాల ఫలితాలు ఈ నెల 7న తమకు అందాయని, లడ్డూల తయారీకి వాడే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని తేలిందని చెప్పారు. 40 ఏళ్లుగా మదర్ డెయిరీ సంస్థ సరఫరా చేస్తున్న నెయ్యినే వాడుతున్నామని చెప్పారు. ప్రస్తుత ఏడాది టెండర్‌లో భాగంగా కిలో నెయ్యికి రూ. 609 చెల్లిస్తున్నామని తెలిపారు. లడ్డూ నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, లడ్డూ నాణ్యతలో రాజీపడబోమని భాస్కర్‌రావు పేర్కొన్నారు.

గచ్చిబౌలి అత్యాచారం కేసు.. ఆటోడ్రైవర్ అరెస్టు

రాయదుర్గం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో మహిళపై అత్యాచారం జరిపిన ఆటోడ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జంగం ప్రవీణ్ అనే ఆటో డ్రైవర్‌ను బుధవారం అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచారు. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో బాధిత మహిళ గచ్చిబౌలి వెళ్లేందుకు ఆర్సీపురం సర్కిల్ వద్ద నిందితుడి ఆటో ఎక్కారు. అయితే, మార్గమధ్యలో మసీద్‌బండ సిగ్నల్స్ వద్దకు రాగానే ఆటోను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన ఆటో డ్రైవర్.. బాధితురాలిని కొట్టి అత్యాచారం చేసి పారిపోయాడు. అటుగా వెళుతున్న ఓ ర్యాపిడో డ్రైవర్ సాయంతో బాధితురాలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలు, సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా నిందితుడు జంగం ప్రవీణ్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసు విచారణలో ప్రవీణ్ నేరాన్ని అంగీకరించాడు.

బ్యాంకులను మోసగించిన కేసులో
రూ. 18.42 కోట్ల ఆస్తులు అటాచ్

» నకిలీ పత్రాలతో రుణం పొందిన శ్రీకృష్ణ స్టాకిస్ట్ అండ్ ట్రేడర్స్

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో బ్యాంకులను రూ. 528.26 కోట్ల మేర మోసం చేసిన శ్రీకృష్ణ స్టాకిస్ట్ అండ్ ట్రేడర్స్‌కు చెందిన రూ. 18.42 కోట్ల విలువైన ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అటాచ్ చేశారు. ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియన్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్‌ల నుంచి శ్రీకృష్ణ సంస్థ ప్రతినిధులు నకిలీ పత్రాలతో రుణాలు పొందారు. తిరిగి చెల్లింపుల్లో జాప్యం, రుణం తీసుకున్న అవసరాలకు కాకుండా ఇతర ఖాతాల్లోకి ఆ సొమ్మును దారి మళ్లించారు. బ్యాంకర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో సీబీఐ అధికారులు మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సీబీఐ నమోదు చేసిన కేసుల ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. శ్రీకృష్ణ సంస్థ ఎండీ తోట కన్నారావు, ఇతర డైరెక్టర్లు, ఆయా కంపెనీలకు చెందిన ఫోర్జరీ డాక్యుమెంట్లు, నకిలీ బ్యాలెన్స్ షీట్లు తయారు చేసి మోసం చేసినట్లు విచారణలో తేలింది. అసలు, వడ్డీ మొత్తం కలిపి రూ. 528.26 కోట్లు మోసం చేసినట్లు ఈడీ గుర్తించింది. కేసు విచారణలో భాగంగా గతంలో రూ. 37.38 కోట్లు విలువైన ఆస్తులు అటాచ్ చేయగా బుధవారం మరో రూ. 18.42 కోట్లు అటాచ్ చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు.



రాష్ట్ర స్థాయి మొదటి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొన్న డీజీపీ జితేందర్

సవాళ్లను ఎదుర్కొంటేనే ఉత్తమ ఫలితాలు

» సరైన జాగ్రత్తలతోనే నేరాల ఛేదన: డీజీపీ జితేందర్

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ, తప్పులు సరిదిద్దుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలని అధికారులు, సిబ్బందికి డీజీపీ జితేందర్ సూచించారు. విధి నిర్వహణలో పోలీసుల అంతిమ లక్ష్యం బాధితులకు చట్టప్రకారం న్యాయం చేయడమే కావాలని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో రాష్ట్ర స్థాయి మొదటి పోలీస్ డ్యూటీ మీట్- 2024 బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ హాజరై మాట్లాడారు. పోలీస్ డ్యూటీ మీట్‌లో పోటీతత్వం, ఉత్సాహం పెంచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుందనే నమ్మకం బాధితులకు కల్పించాలని, జాగ్రత్తలు పాటిస్తూ నేరాల ఛేదన చేయాలని ఆయన పేర్కొన్నారు. కేసుల దర్యాప్తులో అధికారులు, సిబ్బంది నైపుణ్యంతో వ్యవహరించాలని సీఐడీ చీఫ్ శిఖాగోయల్ అన్నారు. టెక్నాలజీని ఆసరాగా చేసుకుని ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా పనిచేయాలని ఆమె సూచించారు. అదనపు డీజీపీ మహేశ్ భగవత్, అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డి, అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ సహా పోలీస్ ఉన్నతాధికారులు డ్యూటీ మీట్‌లో పాల్గొన్నారు.

బకాయిలున్న మిల్లర్లకు ధాన్యం ఇవ్వబోం

» ఉపేక్షించేది లేదు.. కఠిన వైఖరి అవలంబిస్తాం

» మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో నిర్ణయం

» సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే వచ్చేది 58% బియ్యమే

» నష్ట పరిహారం చెల్లించాలని కోరిన రైస్ మిల్లర్లు



మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు

హైదరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సీజన్లుగా బియ్యం బకాయిలున్న రైస్‌మిల్లర్లకు వానాకాలం సీజన్‌లో ధాన్యం ఇవ్వకూడదని ధాన్యం సేకరణ పాలసీ- 2024పై నియమించిన మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించింది. బియ్యం బకాయిదారుల విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం మంత్రివర్గ ఉపసంఘం రెండోసారి సమావేశమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియ్యం బకాయిలున్న రైస్‌మిల్లర్లు.. వెంటనే ప్రభుత్వానికి బియ్యం అప్పగించాలని సూచించారు. ధాన్యం కేటాయించే సమయంలో రైస్‌మిల్లర్ల గత చరిత్ర, రికార్డులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రైస్‌మిల్లర్ల అభిప్రాయాలను కూడా తీసుకున్నారు. దొడ్డు ధాన్యం 100 కిలోలు మిల్లింగ్ చేస్తే... 67 కిలోల బియ్యం వస్తాయని, కానీ సన్న ధాన్యం 100 కిలోలు ఉడిస్తే... 58 కిలోల సన్నబియ్యం మాత్రమే వస్తాయని రైస్‌మిల్లర్లు వివరించారు. 9 కిలోల మేర తమకు నష్టం వాటిల్లుతున్నందున క్వింటాల్‌కు రూ.300 నష్ట పరిహారం ఇవ్వాలని రైస్‌మిల్లర్లు కోరారు. గత ప్రభుత్వ హయాం నాటి రవాణా, కస్టోడియన్, మిల్లింగ్ చార్జీల బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు. సన్న ధాన్యం మిల్లింగ్‌కు సంబంధించి మిల్లర్లు లేవనెత్తిన అంశంపై చర్చించి, నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో రైస్‌మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ధాన్యాన్ని ఎక్కడికక్కడ అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తాము ప్రయత్నిస్తున్నామని, ఇకపై అలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. బకాయిలు లేని మిల్లర్లకు ధాన్యం ఇచ్చే క్రమంలో ఎలాంటి గ్యారెంటీ తీసుకోవాలనే అంశంపైనా చర్చలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'కి మంత్రి ఉత్తమ్ తెలిపారు.

సీమపై జలఖడ్గం!

» ఏపీకి దూసుకొస్తున్న వాయుగుండం

» గుంటూరు వరకూ ప్రభావం




నెల్లూరులో భారీవర్షాలకు జలమయమైన ఓ కాలనీ

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు జిల్లాలు అతలాకుతలమవుతున్నాయి. వాయుగుండం తీరం దిశగా వస్తున్నందున 8 జిల్లాలకు ఆకస్మిక వరద హెచ్చరిక జారీచేశారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, అక్కడక్కడా కుంభవృష్టి, కడప, ప్రకాశంతోపాటు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు, చెరువులు, నదులుండే ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. నైరుతి బంగాళాఖాతంలో గల వాయుగుండం దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుల దిశగా దూసుకొస్తోంది. గంటకు 15 నుంచి 20 కి.మీ. సగటు వేగంతో పశ్చిమ వాయవ్యంగా పయనిస్తున్న వాయుగుండం బుధవారం మధ్యాహ్నానికి చెన్నైకు 280 కి.మీ. తూర్పు ఆగ్నేయంగా, నెల్లూరుకు 370 కి.మీ. ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది దాదాపు అదే వేగంతో పశ్చిమ వాయవ్యంగా పయనించి గురువారం ఉదయం పుదుచ్చేరి, నెల్లూరు మధ్య చెన్నైకు ఉత్తరాన అతి సమీపంలో తీరం దాటనుంది. వాయుగుండం ప్రభావంతోపాటు ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా ఉండడంతో సముద్రం నుంచి భారీగా తేమ మేఘాలు తీరం దిశగా వస్తుండంతో రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అనేకచోట్ల, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏర్పేడులో 97.75 మి.మీ.లు, ఓబులవారిపల్లెలో 81.25, రెడ్డిపల్లెలో 80.50 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అనేకచోట్ల భారీవర్షాలు కురవడంతో ఇప్పటికే వరద తీవ్రత పెరిగింది. దీనికి తోడు వాయుగుండం తీరం దిశగా వస్తున్న క్రమంలో బుధవారం సాయంత్రం/రాత్రి నుంచి వర్షాలు పెరిగే అవకాశం ఉండడంతో రాష్ట్రంలో 8 జి ల్లాలు, ఉత్తర తమిళనాడులో చెన్నై పరిసర జిల్లాల్లో ఆకస్మిక వరద హెచ్చరిక జారీచేశారు. గురువారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నేడు శ్రీవారిమెట్టు దారి మూసివేత

నెల్లూరు, తిరుపతి, అనంతపురం అర్బన్/పుట్టపర్తి, నంద్యాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నెల్లూరు, తిరుపతి జిల్లాలు అతలాకుతలమవుతున్నాయి. జనజీవనం స్తంభించింది. కొన్నిచోట్ల రోడ్లకు గండ్లు పడ్డాయి. నెల్లూరు నగరంలో వర్షపు నీరు బయటకు వెళ్లే వీలు లేక రోడ్లపైనే మోకాలిలోతు పారుతున్నాయి.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే 500 మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, చిల్లకూరు తదితర పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో మూడు ప్రదేశాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. అయితే, వాహనరాకపోకలకు ఇబ్బంది కలగలేదు. ముందు జాగ్రత్త చర్యగా శ్రీవారి మెట్టు నడక దారిని గురువారం మూసివేస్తున్నట్టు టీటీడీ ప్రకటించింది. తిరుమలలోని రిజర్వాయర్లలోకి కూడా వర్షపు నీరు చేరుతోంది. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల 6500 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, కూరగాయ పంటలు నీట మునిగాయి. పలు చెరువులు, రిజర్వాయర్లలోకి వరద నీరు చేరుతోంది. అలాగే పలు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాజ్‌వేలపైకి వరద నీరు చేరి ఆయాచోట్ల రాకపోకలు స్తంభించాయి. ఉదయం తిరుపతిలో దిగాల్సిన ఇండిగో విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. హైదరాబాదు నుంచి వచ్చిన స్పైస్ జెట్, ఎయిర్ ఇండియా విమానాలు రేణిగుంట విమానాశ్రయం వద్ద గాల్లోనే చక్కర్లు కొట్టి గంట ఆలస్యంగా ల్యాండ్ అయ్యాయి. ఉమ్మడి అనంతపురంలో వాగులు, వంకలు, కుంటలకు జలకళవచ్చింది. కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జయమంగళి నదికి భారీగా నీరు చేరింది. ఆ నీరు పెన్నా నదిలోకి చేరుతోంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలో కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించిపోయాయి. గోపాయలపల్లెలో పంటలు నీట మునిగాయి.



నాగార్జున సాగర్ 8 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నేడు, రేపు మోస్తరు వర్షాలు

పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్

శ్రీశైలం ప్రాజెక్టుకు 73 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సాగర్ నుంచి 76 వేల క్యూసెక్కుల నీరు విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే వీలుందని వెల్లడించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వనపర్తి, జో గులాంబ గద్వాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గురువారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర, కృష్ణా నదులకు స్వల్పంగా వరద కొనసాగుతోంది. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టుకు బుధవారం 55వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 50వేల క్యూసెక్కులను వదులుతున్నారు. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 40వేల క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 73,573 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 884.1 అడుగులకు చేరుకుంది. నాగార్జునసాగర్‌కు 67,676 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిగా(312 టీఎంసీలు) నిండటంతో 4 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



హైదరాబాద్/తాడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ పురుషోత్తంలను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు మహిళా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా దనావత్ సూర్య, బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్‌లను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటివరకు ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ లింబాద్రి వ్యవహరించారు. బాలకిష్టారెడ్డి నియామకంతో బుధవారం సాయంత్రం ఆ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. గురువారం మధ్యాహ్నం బాలకిష్టారెడ్డి బాధ్యతలను స్వీకరించనున్నారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. బాలకిష్టారెడ్డి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం పర్వతాయిపల్లి. గ్రామానికి చెందిన రాంరెడ్డి, ముత్యాలమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఐదు మంది కూతుళ్లు కాగా.. వారిలో బాలకిష్టారెడ్డి చివరి సంతానం. ఆయన పాఠశాల విద్య పూర్తిగా కుమ్మెర గ్రామంలోనే సాగింది. ఉన్నత విద్యను హైదరాబాద్‌లో పూర్తి చేశారు. ప్రస్తుతం మహీంద్ర వర్సిటీలో లా స్కూల్ డీన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో నల్సార్ లా యూనివర్సిటీలో వీసీగా, రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్‌లాలో బాలకిష్టారెడ్డికి మూడు దశాబ్దాలకు పైగా బోధన, పరిశోధన, పరిపాలన అనుభవం ఉంది. మండలి వైస్ చైర్మన్‌గా నియమితులైన పురుషోత్తం ఎకనావిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. బాసర ట్రిపుల్ ఐటీ వీసీగా నియమితులైన గోవర్ధన్ ప్రస్తుతం జేఎన్‌టీయూలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మహిళా వర్సిటీ వీసీగా నియమితులైన దనావత్ సూర్య ఓయూలో తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. రాష్ట్రంలోని మిగిలిన యూనివర్సిటీలకు వీసీల ఎంపికపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. కాగా, మహిళా వర్సిటీ, బాసర ట్రిపుల్ ఐటీల వీసీల నియామకానికి గవర్నర్ ఆమోదం అవసరం లేకపోవడంతో తాజా నియామకాలు జరిగాయి. వీసీలకు సంబంధించిన కోర్టు కేసు నేపథ్యంలో వీరిని ఇన్‌చార్జ్ వీసీలుగా వ్యవహరిస్తున్నారని, కానీ వీరే నిర్ణీత పదవీకాలం వరకు వీసీలుగా కొనసాగుతారని తెలుస్తోంది. మిగతా పది వర్సిటీలకు మాత్రం సెర్చ్ కమిటీల ఆధారంగానే వీసీలను నియమిస్తారు.

సిలబస్‌లో మార్పులు: బాలకిష్టారెడ్డి

విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా ఉన్నత విద్యలో మార్పులు తీసుకురానున్నట్టు మండలి కొత్త చైర్మన్ బాలకిష్టారెడ్డి చెప్పారు. ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇక్కడి విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. ఈ మేరకు సిలబస్‌లో మార్పులు చేస్తామని తెలిపారు. ఉన్నత విద్యా వ్యవస్థలో సంస్కరణలను తీసుకువస్తామన్నారు.

విగ్రహారాధనపై ద్వేషంతో దుశ్చర్య

» ముత్యాలమ్మవారి విగ్రహాన్ని . ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

» ముంబైకి చెందిన సల్మాన్‌గా గుర్తింపు.. మునావర్ జమా ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో 'మత విద్వేష సదస్సు'కు హాజరు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ముంబైకి చెందిన సల్మాన్ సలీమ్ ఠాగూర్ అలియాస్ సల్మాన్ (30)గా గుర్తించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే దు రుద్దేశంతో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు సల్మాన్ హాజరయ్యాడని, ఈ క్రమంలోనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ సదస్సుకు 151 మంది వచ్చారని, వారికి నిర్వాహకులు హోటల్లో వసతి కల్పించారని పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడి తాళం పగులగొట్టాడు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. గుడిపైకి చేరుకొని పైన ఉన్న విగ్రహాన్ని పగులగొట్టటానికి యత్నించాడు. స్థానికుడు ఒకరు గమనించి ఆగంతకుడ్ని పట్టుకున్నాడు. ఈలోపు మరికొందరు స్థానికులు చేరుకొని ఆగ్రహావేశాలతో నిందితుడిపై దాడి చేశారు. స్థానిక మార్కెట్ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. గాయాలపాలైన అతడిని పోలీసులు ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. ఆ తర్వాత విచారణ చేయగా అతను ముంబైకి చెందినవాడని, పేరు సల్మాన్, బీఈ (కంప్యూటర్స్) గ్రాడ్యుయేట్ అని తేలింది. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే సల్మాన్ దేశం నుంచి పారిపోయి విదేశాల్లో తలదాచుకున్న జకీర్ నాయక్, ఇతర ఇస్లామిక్ మతబోధకుల వీడియోలు చూసి ప్రభావితమయ్యాడు. హిందూ మతం, ఆచార వ్యవహారాలు, విగ్రహారాధనపై ద్వేషం పెంచుకుని ఉద్రేకానికి లోనయ్యేవాడు. ఈ క్రమంలోనే 2022లో ముంబై ఆరే సబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గణేశ్ మండపంలోకి పాదరక్షలతో ప్రవేశించాడు. విగ్రహారాధనను అపహాస్యం చేసి, అక్కడి వ్యక్తులతో వాదనకు దిగాడు. దాంతో అతనిపై కేసు నమోదైంది. ఈ ఏడాది జనవరిలో శ్రీమనోకామన సిద్ధి మహదేవ్ మందిరంలోకి ప్రవేశించి శంకరభగవానుడి విగ్రహాన్ని కాలితో ధ్వంసం చేసి, హిందూ మత విశ్వాసాలను అవమానించాడు. దాంతో మిరా భాయిందర్ వసాయి విరార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

నగరంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే సదస్సు..

సికింద్రాబాద్ మెట్రోపాలిస్ హోటల్లో ఈ నెల 1 నుంచి 31 వరకు మునావర్ జమా అనే వక్త (మోటివేషనల్ స్పీకర్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత విద్వేషాలను రెచ్చగొట్టే సదస్సుకు సల్మాన్ హాజరైనట్లు పోలీసుల విచారణలో తేలింది. 151 మంది మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి ఈ సదస్సుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 49 గదుల్లో వారికి బస ఏర్పాటు చేసినట్లు తేలింది. దీంతో గోపాలపురం పోలీసులు మునావర్ జమాతో పాటు హోటల్ యజమాని అబ్దుల్ రషీద్ బషీర్ అహ్మద్, మేనేజర్ రెహ్మాన్‌పై కేసు నమోదు చేశారు. మునావర్ జమా మతం పేరుతో వివిధ వర్గాల మధ్య శత్రుత్వం పెంచుతున్నాడని, ముస్లింలను రెచ్చగొడుతున్నాడని పోలీసులు పేర్కొన్నారు. సల్మాన్‌ను కూడా ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి రెచ్చగొట్టాడని తెలిపారు. మునావర్ జమా సంగతి తెలిసి కూడా హోటల్ యజమాని, మేనేజర్ సదస్సు నిర్వహించేందుకు అతనికి సహకరించారన్నారు. వ్యక్తిత్వ వికాసం ముసుగులో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలిపారు. కేసు విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

మూసీని ఇలా బాగు చేస్తాం..

» దక్షిణ కొరియాలోని సియోల్‌లో అధ్యయనం

» 19 నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన

» ప్రజల అభ్యంతరాల నేపథ్యంలో నిర్ణయం..

» బీఆర్ఎస్, ఎంఐఎం శాసనసభ్యులు దూరం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల తొలగింపుపై క్షేత్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. ప్రజారోగ్యం, హైదరాబాద్ పర్యాటక, వాణిజ్య అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మూసీ ప్రక్షాళనలో ముందుకేసాగాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఖాళీ చేసిన నివాసాల కూల్చివేత చేపట్టిన ప్రభుత్వ విభాగాలు.. మార్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశాయి. నిర్వాసితులను ఒప్పించాకే తదుపరి చర్యలు తీసుకోవాలన్న ఉన్నతస్థాయి ఆదేశాల నేపథ్యంలో వేచి చూస్తున్నాయి. ప్రాజెక్టులో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని తొలి నుంచి యోచిస్తున్న సర్కారు వారిని దక్షిణ కొరియా తీసుకెళ్లాలని నిర్ణయించింది. సుందరీకరణ తర్వాత నది రూపు ఎలా మారనుందో అవగాహన కల్పించేందుకు అధ్యయనానికి తీసుకెళ్లనుంది. 21 మందితో కూడిన బృందం పర్యటనకు ఇటీవల సర్కారు అనుమతి ఇచ్చింది. ఈ నెల 19న మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్, డిప్యూటీ మేయర్, ఉన్నతాధికారులతో కూడిన బృందం దక్షిణ కొరియా వెళ్లనుంది. అక్కడి చాంగి చియోన్‌లో హన్ నది, సియోల్‌లో నేషనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో పర్యటించనున్నారు. 25వ తేదీన తిరిగి రానుంది. గతంలో నది, తీరం ఎలా ఉండేది? తర్వాత ఎలా మారాయో ప్రజాప్రతినిధులకు చూపించనున్నట్టు ఓ అధికారి తెలిపారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరం

బాపూ ఘాట్ నుంచి ఫీర్జాదిగూడ వరకు మూసీ ప్రవహించే నియోజకవర్గాలకు చెందిన అన్ని పార్టీల ఎమ్మెల్యేలను దక్షిణ కొరియాకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. పర్యటనకు వెళ్లేందుకు మొదట బీఆర్ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు ఆసక్తి చూపారు. ఇటీవలి పరిణామాలు, స్థానికుల అభ్యంతరాల నేపథ్యంలో వారు వెళ్తారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మూసీ అభివృద్ధిని తీవ్రంగా వ్యతిరేకిస్తోన్న బీఆర్ఎస్.. పలు ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి స్థానికులకు అండగా ఉంటామని ప్రకటించింది. అలాంటప్పుడు పార్టీ ఎమ్మెల్యేలు దక్షిణ కొరియా వెళితే తప్పుడు సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నట్టు తెలిసింది. బుధవారం తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమావేశం కానున్నారు. మూసీ అంశం ప్రధానంగా చర్చించనున్న ఈ సమావేశం తర్వాత స్పష్టత వస్తుందని ఓ ఎమ్మెల్యే తెలిపారు. ఎంఐఎం ఎమ్మెల్యేలూ పర్యటనకు దూరంగా ఉండనున్నట్లు సమాచారం. అయితే, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా పర్యటనకు వెళ్లవద్దని నిర్ణయించుకున్నట్టు తెలిసింది.

దక్షిణ కొరియా వెళ్లే జాబితా ఇదే..

మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, చామకూర మల్లారెడ్డి (బీఆర్ఎస్), మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్ (కాంగ్రెస్), రాజాసింగ్ (బీజేపీ), మహ్మద్ ముబిన్, కౌసర్ మొహినుద్దీన్, మీర్ జుల్ఫీకర్ అలీ, అహ్మద్ బిన్ బలాల (ఎంఐఎం). పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, ఎంఆర్‌డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి,ఎంఆర్‌డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ దత్తు పంతు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ఎంవీ వెంకటశేఖర్.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.